అమృత తరంగిణి



విశ్వపతి



తిరుమల నారాయణగిరి శ్రీవారి పాదాల వద్ద శ్రీచరణామృతం ప్రథమ ప్రతికి పూజ చేస్తున్న చిత్రం



హర్వార్డ్ యూనివర్సిటీ లైబ్రరీలో లైబ్రరియన్ రిచర్డ్‌ను కలిసినప్పటి చిత్రం

అమృత తరంగిణి

(నా ఆధ్యాత్మిక అనుభవాలు, అనుభూతులు)

విశ్వపతి

తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి

श्री

SHRI DESIGNS

VEDIC LOGO DESIGNERS

www.lordofsevenhills.com

Phone : 98494 43752

HYDERABAD

అమృత తరంగిణి

(నా ఆధ్యాత్మిక అనుభవాలు, అనుభూతులు)

విశ్వపతి

(తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి)

ప్రథమ ముద్రణ : 2022

ప్రతులకు :

T.V.R.K.Murthy
(Viswapathi)
Flat No.903, F-Block
Vertex Sadguru Krupa Apartments
Near Sanghamitra School
Nizampet Road
Hyderabad-500085,INDIA
Ph.+91 9849443752

www.lordofsevenhills.com
E-mail: viswapathi@yahoo.com

Printed at :
VIMAL PRINTERS
1-1-776/3/1, SBI Colony,
Gandhi Nagar, Hyderabad.
Cell : 98491 60301

నివేదన

ఈ సృష్టి మొత్తానికి కారణభూతమైన దివ్యశక్తి 84 లక్షల జీవరాశులను సృష్టించింది. వీటిలో మానవ జన్మ మహోత్కృష్టమైనది. మొదటి జన్మలో మనందరికి ఎంతో విజ్ఞానం విచక్షణ ఉన్నాయి. కాని తరువాత జన్మలు గడుస్తున్న కొద్దీ అనేక పుణ్య, పాపకర్మలు చేస్తూ అజ్ఞానంతో ప్రవర్తిస్తూ, విచక్షణా రహితంగా జీవిస్తూ ఎన్నో కష్టాల పాలవుతున్నాము. ఎన్నో కర్మలను మూటకట్టుకుంటున్నాము. ఇవి తీరడానికి మరల మరల జన్మలెత్తుతూ, మళ్ళీ కొత్త కర్మలు చేస్తూ ఈ జనన మరణ చక్రంలో కొట్టుమిట్టాడుతున్నాము. ఇలా అనేక జన్మలలో పయనిస్తున్న ఆత్మకి ఎన్నో బంధాలు ఏర్పడతాయి. ఆ బంధాల ఫలితంగా తరువాత జన్మలలో అనేక వ్యక్తులతో, అనేక ప్రదేశాలతో మనకు అనుబంధం ఏర్పడి వారితోను, వాటితోను మమకారం ఏర్పడి ఇలా అనేక బంధాలు తెచ్చుకుంటూ కొన్ని వేల జన్మలలో ఈ ఆత్మ ముందుకు పయనిస్తూ ఉంటుంది.

ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో యం.టెక్. చదివిన నేను కొన్నాళ్ళ ఆల్విన్ కంపెనీలోను తరువాత 10 సంవత్సరాలు ఇంజనీరింగ్ కాలేజీలోను పనిచేసాను. 1998 నుంచి వ్యాపార సంస్థలకు వేదశాస్త్రాలు, జ్యోతిష్య శాస్త్రం ఆధారంగా పేర్లు నిర్ణయించడం, లోగోలు డిజైన్ చేయడంలో నిమగ్నమై ఉన్నాను. ఇప్పటిదాకా నేను లోగోలు డిజైన్ చేసిన 6,000 పైగా సంస్థలు దేశ, విదేశాలలో ప్రముఖ స్థానంలో ఉన్నాయంటే అదంతా ఆ శ్రీనివాసుని అనుగ్రహం తప్ప మరొకటి కాదు.

ఆ శ్రీనివాసుని దయ వలన నేను ఇప్పటిదాకా 26 ఆధ్యాత్మిక పుస్తకాలు రచించడం జరిగింది. వీటిలో పదహారు ఆ శ్రీనివాసుని లీలా విశేషాల పైననే! ఈ పుస్తకాలన్నీ దేశ, విదేశాలలోని భక్తులచేత నిత్యం పఠింపబడడం ఆ స్వామి అనుగ్రహం తప్ప మరొకటి కాదు. వీటిలో నేను 2005 సంవత్సరంలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి అనుగ్రహంతో రచించిన శ్రీ వేంకటేశ్వర వ్రతకల్పం 12 భాషల్లోకి అనువదింపబడింది. అటు తరువాత నేను శ్రీ వేంకటేశ్వర వ్రతకల్పంతో పాటు శ్రీలక్ష్మీనరసింహ వ్రతకల్పం, శ్రీఆనంద ఆంజనేయం, శ్రీమహేశ్వర వ్రతం, శ్రీసుబ్రహ్మణ్య వ్రతం, శ్రీ సాయిరక్షా వ్రతం, శ్రీరామరక్షా

వ్రతం, శ్రీజ్ఞాన సరస్వతి వ్రతం, శ్రీకృష్ణ వ్రతం రచించడం జరిగింది. ఎంతో తేలిక భాషల్లో, ఎటువంటి నియమనిష్ఠలు అవసరం లేకుండా చేసుకోగలిగే ఈ వ్రతాలు ఈ రోజు ప్రపంచం అంతా నిత్యం ఎందరో భక్తుల గృహాలలోను, ఎన్నో ఆలయాలలోను ఆచరింపబడుతున్నాయి.

ఈ పుస్తకాలు చదివిన వారందరు ఎంతో శుభప్రదంగా జీవిస్తున్నారు. ఇదంతా ఆ శ్రీనివాసుని అనుగ్రహం తప్ప మరొకటి కాదు. ఈ పుస్తకాలు రచిస్తున్నప్పుడు నాకు ఎన్నో దివ్య అనుభూతులు కలిగాయి. ఎందరో దేవతలు, మహర్షులు, యోగులు, సిద్ధుల అద్భుత దర్శనం లభించింది. మాటలలో వర్ణించలేని ఎన్నో దివ్య అనుభూతులు కలిగాయి.

ఇన్ని సంవత్సరాలుగా నా వద్దకు అనేక సలహాల కోసం ఎన్నో వేలమంది వచ్చారు. వీరిలో కొందరు నాకెంతో ఆప్తులయ్యారు. కొన్ని సంవత్సరాల క్రితం నేను ధ్యానంలో ఉన్నప్పుడు నాకు గత జన్మల విశేషాలు ఎన్నో తెలిసాయి. కొన్ని జన్మల క్రితం నేను ఒక హిమాలయ దివ్య ఆశ్రమంలో ఉన్నట్లు గ్రహించాను. అప్పుడు ప్రపంచంలోని ఎన్నో ప్రదేశాలనుంచి 108 మంది వ్యక్తులు వచ్చి నన్ను కలుసుకున్నారు. వారందరు కొన్ని సంవత్సరాలు నాతో పాటు ఆ ఆశ్రమంలో గడిపారు. వారందరు తరువాత అనేక జన్మలలో అనేక దేశాలలోను, అనేక మతాలలోను జన్మించి ఈ జన్మలో తిరిగి అందరు నన్ను కలుసుకుంటున్నారు. వీరిలో కొందరు నా కుటుంబ సభ్యులుగా జన్మిస్తే, కొందరు వేరే దేశాలలో, వేరే రాష్ట్రాలలో వేరే మతాలలో, వేరే కులాలలో కూడా జన్మించారు. వీరు ఒక్కొక్కరు నన్ను ఈ జన్మలో తిరిగి చాలా ఆశ్చర్యకర రీతులలో కలుసుకుంటున్నారు.

నేను ధ్యానంలో ఉన్నప్పుడు వీరందరు హిమాలయాశ్రమంలో నన్ను కలిసిన తరువాత ఏయే జన్మలలో ఎక్కడ జన్మించింది, ఎలా జీవించింది కూడా నాకు గోచరించింది. ఇంతే కాకుండా మరో విశేషమేమిటంటే వీరిలో చాలామందికి ఇక కొన్ని జన్మల తరువాత జన్మ రాహిత్యం కలిగి ఈ సృష్టి మొత్తానికి కారణభూతమైన ఆ దివ్యశక్తిలో కలవబోతున్నట్లు గ్రహించాను.

ఇలా నా వద్దకు వచ్చిన వీరి జన్మ జన్మల జీవిత విశేషాలను వివరిస్తూ ఇంతకుముందు అమృత దర్శనం అనే పుస్తకం రచించాను. ఇంతే కాకుండా

మానవుల పూర్వజన్మల వాసనల ప్రభావం ఎలా ఉంటుందో కూడా ఈ పుస్తకంలో వివరించాను. ఈ పుస్తకం వ్రాస్తున్న సమయంలో నాకు ఎన్నో గొప్ప అనుభూతులు కలిగాయి. ధ్యానంలో ఉంటూ ఎక్కడో హిమాలయాలలో సంచరిస్తూ, అక్కడి సిద్ధ పురుషుల్ని కలుసుకుంటూ, ఎన్నో గొప్ప విషయాలు తెలుసుకొంటూ వ్రాయగలిగాను. ఎందరో దేవతలను, మహర్షులను కూడా దర్శించాను.

నేను 2005 లో శ్రీవేంకటేశ్వర వ్రతకల్పం రచించినప్పుడు ఆ శ్రీనివాసుడు తిరుమలలో నాకు విశ్వరూప దర్శనం అనుగ్రహించి ఈ వ్రతకల్ప విధానాన్ని అనుగ్రహించారు. అటు తరువాత నా జీవితంలో ఎన్నో మార్పులు జరిగాయి. ఇప్పటికి ధ్యానంలో ఉన్నప్పుడు ఆ పరబ్రహ్మమూర్తి విశ్వరూప దర్శనం నాకు నా హృదయంలోనే లభిస్తుంది. అప్పుడు మాటలలో వర్ణించలేని ఆనందం కలుగుతుంది. అలా దర్శనం కలిగిన ప్రతీసారీ ఎందరో దేవతలు, ఎందరో మహర్షులు ఆ మహాశక్తిని కొలుస్తూ ఎన్నో స్తోత్రాలు చదువుతుండగా అవన్నీ నా శరీరమంతా దివ్యతరంగాలుగా ప్రతిధ్వనిస్తుంటాయి. ఆ స్థితిలో మనందరం అనుకునే బ్రహ్మానందం కలుగుతుంది. శరీరమంతా తేలిపోతూ దివ్యలోకాలలో విహరిస్తూంటుంది.

నాకు జరిగిన అనేక ఆధ్యాత్మిక అనుభవాలు, అనుభూతులతో ఈ అమృత తరంగిణి పుస్తకం వ్రాయడం జరిగింది. ఈ పుస్తకంలోని విషయాలు కొన్ని నమ్మశక్యం కానివిగా అనిపిస్తాయి. అసలు ఏ మాత్రం ఊహకు కూడా అందనివిగాను కూడా అనిపించవచ్చును. ఈ పుస్తకంలోని విషయాలు అర్థం చేసుకుంటే మనం నిత్య జీవితంలో ఎదుర్కుంటున్న ఎన్నో ప్రశ్నలకు సమాధానం లభిస్తుంది. ఈ పుస్తకాన్ని నెమ్మదిగా చదవండి. అంతే కాదు... ఒకటికి రెండుసార్లు చదవండి అప్పుడే మీకు ఇందులో వ్రాసిన విషయాలన్నీ తేలికగా అర్థమవుతాయి. మీకు జీవితంలో ఏ సమస్య కలిగినా, మనశ్శాంతి లేకపోయినా ఈ పుస్తకంలో ఏవైనా నాలుగు పేజీలు చదివితే వెంటనే మీ సమస్యకు పరిష్కారం దొరికి మీకు పూర్తి మనశ్శాంతి లభిస్తుంది. ఇది సత్యం...

ఈ పుస్తకంలో వ్రాసిన విషయాలన్నీ మీలో కొందరికి ఎప్పుడో తెలిసిఉండవచ్చును. మీలో చాలామంది సాధారణ ప్రపంచానికి సామాన్య

వ్యక్తులుగా కనబడుతున్న సిద్ధ పురుషులు కూడా కావచ్చును. మీ అందరికి ఎన్నో గొప్ప అనుభూతులు కలిగివుండవచ్చును. ఎందరో దేవతల దర్శనం కూడా లభించి ఉండవచ్చును. ఎవరి అనుభూతులు వారికే ప్రత్యేకం కదా! నేను ధ్యానంలో ఉన్నప్పుడు నాకు కలిగిన అనుభూతులు మీతో పంచుకుంటున్నాను. ఈ పుస్తకం పూర్తిగా చదివి మీకు కలిగిన అనుభూతిని నాతో ఫోన్ ద్వారా గాని, ఈ మెయిల్ ద్వారా గాని పంచుకుంటే సంతోషిస్తాను.

నేను వ్రాసిన ప్రతీ పుస్తకం లాగానే, ఈ అమృత తరంగిణి పుస్తకం వ్రాస్తున్నంతసేపు నాకు ఈ అక్షర మహా ప్రసాదాన్ని అనుగ్రహించిన తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారికి శతకోటి నమస్కారాలు... అలాగే నన్ను అనుగ్రహించిన దేవతలకు, మహర్షులకు, యోగులకు, సిద్ధులకు నా నమస్కారాలు. ఈ పుస్తక ప్రచురణలో ఎన్నో విధాల సహాయపడిన నా కుటుంబ సభ్యులకు, బంధువులకు, ఎందరో మిత్రులకు, శ్రేయోభిలాషులకు నా కృతజ్ఞతలు. ఈ పుస్తకాన్ని ఎంతో అందంగా డి.టి.పి. చేసిన శ్రీ తామరపల్లి కృష్ణ కు, ఎంతో చక్కగా ప్రింట్ చేసిన విమల్ ప్రింటర్స్ శ్రీమతి & శ్రీ సత్యనారాయణ గారికి నా కృతజ్ఞతలు. వీరందరికి ఆ శ్రీలక్ష్మీశ్రీనివాసుల అనుగ్రహం ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థిస్తున్నాను.

శ్రీలక్ష్మీ శ్రీనివాస కటాక్ష సిద్ధిరస్తు
సర్వేజనా సుఖినోభవంతుః
సమస్త కళ్యాణానిభవంతుః

తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి
viswapathi@yahoo.com
Ph.: 98494 43752

Hyderabad
2022

అంకితము

ఈ అమృత తరంగిణి పుస్తకాన్ని
శ్రీలక్ష్మీశ్రీనివాసుల దివ్య చరణారవిందములకు
భక్తితో సమర్పిస్తున్నాను.

తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి

శుభం భూయాత్

ఏదైనా మంచి పని జరగాలంటే నాలుగు విషయాలు ఉండాలి అని పెద్దలు చెప్తారు. అవే మానవ ప్రయత్నం, పూర్వ జన్మ సంస్కారం, పెద్దల ఆశీస్సులు, భగవంతుని అనుగ్రహం. మొదటి మూడు ఉన్నా నాలుగోది లేకపోతే ఆ పని జరగదు అని పెద్దలు చెప్తారు. నేను ఈ రోజు ఇన్ని పుస్తకాలు రాయగలగడం పూర్తిగా ఆ శ్రీనివాసుని, సర్వ దేవతల అనుగ్రహం తప్ప మరొకటి కాదు. ఈ అమృత తరంగిణి రాస్తున్నప్పుడు కూడా అనేక అద్భుతాలు చూసాను. ఈ పుస్తకం కొన్ని నెలలుగా రాస్తున్నప్పటికి చివరికి కార్తీక సోమవారం, అదీ క్షీరాబ్ది ద్వాదశితో కలిసి ఉన్నరోజు పూర్తి కావడం శివకేశవుల అనుగ్రహం తప్ప మరొకటి కాదు.

ఈ పుస్తకం ధ్యానంలోకి ఎంతో ఉన్నత స్థాయిలోకి వెళ్ళి రాసాను. అలా రాస్తున్నప్పుడు మధ్య మధ్యలో లేచి వెళ్ళి తిరిగి వచ్చినప్పుడు కొన్ని కొత్త వ్యాక్యాలు కనబడేవి. ఒకటి రెండు సార్లు నేనే రాసానేమో, బహుశా హడావిడిలో గమనించి ఉండను అనుకున్నాను. కాని తరువాత ఇలా అప్పుడప్పుడు జరగడంతో నాకు చాలా ఆశ్చర్యం వేసింది. ఇదంతా ఎవరో దేవతలు రాస్తున్నట్లు అనిపించింది. ఆహా! ఎంతటి భాగ్యం!

ఇంకో విశేషం ఏమిటంటే ఈ పుస్తకం తెలుగు టైపింగ్ చేసిన తరువాత ఒకసారి మళ్ళీ ప్రూఫ్ రీడింగ్ చేద్దామని వ్రాతప్రతి ప్రక్కన పెట్టుకొని కంప్యూటర్‌లో చూస్తూ ఉంటే ఒక అద్భుతం గమనించాను. అది గమనించగానే నా ఒళ్ళు జలజరించింది. నేను ఈ పుస్తకంలో ఏయే వ్యాక్యాలైతే నేను రాయలేదో, ఎవరో దేవతలు రాసారు అని అనుకున్నానో అవన్నీ వ్రాతప్రతిలోనుంచి అదృశ్యమయ్యాయి. అంటే కంప్యూటర్‌లోకి టైప్ చెయ్యగానే ఆ దేవతల అక్షరాలు ఇక్కడ వ్రాతప్రతిపై మాయమయ్యాయి. ఎంత అద్భుతం! ఇదంతా ఆ శ్రీనివాసుడు, ఎందరో దేవతల అనుగ్రహం తప్ప మరొకటి కాదు. ఇది గమనించిన నా ఆనందానికి అంతులేదు.

ఈ పుస్తకంలో ప్రతీ అక్షరం దైవదత్తమే. ఋషిప్రోక్తమే. అందుకే ఈ పుస్తకం చదువుతున్న మీ అందరికీ కూడా తప్పక అద్భుత అనుభవాలు కలుగుతాయని నా నమ్మకం, నా విశ్వాసం. ఈ అమృత తరంగిణి పుస్తకం చదవడం పూర్తి చేసే సరికి మీకు సరికొత్త ఉత్సాహం, జీవితంపై గొప్ప అవగాహన తప్పక కలుగుతాయని నా నమ్మకం.

ఈ అమృత తరంగిణి ఆ శ్రీనివాసుడు, అనేక దేవతల అనుగ్రహం చేత రచింపబడ్డది కాబట్టి ఈ పుస్తకాన్ని మీరు నిత్య పారాయణ పుస్తకం లాగా కూడా చదువుకోవచ్చు. అంతే కాదు ఇందులో ప్రతీ అక్షరం దేవతలచే అనుగ్రహింపబడినవి కాబట్టి మీరు జీవితంలో ఏ సమస్య వచ్చినా ఇందులో ఏ అధ్యాయమైనా చదవండి. చదవడం పూర్తి అయ్యే సరికి మీకు ఆ సమస్యకు తప్పక పరిష్కారం లభిస్తుంది. మీకు దైవానుగ్రహమూ, మనఃశ్శాంతి తప్పక లభిస్తుంది.

శుభం భూయాత్

1

ప్రతి మనిషి పుట్టినప్పటినుంచి ఎన్నో కష్టసుఖాలను అనుభవిస్తూ సంతోషకరమైన, బాధాకరమైన అనేక సంఘటనలు తాను అనుభవిస్తూ తన చుట్టూ ఉన్న వారి జీవితాలలో చూస్తూ జీవనం సాగిస్తాడు. ఈ పయనంలో తన తల్లి దండ్రులు, తోబుట్టువులు, దగ్గర బంధువులు ఇలా అనేక మందితో అనేక విధాలైన అనుభవాలను పొందుతాడు. కొందరు ఒకసారి సంతోషపెడతారు, కొందరు ఒకసారి బాధపెడతారు. ఇలా ప్రతీ వ్యక్తి జీవన గమనం ఇలా రకరకాల సంఘటనల మిశ్రమంగా ముందుకు సాగుతూ ఉంటుంది.

కొన్ని బంధాలు ఇలా వచ్చి అలా వెళ్ళిపోతాయి మరికొన్ని బంధాలు ఎక్కడి నుండో వచ్చి గాఢంగా పెనవేసుకుపోతాయి. ఇవన్నీ మనకు ఎంతో ఆశ్చర్యాన్ని కలుగజేస్తాయి. ఇందాక చెప్పినట్లు వీటిలో కొన్ని ఆనందాన్ని కలుగజేస్తే, కొన్ని ఆవేదనను మిగులుస్తాయి. ఇలా ఎందుకు జరిగింది అనే ప్రశ్న మనకు కలుగుతూ ఉంటుంది. మన చుట్టు ప్రక్కల వారికి ఎవరికీ రాని కష్టం మనకే ఎందుకు వచ్చిందా అనిపిస్తుంది. మనం ఇంత నిజాయితీగా

బ్రతుకుతున్నా కూడా మనకే ఎందుకు ఈ కష్టాలు రావాలి అనే ఆలోచన మన మనస్సులని ఎప్పుడూ తొలిచేస్తూ ఉంటుంది.

ఈ అమృత తరంగిణి పుస్తకంలో మీకు ఇటువంటి అనేక ప్రశ్నలకు కొంతవరకు సమాధానం తప్పక దొరుకుతుంది. ఈ పుస్తకం నెమ్మదిగా ఒకొక్క పేజి దగ్గర కాసేపు ఆగి దానిలో ఉన్న విషయాలు గురించి కొద్దిసేపు ఆలోచించి తరువాత ముందుకు వెళ్ళండి. ఈ పేజీలో మీరు చదివిన సంఘటనలు మీకు ఎప్పుడైనా జరిగాయా, ఇటువంటి ఆలోచనలు మీకు ఎప్పుడైనా వచ్చాయా అని ఆలోచించండి. అప్పుడు మీకు ఇక్కడ నేను రాసిందే కాక ఇంకా అనేక విషయాలు మీకే స్వయంగా స్ఫురిస్తాయి. మిమ్మల్ని ఇన్నేళ్ళుగా వేధిస్తున్న అనేక ప్రశ్నలకు సమాధానాలు దొరుకుతాయి. నేను రాసినవే కాదు! ఒక్కో పేజి చదువుతుంటే ఇక్కడ రాయని విషయాలు మీ మనస్సుకి తెలుస్తూ ఉంటాయి. ఈ విషయం మీరు పుస్తకం ఒక్కో పేజీ చదువుతున్న కొద్దీ అర్థం చేసుకుంటారు.

నా జీవితంలో జరిగిన అనేక సంఘటనలలో కొన్ని ఈ పుస్తకంలో మీతో పంచుకున్నాను. వీటిలో మీకు కొన్ని ఆశ్చర్యం కలిగించేవిగాను, కొన్ని అసలు ఏమాత్రం నమ్మశక్యం కానట్లు ఉంటాయి. అసలు ఇటువంటి సంఘటనలు జరుగుతాయా అని మీకు అనిపించవచ్చు. ఇలా అనిపించడం సాధారణ విషయం. నాకు జరిగిన అనుభూతులు జరిగినవి జరిగినట్లుగా రాసాను. ఏమాత్రం కల్పనకు గాని, అతిశయోక్తికి గాని తావివ్వలేదు.

అయితే ఈ పుస్తకంలో నా జీవితంలో జరిగిన అనేక సంఘటనలు నాకు జరిగిన అనుభూతులు ఎక్కడా తర్కంతో చూడవద్దు. మనం ప్రతి విషయాన్ని తర్కంతో చూడలేము. ముఖ్యంగా భగవంతుడికి సంబంధించిన విషయాలు, ఆధ్యాత్మిక విషయాలు చదివేటప్పుడు తర్కంతో చూస్తే మనం "సత్యం" కోల్పోతాము. ఎందుకంటే తర్కం ఎప్పుడూ ఒక పరిధికి లోబడి ఉంటుంది. కాని ఈ సృష్టిలో ఎన్నో విషయాలు మనకు తెలిసిన అన్ని పరిధిలూ దాటి ఉంటాయి. ఏ పరిధిలోను ఇమడనివి అయి ఉంటాయి.

అలాగే చాలా సార్లు మనం గొప్ప గ్రంథాలు చదువుతున్నప్పుడు ఒక మాయ మనల్ని కప్పేస్తుంది. ఆ మాయ ఎంత తీవ్రంగా ఉంటుంది అనేది మన పూర్వజన్మల పుణ్యఫలంబట్టి ఉంటుంది. ఆ మాయ వలన మనం చదివే విషయాలు మనకి సరిగ్గా అర్థం కాకపోవడం గాని, ఏ అర్థము లేనట్లుగాను, పూర్తి సత్యదూరం అయినట్లు, ఒక్కొక్కసారి మనస్సుకి చికాకు కలిగించేటట్లుగా కూడానూ అనిపిస్తాయి. ఇదంతా నేను చెప్పిన ఆ మాయ ప్రభావమే అని గమనించండి. అందుకే మనం చాలా గొప్ప గ్రంథాలు చదివినప్పుడు, చదువుతున్నంతసేపు మనకు అర్థం అయినట్లే ఉంటుంది. కాని తరువాత ఏమీ గుర్తు ఉండదు. అసలు చాలా సార్లు ఆ పుస్తక సారం మన మనస్సుకి ఎక్కదు. ఇందువలననే ఒకే పుస్తకం చదివిన అనేక మంది అనేక విధాలుగా అనుభూతి చెందుతారు.

నా జీవితంలో చిన్న నాటినుండి అనేక అద్భుత సంఘటనలు జరిగాయి. ప్రతీ రోజు భగవంతుడి ఉనికి నా జీవితంలో గమనిస్తున్నాను. ఈ సంఘటనలు అన్నీ నాకు ఎన్నో మధుర అనుభూతులని కలిగించాయి. ఇంజనీరింగ్ చదివిన నేను 28 ఆధ్యాత్మిక పుస్తకాలు రచించడం ఈ పుస్తకాలన్నీ ప్రపంచ వ్యాప్తంగా చదవబడడం ఆ భగవంతుడి అనుగ్రహం తప్ప మరొకటి కాదు. నా జీవన ప్రయాణంలో నాకు జరిగిన అనేక అద్భుత సంఘటనలలో కొన్ని ఇక్కడ మీతో పంచుకుంటున్నాను. ఇవన్నీ మీకు ఆనందాన్ని కలుగజేస్తాయని నమ్ముతున్నాను.

ఈ పుస్తకంలో మీరు చదివే ప్రతీ వాక్యం దైవదత్తంగా రాసినవే ఏవీ కూడా ఏ మాత్రం కల్పితాలు కాదు. ధ్యానంలో నా స్ఫురణకు ఒక ధారలా వచ్చిన వాక్యాలన్నీ ఈ పుస్తకంలో రాసాను. నా కంటికి, ఆత్మకు, ఈ భౌతిక ప్రపంచంలోను, వేరే డైమెన్షన్‌లోను నాకు కనబడినవి, వినబడినవి ఇక్కడ రాసాను. ఒక్కోసారి ఇవన్నీ గజిబిజిగా ఉండి మిమ్మల్ని కాస్త అయోమయంలో పడవేయవచ్చు అప్పుడు కాసేపు ఆగి ఒకటి రెండు సార్లు ఆ పేజీని కూలంకషంగా చదవండి. అప్పుడు అక్కడ రాసిన విషయాలలోని అంతరార్థం తేలికగా అర్థమవుతుంది.

అసలు ఈ పుస్తకం రాస్తున్నప్పుడు నా కంటి ముందు ఎందరో దేవతలు ప్రత్యక్షమవటం ఎన్నో అద్భుత విషయాలు నాకు చెప్పటం జరిగింది. దేవతలే కాక ఎన్నో యుగాలలో ఉన్న అనేకమంది మహర్షులు నా మనో నేత్రానికి దర్శనమిచ్చి నన్ను అద్భుతమైన లోకాలకు తీసుకువెళ్ళారు. ఈ సృష్టిలోని జీవకోటి మొత్తానికి సంబంధించిన అనేక విషయాలు వారు నాకు అనుగ్రహించారు. ఇవన్నీ రాస్తే ఈ పుస్తకం కొన్ని వేల పేజీలకు వెళ్ళగలదు. ఇది ఈ కాలంలో చదవడానికి ఏ మాత్రం అనువుగా అనిపించదు. అందుకని నేను చాలా మటుకు తగ్గించి నాకు తెలిసిన కనిపించిన విషయాలలో అతి కొద్ది విషయాలు మాత్రమే ఈ పుస్తకంలో మీతో పంచుకుంటున్నాను. అయితే ఇలా తగ్గించడం కూడా నాకు చాలా కష్టతరమే అయ్యింది.

అయినా ప్రస్తుత కలియుగంలో ఇంతకు మించి రాయడం అంత సమంజసంగా నాకు తోచలేదు. అందుకే ఈ పుస్తకం చదువుతున్నప్పుడు మీకు అక్కడక్కడ కొంత అస్పష్టంగాను, కొంత వివరంగా రాయబోయి తగ్గించినట్లుగాను అనిపిస్తుంది. కాని విజ్ఞులైన మీకు అలా అనిపించిన చోట కాసేపు ఆగి మీ మనస్సును ప్రశాంతంగా ఉంచుకుంటే ఇక్కడ నేను రాయని విషయాలు కూడా మీకు స్ఫురిస్తాయి. అది మీరు నమ్ముకున్న గురువుల నుంచి ఒక దైవిక సందేశం రూపంలో మీకు ఆ క్షణంలో మనస్సులో స్ఫురిస్తుంది.

ఇందాక చెప్పినట్లుగా ఈ పుస్తకంలో ప్రతీ సంఘటన సత్యం నేను రాసిన ప్రతీ అక్షరం దైవ, ఋషి అనుగ్రహం. అందువలన మీరు ఈ పుస్తకం చదువుతున్నప్పుడు ఎన్నో దివ్య అనుభూతులకు లోనౌతారు. మీరు కొలిచే దైవం, మీరు నమ్ముకున్న గురువులు ఈ పుస్తకంలోని విషయాలు మీకు తేలికగా అర్థమయ్యేలా మిమ్మల్ని అనుగ్రహిస్తారు.

ముందు అధ్యాయాలలో మీరు నా జీవితంలో జరిగిన భగవంతుని లీలలు, నాకు తెలిసిన వేదాంత విషయాలు చదువుతారు. మీకు ఒక్కొసారి ఈ రెండు కలిపి చదవటం నచ్చకపోవచ్చును. కొంత అసందర్భంగాను, కొంత అసహజంగాను అనిపించవచ్చును. కాని భగవంతునిపై పూర్తి నమ్మకం, మన నిత్య జీవితంలో తాత్విక చింతన కలిగి ఉన్నప్పుడే మన జీవన ప్రయాణం అమృత తరంగిణి అవుతుందని నా నమ్మకం.

2

మనం అందరం ఈ సృష్టి మొదటినుంచి ఎన్నో జన్మలెత్తుతూ ఎన్నో పుణ్య, పాపకర్మలు చేస్తూ వస్తున్నాం. ఒక జన్మనుంచి తరువాత జన్మలకు వెళ్ళగానే గడచిన జన్మ విశేషాలన్నీ మరిచిపోతాం. ఒక జన్మలో ఎన్నో పుణ్యకార్యాలు చేస్తాం, తరువాత జన్మలో మరెన్నో పాపకార్యాలు చేస్తాం, ఇలా ప్రతి మనిషి జనన మరణ చక్రంలో తిరుగుతూ వుంటాడు. అయితే ఒక్కొక్క జన్మలో ముందుకు వెళ్తున్నకొద్దీ భగవంతుడికి మరింత చేరువకావడానికి ప్రయత్నించాలి. అదే అన్ని జీవుల పుట్టుక పరమార్థం.

ప్రతి మనిషికి వారి జీవితంలో ఎన్నో సుఖాలు, కష్టాలు అనుభవంలోకి వస్తాయి. సుఖాలు వచ్చినప్పుడు పొంగిపోకూడదు, కష్టాలు వచ్చినప్పుడు కృంగిపోకూడదు. రెండిటిని సమానంగా స్వీకరించగలగాలి. మనం ఏ కర్మచేసినా ఆ కర్మని భగవదర్పణంగా చేయాలి. ఏ ఫలాన్ని ఆశించకూడదు. ఎన్ని పుణ్యకార్యాలు చేసినా పుణ్యఫలాన్ని కూడా ఆశించకూడదు. అలా కొన్ని వేల జన్మలు జీవించగలగితే అప్పుడే జన్మరాహిత్యం కలుగుతుంది. మనకు పూర్వజన్మల ఋణాలు ఎంతవరకు ఉంటాయో

అంతవరకే ఆయా మనుషులుతో బంధం ఉంటుంది. ఆ ఋణం తీరిపోగానే ఆ వ్యక్తి మన నుంచి దూరమౌతాడు. లేదా మనం ఆ వ్యక్తినుంచి దూరంగా వెళ్ళిపోతాం. అందుకనే ఈ జీవితంలో ఒక్కో దశలో కలిసి కొన్ని సంవత్సరాలు మనతో స్నేహం చేసి ఎంతో దగ్గరకి వచ్చి తిరిగి దూరమైపోతారు ఇక మళ్ళీ జీవితంలో కనబడరు ఆ ఋణం అంతవరకే అన్నమాట. ఎక్కడో పూర్వజన్మల బంధం మనల్ని వారితో అలా కొంతకాలం కలుపుతుంది.

ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పుకోవాలి. ఈ జన్మలో ఎంతో పుణ్యం చేస్తే ఆ పుణ్యఫలం తరువాత జన్మలోనే మనకి అనుభవానికి వస్తుందని ఎక్కడా లేదు. మనం ఎప్పుడో నూరు జన్మల వెనుక ఒక జన్మలో చేసుకున్న పుణ్యఫలం ఇప్పుడు అనుభవిస్తూ ఉండవచ్చు. అలాగే ఒక 20 జన్మల నాటి పాప ఫలం వచ్చే జన్మలో అనుభవానికి రావచ్చు. ఏ జన్మలో చేసుకొన్న పాపపుణ్యాల ఫలం తరువాత ఏ జన్మలో మనకు అనుభవానికి వస్తుందన్నది ఆ భగవంతుని నిర్ణయం ప్రకారమే జరుగుతుంది.

అందుకే ఒక్కోసారి మన చుట్టూ ఉన్న వారిలో కొంతమంది ఎంతో అహంకారంగా ఎన్నో పాపాలు చేస్తున్నప్పటికి ఈ జన్మలో వారు సమాజంలో ఎంతో ధనవంతులు గాను ఎన్నో ఉన్నత స్థానంలోను ఉండడం గమనిస్తుంటాము. వారింత నీచమైన పనులు చేస్తున్నప్పటికి ఇన్ని భౌతిక సుఖాలు ఎందుకు అనుభవిస్తున్నాడని మనం అనుకుంటాము. అంతే కాదు ఒక్కొక్కసారి వారి జీవితాలు కూడా ఎంతో సాఫీగా జరిగిపోవడం కూడా గమనిస్తాం. ఇదంతా ఆ జీవి పూర్వజన్మలలో ఏదో జన్మలో చేసుకున్న గొప్ప పుణ్యఫలం తప్ప మరొకటి కాదు. ఇప్పుడు చేస్తున్న ఈ దుర్మార్గపు పనుల వలన వచ్చే జన్మలలో ఎప్పుడో తప్పక ఫలితం అనుభవిస్తాడు. ఇది తథ్యం.

మనుషులే కారు, మనం ఈ జన్మలో నివసిస్తున్న ప్రదేశానికి కూడా మన పూర్వజన్మతో ఏదో సంబంధం తప్పక ఉండి తీరుతుంది. అందుకే మనం ఒక్కొక్కసారి ఏదో చదవాలనుకొని, ఇంకేదో చదువుతాము అలాగే ఎక్కడో ఉద్యోగం చేయాలని, మరెక్కడో ఉద్యోగం చేస్తాం. ఒక్కొక్కసారి మనం ఏ మాత్రం కలవ వద్దని మనస్సులో అనుకున్న మనుషుల్నే మళ్ళీ పదే పదే కలుస్తాం. అలాగే ఒక్కొక్కసారి ఎంతో కోపం తెచ్చుకున్న వాళ్ళమీద తరువాత కాలంలో ఎంతో

ప్రేమ పుట్టుకు వస్తుంది. అలాగే మనం ఎంతో అభిమానించే వాళ్ళమీద ఒక్కొక్కసారి మనకే తెలియకుండా నిగ్రహించుకోలేనంత కోపం వస్తుంది.

ఆ క్షణం గడచిన తరువాత అప్పుడు మనకి అంత కోపం ఎందుకు వచ్చిందా అని పశ్చాత్తాప పడుతుంటాం. దీనికి అంతా కారణం పూర్వజన్మల బంధాలే. మనుషులే కాదు మనచుట్టూ ఉండే పెంపుడు జంతువులు కూడా మనతో పూర్వజన్మలో ఏదో బంధం కలిగి ఉంటాయి. అందుకే ఒక్కోసారి ఎక్కడినుంచో వచ్చిన ఒక కుక్కనో, పిల్లినో, ఎంత కసిరినా మన ఇల్లు వదిలిపెట్టకుండా ఉండిపోవడం గమనిస్తుంటాము. అది జీవితాంతం మనల్ని అంటిపెట్టుకొని ఉంటుంది. ఎన్నో వేల జన్మలలో ఈ జీవి మరేదో జీవి రూపంలో ఏదో ఒక జన్మలో మనతో ఎంతో బంధం కలిగి ఉందన్నమాట. అందుకే తిరిగి ఈ జన్మలో మనదగ్గరకి ఇలా జేరి ఈ జన్మ పూర్తి అయ్యే వరకు మనతోనే ఉంటుంది.

3

ఈ సృష్టి ప్రారంభంలో బ్రహ్మాండమైన శక్తి ఉన్నది. ఆ శక్తి ఎంతో తేజోవంతమైనది. ఆ శక్తికి స్వరూపం లేదు ఆ మహాశక్తి మన కంటికి కనబడుతున్న సూర్యుడికంటే కోటి రెట్లు ప్రకాశవంతమైనది. ఆ దివ్యశక్తినుండే ఈ విశ్వమంతా ఉద్భవించింది. ఇన్ని గ్రహాలు, ఇన్ని నక్షత్రమండలాలు, అన్నీ ఈ పరబ్రహ్మం నుంచే ఉద్భవించాయి.

ఈ శక్తినుంచే మనకు తెలిసిన 33 కోట్ల దేవతలు ఆవిర్భవించారు. మనకు తెలిసిన బ్రహ్మ, విష్ణువు, పరమేశ్వరుడు, శ్రీ సరస్వతి, శ్రీ మహాలక్ష్మి, శ్రీ పార్వతీదేవి, శ్రీ కుమారస్వామి, శ్రీ విఘ్నేశ్వరుడు ఇలా మొదలైన దేవతలందరిని ఆ మహాశక్తే సృష్టించింది. ఈ దివ్యశక్తియే ఈ విశ్వం మొత్తాన్ని సృష్టించింది. ఈ దివ్యశక్తినండే 84 లక్షల జీవరాశులు ఉద్భవించాయి. అప్పటికి ఇంకా మనకు తెలిసిన వేదాలు, పురాణాలు, ఉపనిషత్తులు ఏమీ లేవు. విశ్వమంతా బ్రహ్మాండమైన చైతన్యం ఆవరించి ఉంది. ఆ చైతన్యం నుంచే ఇవన్నీ ఆవిర్భవించాయి. చలనం ఉన్నవి, చలనం లేనివి అన్నీ ఆ దివ్యశక్తినుంచే ఆవిర్భవించాయి.

ఈ అద్భుత శక్తినుంచే మనకు కనబడే నక్షత్ర మండలాలు కంటికి కనబడని కోట్లాది గ్రహమండలాలు ఉద్భవించాయి. ఈ గ్రహమండలాలలో ఎందరో దేవతలు మహాపురుషులు ఉన్నారు. వీరందరు ఒకరితో మరొకరు నిత్యం అనుసంధానమై ఉంటూ వీరందరు ఈ సృష్టిని ఎప్పుడూ కాపాడుతూ ఉంటారు. వీరందరు ఒక గ్రహమండలం నుంచి మరొక గ్రహమండలానికి కేవలం రెప్పపాటు కాలంలో ప్రయాణించగలరు.

వారు ప్రయాణించే మార్గం, లోకం వేరు మనకు కనీసం ఊహకైనా అందనిది. ఈ విశ్వం మొత్తానికి కారణభూతమైన ఆ దివ్యశక్తిని వీరు ఎల్లప్పుడూ ఆరాధిస్తూ ఉంటారు. వారికి ఆకలి, కోపం, నిద్ర, ఆయుష్షు ఉండవు. వీరందరు ఎప్పుడూ ఒకరితో ఒకరు అనుసంధానమై, అందరు ఆ దివ్యశక్తితో అనుసంధానమై ఉంటారు. సామాన్య మానవులకు వీరి శక్తి అర్థం చేసుకోవడం చాలా కష్టతరమైనది.

అయితే అప్పుడప్పుడూ కొన్ని సంవత్సరాలకు వీరు భూమిపై మహాపురుషుల రూపంలో జన్మిస్తుంటారు. ఆదిశంకరాచార్యులు, శ్రీమద్ రామానుజాచార్యులు, అన్నమయ్య, భక్త రామదాసు, కబీరు, తులసీదాసు, ఇటీవలి కాలంలో శ్రీశ్రీశ్రీ చంద్రశేఖర సరస్వతి మహా స్వామి వారు,శ్రీ స్వామి యోగానంద, శ్రీ రమణ మహర్షి,ఇలా గ్రహ మండలాలనుంచి భూమిపైకి ప్రత్యేక కార్యాల నిమిత్తం వచ్చినవారే.

వీరు కేవలం మన భూమిపైననే కాక అనేక లోకాలలో జన్మించి ఆ లోకాలలో ఎన్నో పుణ్యకార్యాలు చేస్తుంటారు. మన కంటికి కనబడే అనేక గ్రహమండలాలలో కూడా వీరు కొంత కాలం ఉంటారు. మన ఊహకు, తర్కానికి అందని ఎన్నో అద్భుత కార్యాలు ఈ మహా పురుషులు ఆ గ్రహమండలాలలో చేస్తుంటారు. కనురెప్ప కాలంలో వీరు ఒక గ్రహమండలం నుంచి మరో గ్రహమండలానికి ప్రయాణిస్తారు.

మనందరం అనుకునేలాగ ఇటువంటి మహా పురుషులు కేవలం భూమి మీదనే కాకుండా అనేక నక్షత్ర మండలాలు, అనేక గ్రహమండలాలలో ఎన్నో రూపాలతో ఉంటారు. వీరు ఈ విశ్వం అంతా సంచరిస్తూ మన భూమి మీదే కాక ఈ విశ్వంలోని సమస్త జీవకోటి ఎప్పుడూ సుఖంగా ఉండేలా చూస్తుంటారు. వీరు కొంత కాలం భూమ్మీద నివసించినప్పుడు మనం ఎంతో

పుణ్యం చేసుకుంటే మనకు ఏదో రూపంలో దర్శనమిస్తారు. ఒకోసారి ఈ మహానుభావులు ఈ భూమిపై ఏదో ఒక పుణ్యక్షేత్రంలో ఒక నాలుగైదు రోజులు ఉండి కొంత మందికి తమ దర్శన భాగ్యాన్ని ప్రసాదిస్తారు. అప్పుడు వారు మానవ రూపంలోనే కాక ఏదో ఒక జీవి రూపంలో మనకు దర్శనమిస్తారు. ఒక్కోసారి మనం ఏ పుణ్యక్షేత్రానికో వెళ్ళినప్పుడు అక్కడ మన దగ్గరకు ఏ కుక్కనో, ఏ పక్షినో రావడం గమనిస్తాం. అలా వచ్చినది మన పూర్వజన్మ ప్రారబ్ధ కర్మను తొలగించడానికి వచ్చిన ఒక మహా పురుషుడే అని గమనించాలి. అక్కడతో మన కష్టాలన్నీ తీరిపోయి మనం సుఖంగా జీవిస్తాము.

వీరందరికి ఈ సృష్టి రహస్యాలు, ఎన్నో అద్భుత విషయాలు తెలిసినప్పటికి వీరు విపులంగా ఎవరితో చెప్పరు. వారు ఈ భూమిమీదకి వచ్చిన కార్యం పూర్తికాగానే ఈ దేహాన్ని వదిలి వెళ్ళిపోతారు. వీరందరికి ఈ సృష్టి రహస్యాలు అన్నీ తెలిసినప్పటికి అవన్నీ అర్థం చేసుకునే శక్తి ఇప్పటి మానవులకు ఉండదని తెలుసు. అందుకే కేవలం తాము వచ్చిన కార్యం మాత్రం నిర్వహించి తిరిగి వెళ్ళిపోతారు. వీరందరు వేరు వేరు కాలాలలో వేరు వేరు ప్రదేశాలలో జన్మించినప్పటికి, నివసించినప్పటికి ఒకరితో ఎప్పుడూ అనుంధానమై ఉంటారు. ఎప్పుడూ మానవాళికి మనం ఏం చెయ్యగలమా, ఎవరి ద్వారా ఏ మంచి విషయాలు ఈ మానవాళికి ఏ విధంగా అందించగలమా అని నిత్యం ఆలోచిస్తుంటారు. అటువంటి విషయాలను గ్రహించగలిగే జ్ఞాన సంపన్నులు వారి వద్దకు వచ్చినప్పుడు వారికి చెప్తారు. వారికి అన్ని విషయాలు బోధపరుస్తారు.

ఇంకో విశేషం ఏమిటంటే ఈ మహాపురుషులు మన ఎదురుగా ఉన్న సమయంలో మనతో మాట్లాడుతూ, అదే సమయంలో ఒక్కోసారి ఎన్నో గ్రహమండలాల లోనికి వెళ్ళి రాగలరు. మన ఎదురుగా కూర్చుని వారు తమ భౌతిక శరీరంతో మాట్లాడుతూ, వారి అంత:శరీరంతో, అద్భుతమైన శక్తితో వేరే గ్రహమండలాలో సంచరిస్తూ ఏకకాలంలో అక్కడా, ఇక్కడా ఉండగలడు. మనతో నవ్వుతూ మాట్లాడుతూ, అనేక విషయాలు వివరిస్తూ ఆ గ్రహమండలాలకు పయనించగలరు. మనతో మాట్లాడుతున్న సమయంలోనే ఆ గ్రహమండలాలలోని దేవతలతో ముచ్చటిస్తుంటారు.

మన కంటికి కనిపించేది, మన కంటికి కనిపించనివి అయిన ప్రతీదాని యందు ఆ శక్తి వ్యాపించి ఉన్నది. ఆ మహాశక్తి ఎంత గొప్పది కాకపోతే ఇన్ని కోట్ల దేవతలను సృష్టించగలుగుతుంది ? సమస్త సృష్టికారకుడైన బ్రహ్మదేవుని గురించి, సర్వ వ్యాప్త తత్వం కలిగిన శ్రీమన్నారాయణుల వారి గురించి, సర్వ లయ కారకుడైన శ్రీ పరమేశ్వరుని గురించి, సర్వ విద్యలకు అధిదేవత అయిన శ్రీ సరస్వతి దేవి గురించి, సర్వ ఐశ్వర్యాలకు కారణభూతురాలైన శ్రీ మహాలక్ష్మి దేవి గురించి, సర్వ శక్తులకు కారణభూతురాలైన శ్రీ జగన్మాత గురించి, సర్వ విఘ్నాలకు అధిపతి అయిన విఘ్నేశ్వరుని గురించి, సర్వ సైన్యాలకు అధిపతి అయిన శ్రీ సుబ్రహ్మణ్య స్వామి గురించి...ఇలా ఎందరో దేవతలగురించి మనం ఎంతో విశేషంగా చెప్పుకుంటాం కదా ! మరి ఈ దేవతలందరికి ఇంతింత గొప్ప శక్తులు, గుణాలు కలిగించిన ఆ మహాశక్తి ఇంకా ఎంత గొప్పదైనదై ఉండాలి ?.

సర్వదేవతాగణము, సర్వమునిగణము, సర్వయోగులు, సర్వసిద్ధులు ఆ మహాశక్తి గురించి తెలుసుకోవడానికి నిరంతరం ప్రయత్నిస్తుంటారు. వీరందరు ఎల్లప్పుడు ఆ మహాశక్తినే ఆరాధిస్తుంటారు. ఆ దివ్యశక్తి తమకు అనుగ్రహించిన శక్తితో ఎంతో మహిమలు గలవారు అవుతారు. ఎన్నో అద్భుత కార్యాలు చేయగలుగుతారు. ఈ సృష్టిలో సామాన్య మానవులచేత ఆరాధింపబడతారు. మనందరికి వీరందరూ ఎంతో పూజ్యనీయులు అవుతారు. మనందరికి ఎంతో ఆదర్శనీయ దేవతలు, శక్తులూ అవుతారు.

4

నాకు 2002 లో సం॥లో ఒక దివ్యమైన కల వచ్చింది ఆ కలలో కంచి మహాస్వామి శ్రీ చంద్రశేఖర స్వామివారు దర్శనమిచ్చారు. నేను ముందు ముందు చేయవలసిన పనులన్నీ గుర్తు తెచ్చారు. నేను ఈ జన్మలో ఇకముందు చేయవలసిన పనులన్నీ నిర్దేశించారు. అంతేకాదు ఇక ఈ పనులన్నీ చేసే సమయం అయిందని చెప్పారు. భారతదేశంలో సంచరించిన ఎందరో మహాపురుషులలో కంచి మహాస్వామి శ్రీ చంద్రశేఖర స్వామివారు ఒకరు. ఒక గ్రహమండలంలోని అద్భుత శక్తియే ఈ భూమిపై చంద్రశేఖర సరస్వతి స్వామివారిగా ఆవిష్కరించారు.

ఇలా ఎన్నో గ్రహమండలాలలోని దివ్యశక్తులు ఆయా కాలాలలో అనేకమంది దివ్య పురుషులుగా అవతరించారు. ఈ మానవాళిని ధర్మం వైపు నడిపించడానికి ఎంతో కృషిచేసారు. వీరందరూ కూడా ఎంతో అద్భుత శక్తులు కలవారు తాము చెయ్యవలసిన పని తాము చేసారు. అంతే తప్ప తాము ఎప్పటి నుంచి ఉన్నవారు, తమకున్న మహాశక్తులు ఏమిటి అన్నవి ఎక్కడ బయలు పరచలేదు.

శ్రీ ఆదిశంకరాచార్యులు వారు కేవలం 32 సం॥లు మాత్రమే జీవించి ఈ భారతదేశం మొత్తం సంచరించి ఎన్నో దివ్యస్తోత్రాలను మనకు అనుగ్రహించారని మనకు తెలుసుకద. కాని ఆ ఆచార్యుల వారికి ఇంతకు మించి సహస్ర రెట్ల శక్తి ఉన్నది. వారు మనకు అందించినటువంటి స్తోత్రాలకు, భాష్యాలకు ఇంకా ఎంతో చేసి ఉండవచ్చును. కాని ఆ దివ్యశక్తి అంతవరకే చేయాలని నిశ్చయించుకున్నారు. కేవలం 32 సం॥లు మాత్రమే ఉండి ఆ దివ్యశక్తి తిరిగి గ్రహమండలానికి వెళ్ళిపోయింది. ఇలా గడచిన వేల సంవత్సరాలుగా ఎందరో మహాపురుషులు, స్త్రీలు ఈ భూమిపై జన్మించి తాము నిర్దేశించుకున్నంతకాలం ఈ భూమిపై ఉండి తాము వచ్చిన కార్యం చేసి తిరిగి తమ లోకాలకు వెళ్ళిపోయారు.

ఇలాంటి వారినే మన పూర్వ తరాలలో పెద్దలు మహా పురుషులుగా, గురువులుగా కొలిచారు. అటువంటి వారిని ప్రత్యక్షంగా చూసిన వారితో ఒక్క క్షణమైనా గడిపిన వారు ఎంతో అదృష్టవంతులు. అంతటి మహానుభావులతో ఎంతో దగ్గరగా ఉన్నవారి తరువాత తరాల వారు కూడా ఎంతో అదృష్టవంతులు. ఈ కాలంలో కూడా అటువంటి మహానుభావులను మనం గుర్తించి వారి దర్శనం చేసుకొని మన జన్మ ధన్యం చేసుకోవాలి.

ముందు చెప్పుకున్నట్టుగా ఈ విశ్వంలోని 33 కోట్ల దేవతలు, ఆ దివ్యశక్తినుండి వచ్చినవారే అలాగే ఎన్నో యుగాలలో ఉన్న మహర్షులు కూడా ఆ దివ్యశక్తినుండి ఉద్భవించిన రూపాలే ! అయితే వీరందరూ ఆ శక్తిలోని కొంత స్థాయి శక్తితో ఉద్భవించారు. ఒక్కొక్కరు ఒక్కొక్క స్థాయి శక్తితో ఉద్భవించారు. ఈ సృష్టి మొత్తానికి మూలకారణమైన ఆ దివ్యశక్తి గురించి వీరికే పూర్తిగా తెలియనప్పుడు అతి సామాన్యులమైన మనం తెలుసుకోలేకపోయామని బాధపడనక్కర్లేదు. అంతటి అద్భుత శక్తి ఒకటి ఉన్నదని తెలుసుకోగలిగితే అదే మహా విశేషం, మహా అదృష్టం కూడా అవుతుంది.

ఆ దేవతలులాగానే కొందరు మనుషులు కూడా ఎన్నో శక్తులు కలిగిఉండడం మనం చూస్తూ ఉంటాము. వారిని మనం మహాపురుషులుగా భావిస్తాము. సంఘంలో గౌరవిస్తాం ఎంతో ఉన్నత స్థానంలో ఉంచుతాం. వీరందరు ఈ సృష్టి మొత్తానికి ఏ దివ్యశక్తి కారణమో ఆ శక్తిలోనుంచి, కేవలం

ఆ శక్తి సంకల్పంతో అతికొద్ది శక్తి గ్రహించి ఈ భూమిపై ఉద్భవించినవారే. మనం వీరందరికి వేరు వేరు పేర్లు పెట్టుకుంటాము గాని అందరు ఆ దివ్యశక్తిలోని వారే.

మనకు అనేక తత్వాలుగా వీరు కనిపించినప్పటికి నిజానికి వీరందరి ఒకటే తత్వం మనం మనకున్న అత్యల్ప ఆలోచనా పరిధితో వీరికి ఆయా తత్వాలను, ఆయా శక్తులను, ఆయా మహిమలను, ఆయా గుణాలను, ఆయా పనులను ఆపాదిస్తాం. మన పరిమిత దృష్టితో వారిని అంతవరకే చూస్తాం. కాని వీరందరిది అపరిమితమైన శక్తి అందుకే వీరు ఈ భూమినుంచి నిష్క్రమించినప్పటికి ఇప్పటికి వారు ఆరాధింపబడుతున్నారు. మనం అనేక మహిమలు అనుభవింప గలుగుతున్నాము. ఒక దేవతలే కాదు మనకి తెలిసిన మానవులు కూడా కొంత మంది గురుపరంపరలోను, పీఠాధిపతులు గాను, ఆరాధింపబడటం మనకు తెలిసిందే కదా ! వీరందరు కూడా తమను నమ్ముకున్న వారిని అనుగ్రహిస్తూ వారిని నిత్యం కాపాడుతున్నారు కదా.

ఇటువంటి దివ్యశక్తులు వేరు వేరు కాలాలలో ఉన్నప్పటికి నిత్యం ఒకరి ఆత్మతో మరొకరి ఆత్మ అనుసంధానింపబడి ఉంటుంది. ఈ దివ్యశక్తులన్నీ నిత్యం ఈ సృష్టి మొత్తానికి, తమలోని శక్తికి కారణభూతమైన మహాశక్తితో అనుసంధానింపబడి నిత్యం ఆనందంలో ఉంటాయి. అరుణాచలంలోని శ్రీరమణ మహర్షి నిత్యం ఆనందంగా ఉండడానికి కారణం ఇదే! వారి శరీరానికి ఎంతో తీవ్ర అనారోగ్యం కలిగిన వారెప్పుడూ వారి భౌతిక శరీరం గురించి ఆలోచించక ఎప్పుడూ ఆనందంగా ఉండేవారు. వారు అప్పుడు హిమాలయాలలో ఉన్న సిద్ధులతోను, ఈ భూమిపై అనేక రూపాలలో జన్మించిన దివ్యశక్తులతోను నిత్యం అనుసంధానింపబడి ఉండేవారు. వారు అంత శక్తిమంతులు కాబట్టే వారి వద్ద ఉన్నప్పుడు మానవులకు జంతువులకు ఎంతో ఆనందం కలిగేది.

ఇటువంటి మహాపురుషుల యొక్క దివ్య ఆత్మ యొక్క అద్భుత తరంగాలు వీరు చుట్టూ వ్యాపింపబడి ఉండి ఉండటం వలన వారి చుట్టూ ఉన్నవారికి ఎంతో ఆనందంగా ఉంటుంది. వారి కష్టాలన్నీ వారు మర్చిపోతారు. వారి సమీపంలో కొన్ని రోజులు గడిపిన వారికి జీవితంలో ఎంతో

మార్పువస్తుంది. ఎటువంటి కష్టాలైన ఎదుర్కునే శక్తి కలుగుతుంది. ఎన్నో అద్భుత విషయాలు వీరికి తెలుస్తాయి. కష్టసుఖాలను సమానంగా స్వీకరించగలిగే శక్తి వస్తుంది. అసలు మనకు ఎన్నో జన్మల పుణ్య ఫలం ఉంటే గాని ఇటువంటి మహానుభావుల దర్శనం చేసుకొనలేము.

అటువంటి మహాపురుషులు ఏ ప్రదేశంలో ఉంటారో ఆ ప్రదేశమంతా ఎంతో శక్తివంతంగా ఉంటుంది. ఆ దివ్యాత్మలు తమ భౌతిక శరీరాలు విడిచిపెట్టి కొన్ని వేల సంవత్సరాలైనా ఆ గొప్ప ఆత్మ సంచరించిన ప్రదేశం కాబట్టి అక్కడ ఇప్పటికి ఎంతో ఆనందం తాండవిస్తుంటుంది. అక్కడకి వచ్చినవారికి మనసంతా ఎంతో ప్రశాంతంగా అనిపిస్తుంది. సాధకులకు అక్కడ ధ్యానం చేస్తే ఇప్పటికి ధ్యానంలో ఆ మహనీయుల దర్శన భాగ్యం లభిస్తుంది.

5

ఈ సృష్టి ప్రారంభం నుంచి అనేక యుగాలు జరిగాయి కృత యుగం, త్రేతాయుగం, ద్వాపరయుగం, కలియుగం. ఇలా ఈ నాలుగు యుగాలు తిరిగి తిరిగి వస్తుంటాయి. ఇలా కొన్ని యుగాలు కలిసి మహాయుగం ఏర్పడుతుంది. అయితే చాలామంది భావించేటట్లు ప్రతీ యుగం చివరన ప్రళయం సంభవించదు. ఉదాహరణకు ద్వాపరయుగం అవగానే ప్రళయం వచ్చి భూమండలం అంతా నీట మునిగిపోవడం జరుగలేదు. శ్రీకృష్ణుల వారి నిర్యాణంతో ద్వాపరయుగం పూర్తి అయింది. మరుక్షణమే కలియుగం ప్రారంభం అయింది. అప్పుడే పెద్ద ఉప్పెన వచ్చి ద్వారక మునిగిపోయి సముద్రగర్భంలో కలిసిపోయింది. అలా సముద్రానికి దగ్గరగా ఉన్న ఎన్నో ప్రాంతాలు నీట మునిగిపోయాయి. అంతే గాని భూమండలం మొత్తం నీట మునగలేదు.

మరొక విషయమేమిటంటే ద్వాపర యుగం ముగిసినప్పటికి అప్పటివరకు జీవించిన వ్యక్తులందరు వారి వారి ప్రారబ్ధకర్మలను బట్టి తిరిగి కలియుగంలో అనేక దేశాలలో, అనేక ప్రాంతాలలో జన్మించారు. అంతేకాని ద్వారపయుగంలో మరణించినవారందరు ఆ మహాశక్తితో కలిసిపోయారని అనుకోకూడదు. మహాభారత యుద్ధంలో మరణించిన సైనికులు, రాజులు, అందరు తరువాత జన్మలలో వారి వారి పూర్వ జన్మ కర్మ ఫలాలను బట్టి

కలియుగంలో జన్మించి అనేక వేల జన్మలెత్తుతూ ఇప్పటికి మనమధ్యనే అనేక రూపాలలో తిరుగుతున్నారు.

అప్పటి చక్రవర్తులు, రాజులు, పండితులు, సామాన్యులు అందరూ అనేక వేల జన్మలెత్తుతూ తిరిగి అనేక పుణ్య, పాపకర్మలు చేస్తూ తిరిగి తిరిగి ఈ జనన మరణ చక్రంలోనుంచి బయటకు రాలేకపోతున్నారు. అయితే వీరిలో కొందరికి పూర్వజన్మల వాసనలు పూర్తిగా పోక ఇంకా ఆ గుణాలకు కొంతవరకు కలిగియున్నారు. ఆత్మని గాఢంగా అంటుకున్న కొని గుణాలు ఎన్నో జన్మలకి గాని, ఎంతో తీవ్ర ప్రయత్నం చేత గాని పోవు.

వారిలో కొందరు మహనీయులు మాత్రం ఈ కలియుగ ప్రారంభం కాగానే కొన్ని జన్మలు మాత్రమే జన్మించి గొప్ప గొప్ప పుణ్యకార్యాలు చేసి తిరిగి ఆ దివ్యశక్తిలో కలిసిపోయారు. ఇక్కడ ఇంతకు ముందు చెప్పినట్టుగా ఒక విషయం గ్రహించాలి. మనం ప్రతీ జన్మలో ఒకే ప్రాంతంలో తిరిగి తిరగి పుట్టాలని లేదు. ఈ జన్మలో భారతదేశంలో పుడితే మరుజన్మలో ఏ అమెరికాలోనో, రష్యాలోనో, ఆఫ్ఘనిస్తాన్‌లోనో, పాకిస్తాన్‌లోనో ఎక్కడో పుట్టవచ్చు. అంతేకాని మళ్ళీ ఇక్కడే ఇదే మతంలో ఇదే కులంలో జన్మించడం అనేది జరుగకపోవచ్చును.

ఎక్కడో కొన్ని కోట్లలో ఒకరు మాత్రమే అలా తిరిగి తరువాత జన్మలో కూడా అదే కుటుంబంలో జన్మించడం జరుగుతుంది. అది కూడా మహాఅయితే ఒక రెండు మూడు జన్మలు మాత్రం ఆ కుటుంబంలో జన్మిస్తారు. అటు తరువాత పూర్వజన్మలలో ఏర్పడిన బంధాల వలన ఎక్కడెక్కడో వేరే ప్రాంతాలలో వేరే కుటుంబాలలో జన్మిస్తారు. అలాగే ప్రతీసారి మళ్ళీ మానవజన్మయే లభిస్తుందని కూడా లేదు. మనం చేసే పుణ్య పాపకార్యాల ఫలితంగా ఒకొక్కసారి తరువాత జన్మలలో ఏవో జంతువులగానో, ఏదో పక్షుల లాగానో కూడా జన్మించవచ్చు. ఇక్కడ మనందరికి ఒక అనుమానం రావచ్చు జంతువులు పక్షులు ఎప్పటికి అదే జన్మలలో ఉంటాయా అని ! అలా ఎన్నటిక కాదు ఒక్కొసారి ఈ జంతువులు కూడా ఎంతో సాధుస్వభావం కలిగి అనేక జన్మలు జీవించి ప్రతీ జన్మలోను అంతే సాధుస్వభావంతో ఉండి అదికూడా కొన్ని పుణ్యస్థలాలలో జన్మించి తరువాత మానవజన్మను పొందుతాయి.

6

ఈ భూమి మీద ఉన్న అత్యంత పవిత్ర ప్రదేశాలలో హిమాలయాలు ఒకటి. ఆ పర్వత శ్రేణుల్లో అనేక దివ్య పురుషులు దివ్య శరీరధారులై నిత్యం సంచరిస్తుంటారు. మానవ మాత్రులకు వారి దర్శనం దుర్లభం. వీరిలో కొందరు వేరే గ్రహమండలాల నుంచి అప్పుడప్పుడు వచ్చి భూలోకంలోని పవిత్ర ప్రదేశాలైన హిమాలయాలతో పాటు కాశీ, తిరుమల, శ్రీరంగం, వైష్ణోదేవి, మధుర, బృందావనం వంటి పవిత్ర ప్రదేశాలలో దివ్య రూపాలలో సంచరించి వెళ్తుంటారు. మనకి ఎన్నో జన్మల పుణ్యం ఉంటే అటువంటి మహానుభావులు మనకి ఎదో రూపంలో దర్శనిమిస్తారు.

ఒక్కోసారి వారిని మనం గుర్తించలేకపోవచ్చు కూడా! కాని వారు మన వద్దకు రాగానే ఆ క్షణంలోనే మన కష్టాలన్నీ తీరిపోతాయి. దాన్నే మనం రకరకాలుగా అన్వయించుకుంటాము. ఆ సమయంలో ఏదైనా క్రొత్త ప్రదేశానికి వెళ్ళి వస్తే ఆ స్థల ప్రభావం వల్ల ఈ మార్పు వచ్చిందని అనుకుంటాము. కాని అసలు కారణం అటువంటి మహనీయులు, దివ్యశక్తి ఒకటి మనల్ని మనం గుర్తించలేని రూపంలో వచ్చి అనుగ్రహించడమన్నమాట. ఇది నా చుట్టూ ఉన్న

చాలామంది జీవితాలలో జరగడం గమనించాను. ఇప్పటికి గమనిస్తున్నాను. ఇందాక చెప్పినట్లుగా ఆ శక్తులు కేవలం కొన్ని నిమిషాలు మాత్రమే మనకి కనిపించి వెళ్ళిపోతారు. కాని మన జీవితం మంచి బాట పట్టడానికి ఆ రెండు నిమిషాలు చాలు.

మనం పూర్తి ధ్యానంలో లోకి వెళ్ళి మనస్సును ప్రశాంతంగా ఉంచుకుంటే ఎన్నో అద్భుతాలు మన కంటిముందు కనబడతాయి. అలా ధ్యానం చేస్తూ మనం ఇంకా ఎక్కువ ఉన్నత స్థితిలోకి వెళితే మన చుట్టూ జరుగుతున్నవన్నీ మర్చిపోతాము. చుట్టూ ఉన్న మనుషులు, వస్తువులు ఏమీ కనబడవు. ఏ శబ్దాలు వినబడవు, ఏ వాసన మనకు తెలియదు శరీరమంతా ఒక వర్ణించలేని అద్భుతమైన ఆనందం కలుగుతుంది. మనం ధ్యానంలో అంతటి స్థాయికి వెళ్ళిన తరువాత ఎన్నో దివ్య అనుభూతులు కలుగుతాయి. మనం ఎవరిమో ఎక్కడినుంచి వచ్చామో మనకి తెలుస్తుంది. మనకు ఈ లోకంతో ఉన్న బంధం ఏమిటి, మన బంధుమిత్రులందరు ఎవరో తెలుస్తుంది. ఇలా ఒకసారి తెలిసిన తరువాత ఇంకా ఈ భౌతిక లోకంలో ఏ కష్టము మనల్ని బాధించదు.

ఒక 16 సం॥లు క్రితం నేను ఒకసారి ధ్యానంలోకి వెళ్ళినపుడు కొన్ని అద్భుత గ్రహమండలాలలోకి వెళ్ళాను. అక్కడ ఎందరో దివ్యపురుషులు అద్భుతమైన తేజస్సుతో ప్రకాశిస్తూ కనబడ్డారు. అప్పుడు నేను పూర్వ జన్మలలో ఎక్కడెక్కడ ఏ రూపాలలో జన్మించానో అర్థమయింది. ఈ జన్మ ఎందుకు కలిగిందో ఈ జన్మలో చేయవలసిన పనులు తెలిసాయి. అక్కడ ఉన్న దివ్య పురుషులతో పాటు నా చుట్టూ కూడా బ్రహ్మాండమైన కాంతి వలయాలు ఉన్నాయి. ఆ గ్రహమండలాలలో దివ్య పురుషులందరూ ఏ రూపంలేకుండా కేవలం ఎంతో తేజస్సుతో ప్రకాశిస్తున్న కాంతి బింబాలుగా మాత్రమే దర్శనమిస్తున్నారు. అక్కడ ఉన్నవన్నీ ఆ కాంతి బింబాలే !

అటు తరువాత ఎన్నో సార్లు ధ్యానంలో ఆ గ్రహమండలాలలోనికి వెళ్ళాను. వెళ్ళినప్పుడల్లా ఎన్నో అద్భుత విషయాలు తెలియసాగాయి. ఈ విశ్వం యొక్క రహస్యాలెన్నో తెలిసాయి. ఈ దేవతలు మానవులు, పశుపక్ష్యాదులు, చెట్లు, చేమలు, ఇలా సృష్టిలోని అన్ని విశేషాలు అర్థమయ్యాయి.

కొన్ని జన్మల క్రితం హిమాలయ పరిసర ప్రాంతాలలో నేను జన్మించి ఒక జన్మలో చాలా కాలం తపస్సు చేసాను. అప్పుడక్కడ ఒక పెద్ద ఆశ్రమం ఉండేది. ఆ ఆశ్రమానికి ఎంతో పూర్వ జన్మ పుణ్యఫలం చేత కొంత మంది ఎక్కడెక్కడో దూర ప్రదేశాలనుంచి చేరుతున్నారు. వీరందరు ఒక్కొక్కరు ఒక్కొక్క వయస్సులో ఆ ఆశ్రమానికి చాలా విచిత్రంగా చేరుకున్నారు. వీరిలో చాలామంది భారతదేశంలోని నలుమూలలు నుండి కొంతకాలం సామాన్య జీవితం సాగించి తరువాత వారి వారి పూర్వజన్మ పుణ్యఫలం చేత ఈ ఆశ్రమానికి చేరుకోవడం జరిగింది.

ఆ ఆశ్రమం కూడా హిమాలయాలలో చాలా లోపల ఉండి సామాన్య మానవులు రావడానికి ఎంతో కష్టతరంగా ఉండేది. అక్కడికి నిత్యం అనేకమంది సిద్ధులు, యోగులు తమ దివ్య శరీరాలతో వచ్చి వెళుతుండేవారు. అందువలన ఆ ఆశ్రమంలో ఎప్పుడూ ఎంతో ప్రశాంతమైన వాతావరణం నెలకొని ఉండేది. వారందరు ఇక్కడకు చేరుకున్నవారందరు ఇక్కడ ఉన్నంతకాలం దైవాన్ని తెలుసుకొనడానికి ప్రయత్నిస్తూ ఎంతో ధార్మిక జీవితం గడిపారు. కొంతమంది అక్కడ ఉన్నంతకాలం పూర్తి మౌన జీవితం గడిపారు.

అప్పటి ఆ 108 మంది తిరిగి ఈ జన్మలో నన్ను రకరకాల పరిస్థితులలో రకరకాల సమయాలలో కలుసుకుంటున్నారు. కొందరు నా తల్లిదండ్రులుగా, అత్తమామలుగా, నా అన్నదమ్ములుగా, భార్య పిల్లలుగా జన్మిస్తే మరికొందరు ఏ బంధం లేకుండా భారత దేశంలోని ఎక్కడో దూర ప్రదేశాలలోను, విదేశాలలోను, వివిధ మతాలలో, వివిధ కులాలలో, పురుషులగాను, స్త్రీలుగాను జన్మించి తిరిగి నన్ను కలుసుకుంటున్నారు. ఇలా ఈ జన్మలో అప్పటి హిమాలయపు ఆశ్రమంలో ఉన్న 108 మంది తిరిగి నన్ను కలుసుకుంటారు.

ఎంతో అద్భుతమైన దివ్య జ్ఞాన సంపన్నులు, అద్భుత శక్తి సంపన్నులు భారతదేశంలో హిమాలయ పర్వత ప్రాంతాలలో కొన్ని లక్షల సంవత్సరాలుగా ఉన్నారు. అక్కడ అనేక దివ్య ఆశ్రమాలు ఉన్నాయి. ఇవి సామాన్య మానవులకు ఏ మాత్రం గోచరించవు. అదృశ్యంగా ఉంటాయి. ఈ ఆశ్రమాలలో కొన్ని వేల సంవత్సరాలుగా తపస్సు చేస్తున్న వశిష్ఠుడు,

భరద్వాజుడు, విశ్వామిత్రుడు, అత్రి వంటి అనేక మంది మహర్షులు ఉన్నారు. అలా అక్కడ ఉన్న అనేక ఆశ్రమాలలో సిద్ధులు, యోగులు కూడా ఉన్నారు. వీరు కేవలం లోక కళ్యాణం కోసం వేల సంవత్సరాలుగా తపస్సు చేస్తున్నారు. వీరు అప్పుడప్పుడు భారతదేశంలోని మహాపుణ్యక్షేత్రాలకు, ఇతర దేశాలలోని పవిత్ర ప్రదేశాలకు తమ దివ్య శరీరాలతో వెళ్ళి వస్తుంటారు.

వీరిలో కొందరు అప్పుడప్పుడు కొన్ని ప్రత్యేక కార్యాలు నిర్వర్తించటం కోసం మానవజన్మ ఎత్తుతారు. ఇటువంటి వారు ప్రస్తుతకాలంలో కూడా ఈ భూమిపై అక్కడక్కడ నివసిస్తున్నారు. మేమందరం నిత్యం ఒకరితో ఒకరు అనుసంధానమై ఉంటాము. ఒకరితో ఒకరు ఎప్పుడూ సంభాషిస్తూ ఉంటాము. అయితే ఈ సంభాషణ ఏ పరికరానికి అందని దివ్య తరంగాల ద్వారా జరుగుతుంది. మా అందరికి ఒకరినుంచి ఒకరికి సందేశాలు వస్తుంటాయి. వీరిలో కొందరు బయట ప్రపంచానికి తెలిసిన పీఠాధిపతులు, గొప్ప ప్రవచనకారులు ఉన్నారు. అయితే వీరి చుట్టూ ఉన్న చాలామందికి వీరు కేవలం పీఠాధిపతులుగానో, గొప్ప ప్రవచనకారులుగానో తెలుసు తప్ప వీరికి ఇంతశక్తి ఉన్నదని, వారు వేరే గ్రహమండలాలనుంచి వచ్చినవారని, కొన్ని పుణ్యకార్యాల నిమిత్తం ఈ భూమిమీద జన్మించారని తెలియదు.

అలా ధ్యానంలో ఉన్న ఒక రోజున నాకు నా పూర్వజన్మల విశేషాలన్నీ తెలిసాయి. ఇంతకు ముందు జన్మలలో ఎక్కడ జన్మించానో, ఏమేమి చేసానో అన్నీ స్ఫురణకు వచ్చాయి. ఒక్కో జన్మలో నేను పుట్టిన ప్రదేశం, ఎక్కడెక్కడ తిరిగాను, ఏ ఏ పనులు చేసాను, ఆ జన్మలలో నన్ను కలిసిన వారు, ఇలా అన్ని విశేషాలు కంటిముందు గోచరించాయి. ఆరోజు నేను వేరే డైమెన్షన్‌లోకి వెళ్ళి ఈ ప్రపంచం అంతా ఎలా ఉందో గమనించాను. నేను తిరిగిన ప్రదేశాలు అప్పటి సమాజం మొత్తం నా కంటిముందు ఒక కాన్వాస్ లాగా కనిపించింది. అప్పుడు జరిగిన ఎన్నో సంఘటనలు నేను నా మనో నేత్రంతో దర్శించాను. విశేషం ఏమిటంటే ప్రస్తుత భౌతిక ప్రపంచంలో నేను కేవలం ఐదు నిమషాలు మాత్రమే ధ్యానంలో ఉన్నప్పటికి ఆ డైమెన్షన్‌లో మాత్రం కొన్ని వేల సంవత్సరాల కాలం నా కంటిముందు ఒక ప్రవాహంలా కనిపించింది.

ఇది ఒక దివ్యమైన అనుభూతి. చదవడానికి ఏ మాత్రం నమ్మశక్యంగా అనిపించనప్పటికి ఇది సత్యం. ఆ కాలంలో ఉన్న ప్రదేశాలు ఈ రోజు ఎలా ఉన్నాయో తెలిసింది. అలాగే అప్పటి మనుషులు అనేక మంది ప్రస్తుత కాలంలో ఎక్కడెక్కడ జన్మించారో ఇప్పుడు ఏం చేస్తున్నారో నా కంటికి ఒక అద్భుత దృశ్యకావ్యంలా కనిపించింది. కేవలం మనుషులే కాదు అప్పటి ఎన్నో జీవులు ప్రస్తుతం ఏ జన్మలలలో ఎక్కడ ఉన్నాయో తెలిసింది. ధ్యానంలో మనం ఎంతో ఉన్నత స్థాయికి వెళ్ళినప్పుడు మనం ఎన్నో వెనుకటి యుగాలలోకి కూడా వెళ్ళగలుగుతాం. అప్పుడు జరిగిన అనేక సంఘటనలను మనం చూడ గలుగుతాం. అయితే ఇటువంటి అనుభూతులు ఎంతో ఆనందం ఇచ్చేటప్పటికి కూడా అవి తట్టుకొనడానికి మనకి ఎంతో శక్తి కావాలి. అయితే మనం ఒక ప్రత్యేక కార్యం నిమిత్తం ఈ భూమి మీదకు ఆ మహాశక్తి అనుగ్రహంతో వచ్చిన వాళ్ళం కాబట్టి ఆ మహాశక్తియే ఇవన్నీ తేలికగా తట్టుకునే శక్తిని అనుగ్రహిస్తుంది.

నేను గత జన్మలలో ఒక జన్మలో వాగ్గేయ కారునిగాను, ఒక జన్మలో సంకీర్తనాచార్యులుగాను, ఒక జన్మలో కాశీవిశ్వేశ్వర ఆలయంలో సన్నాయి వాద్యకారునిగాను, మరొక జన్మలో మధురలో శ్రీకృష్ణ తత్వాన్ని ఉపదేశించిన ఒక గురువుగాను, మరొకజన్మలో శ్రీ వైష్ణవతత్వాన్ని ప్రపంచం మొత్తం తేలికగా చాటిచెప్పినవాడినిగాను, మరొక జన్మలో శ్రీ పరమేశ్వరతత్వాన్ని ఎంతో తేలిగ్గా ప్రపంచానికి అందించిన ఆచార్యుడిగాను, మరొక జన్మలో కర్ణాటక రాష్ట్రంలో ఒక పీఠాధిపతిగాను, మరొక జన్మలో ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు పట్టణ సమీప అడవులలలో ఒక అవధూతగాను జన్మించాను.

మరొక జన్మలో తమిళనాడులోని ఒక సాధారణ కుటుంబలో జన్మించి తమిళ భాషలో దివ్య ప్రబంధాలు రచించినవారిలో ఒకరిగా ఉన్నాను, మరొక జన్మలో గొర్రెల కాపరిగా జన్మించి అడవులలో తిరుగుతూ భక్తి తత్వాన్ని బోధించాను, మరొక జన్మలో కాశ్మీర దేశంలో ఒక పండిత వంశంలో జన్మించి కేవలం 24 సం॥లు మాత్రం జీవించి కొన్ని వ్యాకరణ సూత్రాలను వివరించాను, మరొక జన్మలో ఇప్పటి ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో జన్మించి అనేక వేద శాస్త్రాలలో పాండిత్యం సంపాదించి హిమాలయ ప్రాంతాలకు చేరుకొని ఒక ఆశ్రమం నెలకొల్పాను.

ఈ ఆశ్రమానికే ఎక్కడెక్కడినుంచో వచ్చే 108 మంది నాతో ఉండడం జరిగింది. అయితే ఒక్కొక్కరు ఈ జన్మలో నన్ను కలిసే తీరు, నావద్దకు వచ్చే తీరు అద్భుతంగా ఉంటుంది. వీరందరు ఇప్పటిదాకా ఎక్కడెక్కడో రకరకాల జీవితాలు గడుపుతూ ఈ జన్మలో నన్ను కలవవలసిన సమయం రాగానే అద్భుత రీతిలో కలుస్తున్నారు. ప్రతి మనిషి జీవితంలో అతడిని కలిసే వారందరు కూడా ఇలా ఏదో పూర్వజన్మ బంధం ఉండడం వలననే కలవడం జరుగుతుంది.

ఇండియాలోనే కాక వేరే దేశాలలో, వేరే మతాలలో పుట్టి నన్ను తిరిగి ఈ జన్మలో ఆశ్చర్యకరంగా కలుస్తున్నారు. ఇలా కలిసిన వారిలో కొందరు అమెరికన్ ప్రొఫెసర్‌లు, కొందరు బ్రిటీష్ ప్రొఫెసర్‌లు కూడా ఉన్నారు. ఒక ప్రఖ్యాత అమెరికిన్ యూనివర్శిటీలో చాలా పెద్ద పదవిలో ఉన్న ఒక ప్రొఫెసర్ నేనంటే ఎంతో ఆప్యాయత చూపిస్తున్నారు. వారు కూడా ఇంతకు ముందు జన్మలో హిమాలయాశ్రమంలో నాతో పాటు ఉన్నవారే. ఇదే విషయం వారికి చెప్తే వారు ఎంతో సంతోషించారు. వారికి నాతో కలిగిన ఎన్నో దివ్య అనుభూతుల్ని ఎంతో సంతోషంగా పంచుకున్నారు.

ఇలాగే పోర్చుగల్ దేశంలో జన్మించిన ఒక యువకుడు కూడా పరిచయం అయ్యాడు. అతను నేను రాసిన శ్రీ వేంకటేశ్వర వ్రత కల్పం నిత్యం చదువుతున్నాడు. ఇతడు కూడా అప్పటి హిమాయలశ్రమంలోని 108 మందిలోని ఒకరని నాకు అర్థమయ్యింది. ఇతను శ్రీ వేంకటేశ్వర వ్రత కల్పం జర్మన్ భాషలోకి అనువదించాడు కూడా. ఇలా అప్పటి ఆ 108 మంది తిరిగి ఈ జన్మలో నన్ను కలవడం నాకు, వారికి కూడా ఎంతో ఆనందంగా ఉంది. అప్పటి ఆ 108 మందిలో నన్ను ఇప్పటి దాకా 86 మంది తిరిగి కలిసారు. ఇంకా 22 మంది కలవవలసి ఉంది. వీరు కలిసిన తరువాత ఈ జన్మలో నేను చెయ్యవలసిన కార్యాలన్నీ విజయవంతంగా పూర్తి అవుతాయి. ఈ మహా కార్యాలన్నింటినీ ఈ 108 మంది అనేక విధాలుగా ముందుకు నడిపిస్తారు.

7

నేను ఇప్పటిదాకా 28 భక్తి పుస్తకాలు రచించాను. వీటిలో 18 పుస్తకాలు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారి పైననే రచించడం విశేషం. 2001 వ సంవత్సరంలో నేను శ్రీనివాస మహత్యం అనే నా మొదటి పుస్తకం రచించాను. ఈ పుస్తకం వ్రాయడానికి దాదాపు 8 నెలలు పట్టింది. వ్రాస్తున్నంతకాలం ఒక దీక్షతో ఉండి ప్రతీరోజు నేలమీదనే నిద్రించేవాడిని. ఆ 8 నెలలు ఎక్కడకి వెళ్ళలేదు. మధ్యలో ఒక వారం రోజుల పాటు తిరుమల వెళ్ళి కొండమీదనే ఉండి ఆ పుస్తకంలో కొంత భాగం వ్రాసాను. శ్రీ శ్రీనివాస మహత్యం కవర్‌పేజీ పై ఏ ఫొటో ఉండాలో, లోపలి పేజీలో ఏ ఫొటో ఉండాలో శ్రీనివాసుడే కలలో కనబడి నాకు చెప్పడం జరిగింది. ఆ పుస్తకం ఎందరో శ్రీనివాసుని భక్తులకు నిత్యపారాయణ గ్రంథం అయింది.

ఆ తరువాత కొంతకాలానికి 2005 వ సం॥లో ఒక నాటి రాత్రి శ్రీవేంకటేశ్వర స్వామి వారు కలలో దర్శనమిచ్చి శ్రీవేంకటేశ్వర వ్రతకల్పం వ్రాయవలసిందిగా అనుగ్రహించారు. ఆ ఆదేశంతో నేను తిరుమల వెళ్ళి అక్కడ ఆలయం ఎదురుగా కనులు మూసుకొని ధ్యానం చేస్తూ కూర్చున్నాను. అప్పుడు

ఆలయంలోని శ్రీవేంకటేశ్వర స్వామి వారు ఆలయం వెనుక ప్రదేశంలో భూమ్యాకాశాలను ఆక్రమిస్తూ విశ్వరూపంలో దర్శనమిచ్చారు. కొన్ని క్షణాల పాటు నన్ను నేను పూర్తిగా మర్చిపోయాను. ఎక్కడ ఉన్నానో ఏం చేస్తున్నానో తెలియదు. నా చుట్టుప్రక్కల ఎంతో మంది భక్తులు అటు ఇటు తిరుగుతున్నప్పటికి నాకు వారి ఉనికి ఏమాత్రం తెలియడం లేదు. ఏ శబ్దాలు వినిపించడం లేదు. శరీరమంతా ఒక దివ్యమైన శక్తి ఆవహించింది.

అప్పటి ఆ విశ్వరూపంలో విశ్వంలోని దేవతలందరూ ఉన్నారు. అప్పుడు నాకు కలిగిన దివ్య రూపాన్ని నేను శ్రీమన్నారాయణుల వారి విశ్వరూప దర్శనం అని గాని లేదా పరమేశ్వరుడు విశ్వరూపంలో దర్శనమిచ్చాడని గాని, సాక్షాత్తు ఆ దుర్గాదేవియే అన్ని దేవతల రూపంలో దర్శనమిచ్చిందనిగాని అనను. అప్పుడు ఆ కొండపై నాకు కలిగిన అనుభూతి అనిర్వచనమైనది. ఈ సృష్టిలోని అందరు దేవతలు సర్వ జీవకోటి ఆవిర్భానికి మూలమైన దివ్యశక్తి నాకు అప్పుడు అక్కడ సాక్షాత్కరించింది. ఆ దివ్యశక్తిలో నేను సమస్త దేవతలను దర్శించాను. సముద్రాలు లోయలు, కొండలు, నదులు అనేక రకాల వృక్షాలు, మానవులు సమస్త జీవకోటి ఎన్నో జంతుజాలాలు, ఎన్నో గ్రహమండలాలు, నక్షత్రమండలాలు అన్నీ దర్శమిచ్చాయి. ఆ దర్శనంతో నేను ముందు ముందు చేయవలసిన పనులన్నీ నాకు గుర్తుకు వచ్చాయి.

అలా ఈ విశ్వం మొత్తానికి మూలకారణమైన ఆ దివ్యశక్తి దర్శనం అక్కడ లభించింది. ఇంత అద్భుతమైన శక్తి ఆ తిరుమల కొండలపై ఆనందనిలయం సమీపంలో ఉండడంతో తిరుమల ఎంతో శక్తి గల క్షేత్రంగా ప్రకాశిస్తోంది. పూర్వకాలంలో కొందరు మహర్షులు ఈ కొండపై తపస్సు చేసినప్పుడు వారికి కూడా ఈ దివ్యశక్తి దర్శనం లభించింది. త్రేతాయుగంలో రామచంద్రుల వారు సీతాన్వేషణలో ఈ శేషాచల కొండలపైనుంచి వెళుతూ తిరుమల వచ్చినప్పుడు శ్రీరామచంద్రుల వారికి కూడా ఈ దివ్యశక్తి దర్శనం కలిగింది. అలాగే కొందరు దేవతలు కూడా ఈ తిరుమల కొండపై ఈ సృష్టిమొత్తానికి మూలకారణమైన దివ్యశక్తి ఇక్కడ ఉన్నదని తెలుసుకొని వారెంతోకాలం ఇక్కడినే తపస్సు చేసి ఆ మహాశక్తి దర్శనం పొందారు. ఇంతటి మహాశక్తి ఆ ప్రదేశంలో ఉండడం చేత మనమందరము తిరుమలకు ఎంతో ఆకర్షితులమౌతాము.

ప్రపంచంలోని ఎన్నో దేశాలనుంచి ఎంతో దూరం నుంచి భక్తులు ఆ శక్తి వైపు ఆకర్షింపబడతారు. ఇంతకు ముందు చెప్పినట్లుగా ఆ శక్తి ఏ ఒక్క దేవతదో కాదు. ఈ సృష్టి మొత్తం ఆవిర్భావానికి బ్రహ్మ, శ్రీమన్నారాయణుడు, పరమేశ్వరుడు కంటే కూడా ముందుగా ఉన్న దివ్యశక్తి అది. ఇందువలన అక్కడ ఎప్పుడూ అద్భుతమైన తరంగాలు ప్రసరిస్తూంటాయి. ఇప్పటికి అనేక దేవతలు నిత్యం ఆ శక్తిని కొలుస్తూ అక్కడ సంచరిస్తూంటారు.

తిరుమల ఆలయంలో శిలారూపంలో మనకు దర్శనమిస్తున్న మూర్తి ఆ దివ్యశక్తియే సామాన్య మానవులకు ఆ మహాశక్తి దర్శనం దుర్లభం. కాబట్టి ఆ శక్తియే ఒక శిలారూపంలో మనకు దర్శనం అనుగ్రహిస్తున్నది. సర్వదేవతలు ఆ శక్తిలో ఉన్నాయి కాబట్టే అక్కడ మూర్తి కొంతకాలంపాటు పరమేశ్వరుని గాను, కొంతకాలంపాటు శక్తిరూపిణిగాను, కొంతకాలంపాటు శ్రీమహావిష్ణువుగాను, కొంతకాలంపాటు శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామిగాను ఇలా అనేక కాలాలలో అనేక దేవతల రూపంలో అర్చింపబడింది.

ఇంతే కాదు వివిధ సాంప్రదాయాలకు చెందిన అనేకమంది వారు ఆరాధించే దైవాన్ని ఇక్కడ మూర్తిలో దర్శించారు. ప్రస్తుతం ఆనందనిలయంలో ఉన్నది శ్రీమన్నారాయణుల వారి రూపంగా మనం కొలుస్తున్నప్పటికి కొంతమంది భక్తులకు అక్కడ ఉన్న దేవత పరమేశ్వరుడు గాను, కొంతమంది భక్తులకు శక్తిరూపిణి గాను, కొంతమంది భక్తులకు శ్రీనారసింహుడి గాను, కొంతమంది భక్తులకు శ్రీసుబ్రహ్మణ్యేశ్వరుడి రూపంలో దర్శనమివ్వడం జరుగుతుంది.

అప్పటినుంచి నేను ఎక్కడ ఉన్నా కాసేపు కనులు మూసుకొని ధ్యానంలో ఉన్నత స్థాయికి వెళ్ళినప్పుడు ఆ దివ్యశక్తి తన విశ్వరూపంతో నా హృదయంలోనే దర్శనమివ్వడం జరుగుతోంది. అలా దర్శనం కలిగిన ప్రతీసారి ఎందరో దేవతలు, ఎందరో మహర్షులు ఆ మహాశక్తిని కొలుస్తూ ఎన్నో స్తోత్రాలు చదువుతుండగా అవన్నీ నా శరీరమంతా దివ్యతరంగాలుగా ప్రతిధ్వనిస్తుంటాయి. ఆ స్థితిలో అందరూ అనుకునే బ్రహ్మానందం కలుగుతుంది. శరీరమంతా తేలిపోతూ ఏదో లోకంలో విహరిస్తూంటుంది. ఆ క్షణంలో నేను, ఆ దివ్యశక్తి ఒక్కటేనన్న సత్యం ఎంతో చక్కగా బోధపడుతుంది.

ఈ విశ్వమంతా వ్యాపించి ఉన్న మహాతత్వమే, మహాశక్తియే మన ఆత్మయందు కూడా ఉంది. మనం ధ్యానంలో ఎంతో ఉన్నత స్థితికి వెళితే ఈ విషయం చక్కగా తెలుసుకొనగలుగుతాం. ఈ అనుభవం వర్ణించలేని ఆనందాన్ని మనకి కలుగజేస్తుంది. ఈ జనన మరణ చక్రం నుంచి మనం పూర్తిగా బయపడతాము.

ఎందరో మహర్షులకు మహాపురుషులకు ఇటువంటి దివ్యశక్తి యొక్క విశ్వరూప దర్శనం వారి హృదయాలలోనే లభించింది. అటు తరువాత వారు లోక కళ్యాణానికై ఎన్నో గొప్ప కార్యాలు కూడా చేయడం జరిగింది. అయితే వీరిలో చాలామంది తమకు కలిగిన ఈ దివ్య అనుభవాన్ని బాహ్యంగా చెప్పలేదు. ఎందుకంటే సామాన్య మానవులకు ఇది ఊహకు కూడా అందని విషయం. కాని ఎన్నో జన్మల పుణ్యఫలంచేత, సంస్కారమంతమైన జీవితం గడపడంతోను, సద్గురువుల సాంగత్యంతోను, స్థితప్రజ్ఞతతో జీవించడం చేతను ఈ మహాశక్తి దర్శనం మన హృదయంలోనే తప్పక లభిస్తుంది.

ఆ దివ్యశక్తి అనుగ్రహం వలననే అటు తరువాత రోజులలో నేను శ్రీ లక్ష్మీనరసింహ వ్రతం, శ్రీ ఆనంద ఆంజనేయ వ్రతం, శ్రీ రామరక్షావ్రతం, శ్రీ మహేశ్వర వ్రతం, శ్రీ సుబ్రహ్మణ్య వ్రతం, శ్రీ శుభదుర్గ వత్రం, శ్రీ సాయిరక్షా వ్రతం, శ్రీ జ్ఞానసరస్వతి వ్రతం పుస్తకాలు కూడా రచించడం జరిగింది. ఇవన్నీ ఆయా దేవతల స్వరూపాల అనుగ్రహం తోనే వ్రాయడం జరిగింది. అక్షరం పరబ్రహ్మ స్వరూపం ఒక అక్షరం పలికేటప్పుడు తరంగాలు ఎంతో శక్తి కలిగి ఉంటాయి. అందునా కొన్ని అక్షర సమూహాలు ఇంకా శక్తివంతమై ఉంటాయి. అందుకే మనకు తెలిసిన ఎన్నో మంత్రాలు ఎంతో శక్తివంతమైనవి వాటిలో నిగూఢమై ఎంతో శక్తి ఉంటుంది.

నేను వ్రాసిన ఈ వ్రత పుస్తకాలలోని కథలలో కూడా అంతటి శక్తి ఉంది. ప్రపంచమంతా కొన్ని కోట్ల మంది ఈ పుస్తకాలు చదివి ఎన్నో దివ్యమైన అనుభూతుల్ని పొందుతున్నారు. వారి జీవితాలు శుభప్రదంగా గడుస్తున్నాయి. వారు కోరిన కోర్కెలు తీరుతున్నాయి. కేవలం మనశ్శాంతికోసం ఈ పుస్తకాలు చదివినా మనస్సుకు ఎంతో ప్రశాంతతను కలుగజేస్తున్నాయి. విశేషమేమిటంటే శ్రీ వేంకటేశ్వర వ్రతకల్పం తెలుగుతోపాటు, హింది, తమిళం, కన్నడ,

మళయాళం వంటి దేశీయ భాషల్లోనే కాకుండా ఫ్రెంచ్, జర్మనీ, ఇటలీ, రష్యా భాషలలోకి కూడా అనువదింపబడింది. ఆ జాతీయులు అందరూ కూడా ఈ వ్రతంలోని కథలు చదివి ఎంతో గొప్ప అనుభూతిని పొందుతున్నారు. ఒక మతంతోగాని, ఒక కులంతో గాని, సంబంధం లేకుండా ఈ శ్రీవేంకటేశ్వర వ్రతం చదువుతున్న వారందరికి ఎన్నో గొప్ప అనుభూతులు కలుగుతున్నాయంటే, ఆ కథలు, ఆ కథలలోని అక్షరాలకు ఎంత శక్తి ఉందో అర్థమవుతుంది. ఇదంతా ఆ దివ్యశక్తి అనుగ్రహం తప్ప మరొకటి కాదు.

8

భగవంతుడికి సంబంధించిన ఒక పుస్తకం రాయడమో, ఒక కీర్తన రాయడమో లేదా ఒక కీర్తన పాడగల్గడమో, ఒక ప్రవచనం చెప్పడమే చేస్తున్నామంటే అది పూర్తిగా భగవదనుగ్రహంగా భావించాలి. లేకపోతే ఇన్ని కోట్ల మందిలో ఎంతమందికి ఆ అనుగ్రహం కలుగుతుంది. అయితే అలా లభించిన వాళ్లు దాన్ని గొప్పవరంగా భావించి ఒక యజ్ఞంగా చేస్తే వాటికి సార్ధకత కలుగుతుంది. నేను ప్రతి పుస్తకం రాసేటప్పుడూ కొన్ని నియమాలు పాటిస్తుంటాను. ఇవి బాహ్యంగా కనిపించవు. కనిపించకూడదు కూడా! మనం నిర్వహించేది ఒక యజ్ఞంగా భావిస్తున్నప్పుడు అది అందరి దృష్టిలో పడాలని ఆలోచించకూడదు. మనం చేసే పని లోక కళ్యాణం కోసం భగవదర్పణంగా చేయ్యాలి. అప్పుడే వాటికి సార్ధకత లభిస్తుంది. కాలదోషం పట్టక చిరకాలం నిలుస్తాయి.

ఇక ప్రస్తుత విషయానికొస్తే ప్రతి రోజూ ప్రపంచంలో ఎక్కడో ఒక చోటనుంచి ఈ పుస్తకాలు చదవడం వల్ల వారి జీవితంలో ఫలానా అద్భుతం

జరిగిందని చెప్తుంటారు. ఒక్కోరోజు అలా నాలుగైదు ఫోన్‌లు కూడా వస్తుంటాయి. ఎంతో సంతోషం అనిపిస్తుంది. కొంతమంది చెప్పేవి వింటుంటే నా కళ్ళ వెంట నీరు కారుతుంది. ఆ భగవదనుగ్రహం ఇంతటిదా అని... ఒకరోజు రెండు ఫోన్లు మీతో ఇప్పుడు పంచుకుంటాను. ఇదేదో గొప్ప కోసం కాదు. సాటి మనుషుల జీవితంలో ఈ పుస్తకాలు చదివిన తరువాత ఎంత అద్భుతాలు జరుగుతున్నాయో వారి సంతోషం అందరితో పంచుకోవాలనిపించింది.

మొదటి ఫోన్ ఒక ఆవిడ అపోలో హాస్పిటల్ నుంచి ఫోన్ చేసారు. క్రిందటి నెలలో ఆవిడ భర్త విదేశాల నుంచి తిరిగివస్తూ హాంకాంగ్‌లో ఘోరమైన ఆక్సిడెంట్‌కి లోనయ్యాడు. ఎంతంటే కాలర్ బోన్ ఫ్రాక్చర్ అయ్యి మెడ వెనుక నరాలు చిట్లి పూర్తి పరాలిటిక్ అయిపోయారు. ఈవిడ హాంకాంగ్ వెళ్లి భర్తని తీసుకుని విమానంలో మూడు సీట్లు తీసేసి స్ట్రెచర్ మీద హైదరాబాద్ తీసుకువచ్చారు. ఇక్కడ డాక్టర్లు ఆయన పరిస్థితి చాలా సీరియస్‌గా ఉందనీ ఆపరేషన్ చెయ్యాలని కానీ చేసే పరిస్థితి కూడా లేదనీ అన్నారు. ఈవిడ కన్నీళ్ల పర్యంతం అయ్యింది. భర్తని, కేవలం నలబై సంవత్సరాల వయస్సువాడిని ఆ పరిస్థితిలో చూడలేకపోయింది. ఎవ్వరికీ అటువంటి కష్టం రాకూడదు.

ఇలా ఉండగా ఒకరోజు పక్కబెడ్లో ఉన్న పేషెంట్ నేను రాసిన శ్రీలక్ష్మీ నరసింహ వ్రతం చదువుకుంటూ కనబడ్డారు. ఈవిడతో ఆమె అమ్మా! మీ వారి పరిస్థితి చూస్తుంటే ఎంతో బాధగా ఉంది. ఈ పుస్తకం ఎంతో మహిమ గలది. మీరూ చదవండి మీవారు తప్పక కోలుకుంటారు అని అన్నారు. నేను ఆవిడ దగ్గర తీసుకుని ఆ క్షణాన్నే చదివాను. అలా నాలుగు రోజులు మూడుపూటలా మా వారి బెడ్ పక్కనే కూర్చుని వారికీ చదవి వినిపించేదాన్ని విశ్వపతి గారూ! ఐదో రోజు ఉదయం రౌండ్సుకి డాక్టర్స్ వచ్చారు. అమ్మా! ఒక అద్భుతం నిన్న మీ వారికీ యం.ఆర్.ఐ. చేసాము కదా. ఆశ్చర్యంగా ఎన్నో మార్పులు కనపడ్డాయి ఒక ఆపరేషన్ కూడా అవసరం లేదు. ఒక వారంలో ఇంకా మార్పు వస్తుంది అన్నారు. నా కళ్ళు నేనే నమ్మలేకపోయాను. అంతా మీరు రాసిన శ్రీ లక్ష్మీ నరసింహ వ్రతం మహిమ.

ఆ తర్వాత పదిరోజులకు ఇంటికి వచ్చాము విశ్వపతి గారూ.. ఇప్పుడు చాలా కోలుకున్నారు అంతా శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి అనుగ్రహం నేను కొన్ని రోజుల్లో మీ వద్దకు వచ్చి 200 కాపీలు తీసుకుని ఇక్కడ హాస్పిటల్ లో అందరికి ఇస్తాను మిమ్మల్ని జీవితంలో మర్చిపోను.

ఇక రెండవ ఫోన్ గురించి చెప్తాను. సర్ నా పేరు బలభద్రపాత్రుని శర్మ. గుంటూరు నుంచి 1990లో పొట్ట చేత బట్టుకుని హైదరాబాద్ వచ్చాను సార్! ఒక కనస్ట్రక్షన్ కంపెనీలో అకౌంటెంట్‌గా చేరి నెలకి పదివేల రూపాయల ఉద్యోగంతో కాలక్షేపం చేస్తున్నాను.

మీరు రాసిన శ్రీ వేంకటేశ్వర వ్రత కల్పం 2007లో ఎవరో ఇచ్చారు. దాన్ని పెద్దగా పట్టించుకోలేదు. పూజ పుస్తకాలలో పెట్టాను ఎప్పుడూ చదవలేదు. ఇలా ఉండగా 2012 లో నాకు లివర్ సిరోసిస్ వచ్చింది. ఏ అలవాట్లు లేని నాకు ఎలా వచ్చిందో తెలియదు. పూర్వజన్మ ప్రారబ్ధం అన్నమాట. డాక్టర్ నాగేశ్వర రెడ్డి గారి దగ్గరికి వెళ్ళాను లివర్ పూర్తిగా పాడయిందనీ గ్లోబల్ హాస్పిటల్‌కి వెళ్ళమన్నారు. గ్లోబర్ హాస్పిటల్ వాళ్ళు లివర్ ట్రాన్స్‌ప్లాంట్ చెయ్యాలనీ 40 లక్షలు ఖర్చు అవుతుందనీ అన్నారు నా గుండె గుభేలుమంది పదివేల జీతగాడిని అంత డబ్బు నేనెక్కడ నుంచి తెచ్చేది అని ఇంకా ఈ జీవితం ముగిసినట్లే అనుకున్నాను.

ఆ రోజు ఎందుకో నా పూర్వ జన్మ సుకృతం వల్ల మీరు రాసిన శ్రీవేంకటేశ్వర వ్రతకల్పం పుస్తకం గుర్తుకు వచ్చింది. వెంటనే స్వామీ! నీదే భారం అనుకుంటూ వారం రోజులు చదివి మళ్ళీ నాగేశ్వర రెడ్డి గారి దగ్గరికి వెళ్ళాను. గ్లోబల్ వాళ్ళు చెప్పిన విషయం వారికి చెప్పాను. అందుకు ఆయన నాతో మీరేమీ భయపడొద్దు మందులు మొదలుపెడదాము అన్నారు. శ్రీ వేంకటేశ్వర వ్రత కల్పం మొదలు పెట్టిన నెలలో కొంచెం తేడా కనిపించింది. శ్రీ వేంకటేశ్వర వ్రత కల్పం ప్రతీరోజూ చదువుతున్నాను. ప్రతి పదిహేను రోజులకీ లివర్ పరీక్షలు చేసేవారు. రెండు సంవత్సరాలు గడిచాయి. ప్రతి నెలకి ఒక సారి రమ్మన్నారు.

విశ్వపతిగారూ! ఆ స్వామి వారి పుణ్యమా అని మీ పుణ్యమా అని ఇప్పుడు పూర్తిగా నయం అయ్యింది. డాక్టర్లు ఇదొక అద్భుతంగా భావిస్తున్నారు. మీ శ్రీ వేంకటేశ్వర వ్రత కల్పం అద్భుతం సార్! నమ్మకంతో చదివితే ఎంతటి

అద్భుతాలైన చేస్తుంది. నా దగ్గర పుస్తకం జీర్ణావస్థకు వచ్చింది. ఒక్క పుస్తకం ఇవ్వగలరా? ఇదీ రెండవ ఫోన్ సారాంశం.

ప్రపంచ వ్యాప్తంగా కొన్ని కోట్ల మంది శ్రీ వేంకటేశ్వర వ్రత కల్పం నిత్యం చదువుతున్నారు. ఈ పుస్తకం కేవలం కథలు చదివినా ఎన్నో అద్భుతాలు జరుగుతున్నాయి. ఈ శ్రీ వేంకటేశ్వర వ్రత కల్పం చదవడానికి ఎటువంటి నియమ నిష్టలూ అవసరం లేదు. నా వెబ్‌సైట్ నుంచి ఉచితంగా ప్రింట్ తీసుకుని చక్కగా చదువుకోవచ్చు.

ఇంతకు మించిన ఆనందం ఏముంటుంది చెప్పండి ? ఈ జన్మకి ఇది చాలు. ఈ పుస్తకాలు ప్రపంచ వ్యాప్తం అయ్యేలా సహకరిస్తున్న మీ అందరికీ నమస్కారాలు. ఆ శ్రీనివాసునికి శతకోటి నమస్కారాలు. సర్వం శ్రీవేంకటేశ్వరార్పణమస్తు.

9

ఇంతకు ముందు చెప్పినట్లుగా రోజూ ప్రపంచంలో ఎక్కడో ఒక చోటినుంచి నాకు శ్రీ వేంకటేశ్వర వ్రత కల్పం వారి జీవితాల్లో చేసిన లీలలు గురించి ఎవరో ఒకరు ఫోన్ చేసి ఆనందంతో చెప్తూనే ఉంటారు. ఒక రోజు వచ్చిన ఫోన్ విశేషం మీతో ఇప్పుడు పంచుకుంటాను. భగవంతుడిని ఎంతో నమ్మకంతో పూజిస్తే మన జీవితాల్లో ఎన్ని అద్భుతాలు జరుగుతాయో గమనించండి.

ఒకరోజు ఉదయం 10 గంటల సమయంలో కరీంనగర్ నుంచి పద్మజ అని ఒకావిడ ఫోన్ చేసారు. వారి మాటల్లోనే చదవండి విశ్వపతి గారూ! ఒక సంవత్సరంగా మీకు ఫోన్ చేద్దామనుకుంటున్నాను. కానీ పెద్దవారితో మాట్లాడొచ్చో లేదో అని తటపటాయించాను కానీ మీరు రాసిన శ్రీ వేంకటేశ్వర వ్రతకల్పం వలన ఎంతో లబ్ధిపొంది మీకు చెప్పకపోవడం భావ్యం కాదనిపించింది. మా వారు చిన్న ఉద్యోగం చేసుకుంటున్నారు. ఆర్థికంగా ఎన్నో కష్టాల్లో ఉన్నాము. పెళ్లయి ఆరేళ్లయినా ఇంకా పిల్లలు లేరు. మా కులదైవం

శ్రీవేంకటేశ్వర స్వామి వారు. రోజూ ఆ స్వామి వారికి నమస్కారం పెట్టుకునేదాన్ని ఇదంతా రెండు సంవత్సరాలు క్రిందటి మాట.

అలా కష్టాల్లో ఉంటూ స్వామి వారిని తల్చుకుంటూ ఉండేవాళ్ళము. మా తాతగారు ఇక్కడి ప్రాంతాల్లో పేరున్న జ్యోతిష్కులు. 2003లో కాలం చేసారు. వారు ఎప్పుడో 1920 నుంచి సేకరించిన పంచాంగాలన్నీ ఒక పాత రేకు పెట్టెలోఉన్నాయి. మాకెవ్వరికీ జ్యోతిష్యం రాకపోయినా ఎందుకో ఆ పాతపెట్టెని పారెయ్యబుద్ధికాలేదు. ఒక మూల అలా ఉండేది తాతగారు మరణించిన తర్వాత ఆ పెట్టెజోలికే పోలేదు. ఆపెట్టెపైన పాత బట్టల మూటలూ అవీ ఉంచేవాళ్ళం.

ఇలా ఉండగా ఒకరోజు మా ఇంటికి జగిత్యాల దగ్గర ఒక పల్లెటూరు నుంచి ఒక పెద్దాయన వచ్చారు. నుదుట శ్రీ వైష్ణవ నామంతో ఎంతో తేజస్సుతో ఉన్నారు. వయస్సు ఎనభై పైనే ఉండొచ్చు అనిపించింది. నాతో ఇలా అన్నారు. అమ్మా! మీ తాతగారు నాకెంతో ఆప్తులు. నాకిప్పుడు 82 ఏళ్ళు. 1935లో పుట్టాను. నాకు అప్పటి పంచాంగం పని పడింది. నా దగ్గర ఉన్నది ఎక్కడో పోయింది. మీ తాతగారి పెట్టె మీ దగ్గర ఉంటే కొంచెం ఆ పంచాంగం చూసి ఇస్తారేమోనని వచ్చాను. కొన్ని వివరాలు చూసి ఇచ్చేస్తాను అన్నారు. 2003లో మా తాతగారు పోయిన తర్వాత మేమెప్పుడూ వారి పెట్టె తెరవలేదు. లోపల పుస్తకాలు ఎలా ఉన్నాయో ఏమో చూస్తాను. అని వారితో అన్నాను.

మెల్లగా ఆ పెట్టె పైన ఉన్న బట్టల మూటలు తీసి పక్కన పెట్టాను. పెట్టెని దుమ్ము దులిపి తెరిచి చూసాను. అన్నీ పాత పంచాంగాలే. అన్నీ వరుసగా ఉన్నాయి. కాసేపు వెతగ్గానే 1935 పంచాంగం దొరికింది. అయితే ఆశ్చర్యంగా ఆ పంచాంగం పైన అంటే 1934కి, 1935కి మధ్య శ్రీ వేంకటేశ్వర వ్రత కల్పం అనే పుస్తకం కనబడింది. ఈ పుస్తకం ఇంతకు ముందు మేము ఎప్పుడూ చూడలేదే అని ఆశ్చర్యపోతూ కళ్లకి అద్దుకుని తీసుకున్నాను. వచ్చిన పెద్దవారికి 1935 పంచాంగం తీసి ఇచ్చాను. వారు ఒక పావుగంట ఆ పంచాంగం అటూ ఇటూ తిరగేసి నాకు తిరిగి ఇచ్చేసి వెళ్ళిపోయారు. ఆ తర్వాత శ్రీవేంకటేశ్వర వ్రత కల్పం పుస్తకం వివరంగా చూసాను. విధానం తేలికగా ఉంది.

తాతగారికి ఎవరిచ్చారో ఏమో. ఆ తర్వాత రోజే వ్రతం చెయ్యడం మొదలు పెట్టాను. ప్రతి శనివారం తప్పకుండా చేసేదాన్ని. మూడు నెలలు చెయ్యగానే ఎంతో ఫలితం కనిపించింది. మా వారికి ఉద్యోగంలో జీతం పెరిగింది. నేను గర్భవతి నయ్యాను. చక్కటి పిల్లవాడు పుట్టాడు.

ఒక రోజు అసలు ఈ పుస్తకం ఎప్పటిదా అని చూసాను. అంతే! నా వొళ్ళు ఝుల్లుమంది. ఈ పుస్తకం 2005లో ప్రింట్ అయినట్లు ఉంది. మా తాతగారేమో 2003 లోనే కాలం చేసారు. వారి పెట్టె ఇన్ని సంవత్సరాలు ఎవ్వరూ తెరవలేదు. అప్పుడు అర్థం అయ్యింది ఆ రోజు వచ్చిన పెద్దవారు సాక్షాత్తూ శ్రీనివాసుడే! పంచాంగం కోసం అడిగి నాకు ఆ పుస్తకం దొరికేలా చేసారు. ఆ పుస్తకం కూడా శ్రీ స్వామి వారే అనుగ్రహించారు. లేకపోతే 2005లో రాసిన పుస్తకం 2003లోనే మా తాత గారి దగ్గర ఉండటమేమిటి? ఈ పుస్తకం నాకు అపురూపం సాక్షాత్తూ స్వామివారే ప్రసాదించింది. అందులో మీ ఫోన్ నెంబర్ చూసాను. ఇన్నాళ్ళుగా ఆలోచించి ఇప్పుడు చేశాను. శ్రీనివాసునికి శతకోటి నమస్కారాలు. మీకు ఎన్నో కృతజ్ఞతలు. మిమ్మల్ని ఎప్పటికీ మర్చిపోను ఉంటాను స్వామి అని పద్మజగారు అన్నారు.

పద్మజగారు చెప్పిన ఈ విషయాలన్నీ విని నా వొళ్ళు ఆనందంతో పులకించింది. శ్రీ స్వామి వారే ఆ పుస్తకాన్ని అనుగ్రహించారంటే ఆ స్వామికి శ్రీవేంకటేశ్వర వ్రత కల్పం ఎంత ఇష్టమో అర్థం అయ్యింది. నా జన్మ తరించింది. ఇలా ఇన్ని సంవత్సరాలుగా ఎందరో భక్తులు సాక్షాత్తూ శ్రీవేంకటేశ్వర స్వామి వారే ఏదో రూపంలో వచ్చి తమకు శ్రీవేంకటేశ్వర వ్రత కల్పం పుస్తకం ఇచ్చారని చెప్తూంటారు. ఇంతకు మించిన ఆనందం ఏముంటుంది?

10

నేను ఇప్పటిదాకా ఆ శ్రీనివాసుడు, ఇంకా ఎందరో దేవతల అనుగ్రహంతో 28 ఆధ్యాత్మిక పుస్తకాలు రచించడం జరిగింది. వీటిలో 18 పుస్తకాలు ఆ శ్రీనివాసునికి సంబంధించినవే అవడం స్వామి నాపై కురిపిస్తున్న అపార అనుగ్రహం తప్ప మరొకటి కాదు. ఈ పుస్తకాలు అన్నీ రాసేటప్పుడు బాహ్యంగా చూసే వారికి తెలియని నియమాలు ఎన్నో పాటిస్తూ ఉంటాను. మరి భగవంతుడే మన పక్కన కూర్చుని చెప్తున్నప్పుడు ఎంత ఉత్కృష్ఠ విషయంగా గ్రహించాలి మరి.

కోట్లాది మంది సామాన్య జనుల నుంచీ అనేక ప్రముఖ పీఠాధిపతులు వరకూ ఈ పుస్తకాలు నిత్యం చదవడం...ఎన్నో దేశాలలో ఎన్నో వెబ్‌సైట్‌లలో ఈ పుస్తకాలు అన్నీ ఉచిత డౌన్లోడ్ కోసం పెట్టడం...ఎన్నో ప్రపంచ ప్రఖ్యాత లైబ్రరీలలో వుంచడం.తెలుగు నుంచి రష్యన్ భాష వరకూ పద్నాలుగు భాషల్లోకి అనువదించబడడం. ఎన్నో కోట్ల మంది జీవితాలు బాగుపడుతుండడం...ఇవన్నీ దైవ అనుగ్రహం కాక మరేమిటి?...ఎందరో దేవతల అపూర్వ అనుగ్రహం తప్ప వేరే ఏదీ కాదు...

నేను రాసిన ఈ పుస్తకాలు వేటినీ నేను జీవించి ఉన్నంత కాలం అమ్మదలచుకోలేదు...అసలు ఎప్పటికి ఇవి ఉచితంగానే భక్తులకి వెళ్ళాలి...ఎందుకో అమ్మడానికి నాకు మనస్సు వొప్పదు...కానీ ఇన్ని లక్షలు కాపీలు ముద్రించి ఉచితంగా పంచాలంటే మహా యజ్ఞమే అవుతుంది...ఇది మహా యజ్ఞం గానే భావించి చేస్తున్నాను...విశేషం ఏంటంటే ఈ యజ్ఞంలో ఎందరో మహానుభావులు తమ అమూల్య సహాయ సహకారాలు అందించడం...లేకపోతే ఎటువంటి ఆఫీస్ గానీ, ట్రస్ట్‌లు గానీ, పెద్దగా ఆర్థిక వనరులు గానీ, మందీ మార్బలం గానీ లేని నా ఒక్కడి వల్ల ఇదంతా అవుతుందా?... గత 18 సంవత్సరాలుగా ప్రతీ ఆరు నెలలకి 15-20,000 పుస్తకాలు ప్రించ్ చేసి ఉచితంగా పంచుతున్నాము...2005లో రాసిన శ్రీ వేంకటేశ్వర వ్రత కల్పం పుస్తకం ఒక్కటే ప్రతీ ఆరు నెలలకి 10,000 ప్రింట్ చేస్తున్నాము...కొన్ని లక్షలు జిరాక్స్ చేశారు. చేస్తున్నారు...విశేషం ఏమిటంటే నాకు అప్పుడప్పుడూ ప్రింటింగ్ కి ఆర్థిక సహాయం చెయ్యడానికి ఎవరో వొకరు విచిత్ర రీతులలో దైవిక ప్రేరణతో ముందుకు వస్తారు...ఇందులో చాలా మంది నాకు ఏ మాత్రం పరిచయం లేని వారు కూడా ఉంటారు...

చాలా సంతోషకర విషయం ఏమిటంటే ఆ దేవతలు అందరూ ఇన్ని సంవత్సరాలుగా నిత్యం ఎవరో ఒకరిని ఈ పనికి ఎన్నుకుని దీనిలో పాల్గొనేలా చేస్తారు...ఏదో చిన్న పల్లెటూరు నుంచి ఒకరు ఫోన్ చేసి సార్ మీ పుస్తకాలు చదివి మేము ఎంతో బాగుపడ్డాము...మీకు ఒక వెయ్యి రూపాయలు పంపిస్తాను అనడం జరుగుతూ వుంటుంది...నేను ఎంత వద్దన్న వినరు...ఏదో మాకు తోచింది ఇస్తాము...కాదనకండి అంటారు.

ఒక్కోసారి అయ్యో ఈ పుస్తకాలు ఒక్కటి కూడా లేవే అనుకోగానే ఎవరో అపరిచిత భక్తుడు ఫోన్ చేసి...స్వామీ మీ శ్రీ వేంకటేశ్వర వ్రత కల్పం మాకు అనుకోకుండా ఎవరో ఇంటర్నెట్‌లో పంపారు...చదివిన వెంటనే ఎంతో కాలంగా వున్న సమస్య వెంటనే తీరింది...దయచేసి ఈసారి ప్రింట్ చేసి నప్పుడు చెప్పండి. మాకు కూడా మీ పుస్తక ప్రసాదంలో పాల్గొనే భాగ్యం ఇవ్వండి అంటారు...అంతే ఆ సారి పుస్తకాలు ప్రింటింగ్ శ్రీ స్వామి వారి అనుగ్రహంతో అలా జరుగుతుంది.

అలాగే కొందరు అనుకోని రీతిలో ఫోన్ చేసి గురువు గారూ మీ సేవలో మాకు కూడా భాగ్యం ఇవ్వండి అని అడుగుతుంటారు...ఇలా ఎందరో మహానుభావులు చేస్తుండ బట్టే ఈ యజ్ఞం చెయ్య గలుగుతున్నాము...అందరికీ నా నమస్కారాలు...

ఈ క్రమంలో ఎన్నో అద్భుతమైన స్వామి వారి లీలలు చూస్తున్నాను...ఈ మధ్య జరిగిన ఒక విశేషం మీతో పంచుకుంటాను...

ఈ మధ్య ఒకరోజు నెల్లూరు నుంచి కృష్ణారావు గారు అని ఒక 80 సంవత్సరాల పెద్దవారు ఫోన్‌చేసి ఇలా అన్నారు. అయ్యా విశ్వపతిగారూ! నా పేరు కృష్ణారావు నెల్లూరు నుంచి మాట్లాడుతున్నాను. నాకు చిన్నప్పటి నుంచీ ఏడు శనివారాలు వ్రతం చేసే అలవాటు. ఇన్ని సంవత్సరాలుగా ఈ వ్రతమే చేస్తున్నాను. ఆ పుస్తకం ఈ మధ్య శిధిలమైపోయింది. ఇలా గడుస్తుండగా ఈ రోజు ఒక విశేషం జరిగింది. ఈ రోజు ఏడు శనివారాలు వ్రతం చదివి పూజ పూర్తి కాగానే శ్రీ స్వామివారు నాతో ఇలా అన్నారు. నాయనా కృష్ణారావు! ఇంకా ఈ వారంతో ఈ ఏడు శనివారాలు వ్రతం ఆపి వచ్చే వారం నుంచీ విశ్వపతి శ్రీ వేంకటేశ్వర వ్రత కల్పం చదువు అంతే కాదు. వారికి పుస్తకాల ప్రచురణకి ఒక అయిదు వేల రూపాయలు పంపు అన్నారు విశ్వపతిగారూ! మా దూరపు బంధువు నుంచి మీ ఫోన్ నంబర్ తీసుకున్నాను. దయచేసి శ్రీ వేంకటేశ్వర వ్రత కల్పం పంపించండి అలాగే మీ బ్యాంక్ అకౌంట్ డిటైల్స్ కూడా పంపించండి మీకు శ్రీ శ్రీనివాసుని ఆదేశం ప్రకారం అయిదు వేలు ట్రాన్స్ఫర్ చేస్తాను అని అన్నారు

ఈ మాటలు విన్న నాకు నోట మాట రాలేదు వీరు వయస్సులో పెద్దవారు అందునా చిన్నప్పటి నుంచీ శ్రీనివాసుని భక్తులు అబద్దంఆడతారని అనుకోవడం తప్పే కాదు మహా పాపం కూడా! సాక్షాత్తూ శ్రీ స్వామి వారే నా పుస్తకం చదవమని చెప్పడం ఇంకా నాకు అయిదు వేలు పంపమని చెప్పడం నా వొళ్ళు జలదరించింది. ఇంత కంటే మహాభాగ్యం ఏముంటుంది? నేను వెంటనే వారితో ఇలా అన్నాను అయ్యా మీరు చెప్పింది విని నా జన్మ ధన్యం అయింది. మీకు త్వరలో తప్పకుండా శ్రీ వేంకటేశ్వర వ్రత కల్పం పుస్తకాలు పంపిస్తాను. అయితే దయచేసి తమరు డబ్బు మాత్రం పంపవద్దు నేను అన్ని పుస్తకాలు

ఉచితంగానే ఇస్తున్నాను అని అన్నాను దానికి వారు ససేమిరా ఒప్పుకోలేదు. ఆ శ్రీనివాసుడు నాతో మీ పుస్తకం చదవమని చెప్పడంతో పాటు మీకు డబ్బు పంపమని కూడా చెప్పారు ఇది స్వామి ఆదేశం మీరు కాదనవద్దు అని అన్నారు. పెద్దవారు అంతగా చెపుతుండే ఇంక ఒప్పుకోక తప్పింది కాదు. ఆ తర్వాత రెండు గంటలకి మళ్ళీ ఫోన్‌చేసి మీ అకౌంట్ డిటైల్స్ ఇంకా పంపలేదు మీరు అని అన్నారు. పెద్దవారు కదా ఒక పని, అందునా స్వామి వారి పని అయితే ఊరుకుంటారా! ఆయనకు నాకు డబ్బు పంపే వరకూ నిద్ర పట్టేలా లేదు వెంటనే నేను నా అకౌంట్ డిటైల్స్ పంపడం వారు అయిదు వేల రూపాయలు ట్రాన్స్ఫర్ చేయడమూ చక చకా జరిగిపోయాయి.

చూసారా! శ్రీనివాసుని అద్భుత లీల అసలు ఈ కలియుగంలో కూడా ఇలా జరుగుతాయా అని ఆశ్చర్యం కలుగుతుంది. కానీ ఇన్ని సంవత్సరాలుగా ఇలాంటి భగవత్ లీలలు ఎన్నో చూస్తున్నాను. నా పుస్తకాలకి ఆర్థిక సహాయం చేస్తున్న మీ అందరికీ స్వామి ప్రేరణ కారణం. మీరు అంటే ఆ స్వామి వారికి ఎంతో ఇష్టం. అందుకే మీ ధనమే ఈ పుస్తకాల ప్రచురణలో వినియోగం చెయ్యబడుతోంది. మనం అందరం ఎంత ధన్యులమో చూసారా!

ఈ రోజున కోట్లాది మంది ఈ పుస్తకాలు చదువుతున్నారు. ఇవి చదివిన తర్వాత ఎందరో జీవితాలలో అద్భుతాలు జరుగుతున్నాయి. ఎన్నో కుటుంబాలలో వివాహాలు జరగడం, సంతానం కలగడం, ఉద్యోగం లభించడం, ఆర్థిక సమస్యలు తొలగిపోవడం, అనారోగ్యం తగ్గడం ఇలా ఎన్నెన్నో కోరికలు తీరుతున్నాయి.

ఆయా దేవతలు అందరికీ ఈ పుస్తకాలు ఎంతో ప్రీతికరం కాబట్టే ఇవి చదివిన వారికి అద్భుతాలు జరుగుతున్నాయి అని నా నమ్మకం. అందుకే ఈ పుస్తక ప్రచురణ, ఉచితంగా పంచడం ఒక మహా యజ్ఞంగా భావిస్తున్నాను. ఈ యజ్ఞానికి అపూర్వ సహాయం చేస్తున్న మీ అందరికీ చేతులెత్తి నమస్కరిస్తున్నాను. ఎవరి పేరు అని చెప్పను? నా బంధువులు, నా స్నేహితులు, అసలు నన్ను ఇప్పటికి కలవని వారు, ఎన్నో దేశాలలో ఉన్నవారు...ఎందరో మహానుభావులు...అందరికీ వందనాలు.

నా తదనంతరం కూడా మీ అందరూ ఈ యజ్ఞాన్ని సర్వ దేవతల కరుణా కటాక్షాలతో ఇలాగే ముందుకు తీసుకు వెళ్తారని నా నమ్మకం, నా విశ్వాసం. ఎవరైనా నా పుస్తకాలు ఎన్నైనా ఉచితంగా ప్రింట్ చేసుకోవచ్చు. నాకు తెలుపనవసరం లేదు. ఉచితంగా పంచండి. అంతే తప్ప దయచేసి అమ్మవద్దు. ఇలా బాగుపడిన ఎన్నో లక్షల మంది ఆత్మల దేవెనలు మీకు మీ కుటుంబానికే కాదు ఎన్నో తరాల వారిపై ఉంటాయి. ఎన్నో తరాల వారిని రక్షిస్తుంటాయి. ఇది నేను చూస్తున్న సత్యం. అనుభవస్తున్న అపార దైవకృప. ఎందరో భక్తులకు అనుభవైక వేద్యం.

11

భగవంతుడి లీలలు అద్భుతంగానూ, ఒక్కోసారి నమ్మశక్యం కానివి గానూ ఉంటాయి. 2020 సంవత్సరంలో వినాయకచవితి నాడు నాకు ఇటువంటి ఒక అద్భుతమైనలీల అనుభవానికి వచ్చింది. ఇది చదివితే కలియుగంలో కూడా ఇటువంటివి సాధ్యమేనా అనిపిస్తుంది. కానీ మనం ఎప్పుడైతే భగవంతుని, ఏ రూపంలో నైనా సరే ఆర్తితో ఆరాధిస్తామో అప్పుడు ఇటువంటి లీలలు తప్పక సాధ్యమౌతాయి.

ఆ రోజు వినాయక చవితి పూజ అయి భోజనం అయ్యేసరికి మూడు గంటలు అయ్యింది. కాసేపు పడుకుందామని మూడున్నరకి కాస్త నడుము వాల్చాను. కాస్త కునుకు పట్టింది. 4.30 అయ్యింది. ఫోన్ మోగింది. కొంచెం బద్ధకంగా ఉండి ఫోన్ తియ్యలేదు...5 గంటలు అయ్యింది...లేచి ముఖం కడుక్కుని రుక్మిణి ఇచ్చిన టీ తాగుతూ ఏదో ఆలోచిస్తున్నాను...ఫోన్ మళ్ళీ మోగింది... అదే నెంబర్...ఈసారి తీసి హలో అన్నాను. అవతల నుంచి ఒక స్త్రీ గొంతు. విశ్వపతి గారూ! ఒక్క నిమిషం మాట్లాడొచ్చా అన్నారు. అయ్యో దానికేమి భాగ్యం చెప్పండి అన్నాను.

అప్పుడు ఆవిడ ఇలా చెప్పారు. అయ్యా విశ్వపతి గారూ! నేను హైదరాబాద్ వనస్థలిపురం నుంచి మాట్లాడుతున్నాను. నేను ధ్యాన మార్గంలో ఉన్నాను. మీరు రాసిన శ్రీకృష్ణ వ్రతం ఒక సంవత్సరం క్రితం కొండాపూర్ వారి రామాలయంలో దొరికింది. అయితే ఎప్పుడూ ఆ పుస్తకం తీసి చదవలేదు. ఎందుకో ఈ రోజు తీసి చదువుదాము అనిపించింది. ఉదయం శ్రీకృష్ణ వ్రతం కథలు చదువుకున్నాను. ఎంతో బాగున్నాయి. ఇందాక నాలుగు గంటలకి ఒక అద్భుతం జరిగింది. శ్రీకృష్ణ స్వామి నాకు మనస్సులో దర్శనమిచ్చి ఈ శ్రీకృష్ణ వ్రతం రాసిన వారికి ఫోన్ చేసి మాట్లాడు అన్నారు. నేను ఆశ్చర్యపోయాను. శ్రీకృష్ణుల వారేమిటి? ఇలా దర్శనమిచ్చి మీకు ఫోన్ చెయ్యమని చెప్పడమేమిటి? నా వొళ్ళు జలదరించింది. అలాగే మీకు ఫోన్ చేశాను. అయితే మీరు ఫోన్ తీయ్యలేదు. ఏదో బిజీగా ఉండి ఉంటారని ఊరుకున్నాను.

ఇంతలో సమయం అయిదున్నర అయ్యింది. శ్రీకృష్ణుల వారు మళ్లీ నాతో మీకు ఫోన్ చెయ్యమని అన్నారు. స్వామీ! నేను ఫోన్ చేశాను. కానీ వారు తియ్యలేదు అన్నాను. అప్పుడు శ్రీకృష్ణుల వారు నాతో నువ్వు చేసిన ఫోన్ చూసుకోలేదు. ఇప్పుడు నువ్వు కొంచెం అన్నం తిని మళ్లీ ఫోన్ చెయ్యి. ఆయన తప్పక ఫోన్ తీస్తారు. అని స్వామి అన్నారు.

ఇదేమిటి ఈ వేళలో స్వామి అన్నం తినమంటారేమిటి? అని ఆశ్చర్యపోయాను. సరే స్వామి ఆంతర్యం మనకి తెలీదుగా! శ్రీకృష్ణ స్వామి చెప్పినట్లు గానే కొంచెం అన్నం తిని ఫోన్ చేశాను. స్వామి వారు చెప్పినట్లే మీరు ఫోన్ తీశారు అని చెప్పారు.

ఇదంతా వింటుంటే నా వొళ్ళు జలదరించింది. సాక్షాత్తూ ఆ పురుషోత్తముడైన శ్రీకృష్ణ భగవానుల వారే నాతో మాట్లాడమని చెప్పారంటే ఇంతకు మించిన భాగ్యం ఏముంటుంది? నా పుస్తకాలు అన్నీ ఆవిడకు పంపిస్తాను అని చెప్పాను. ఆవిడ పేరు చెప్పడానికి ఇష్టపడలేదు. మీరు ఏ పేరుతో పిలిస్తే అదే నా పేరు అన్నారు. మా వారు వచ్చాక మీకు ఫోన్ చేసి మా అడ్రస్ చెప్తారు అన్నారు. ఆ మర్నాడు వారి భర్తగారు నాకు ఫోన్ చేసి వారి అడ్రస్ చెప్పడం, నేను వారికి పుస్తకాలు పంపడం జరిగింది. అవి అందుకొని వారెంతో సంతోషపడి ఫోన్ చేసి తమ కృతజ్ఞతలు తెలిపారు.

భగవంతుడి లీలలు ఎంత అద్భుతంగా ఉంటాయి చూసారా? ఆ అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుని లీలలు అనంతం. యుగయుగాలుగా ఎందరో భక్తులు ఇటువంటి మధురానుభూతులు ఎన్నో పొందుతున్నారు. ఆ పురుషోత్తమునితో ఎవరి దివ్య అనుభవాలు వారికే ప్రత్యేకం కదా! సర్వం శ్రీకృష్ణార్పణమస్తు. సర్వేజనా సుఖినోభవంతు.

నా పుస్తకాలకోసం ప్రతిరోజూ ఎన్నో ఫోన్లో వస్తుంటాయి. ప్రతీ ఒక్కరి చిరునామా తీసుకొని వారికి పుస్తకాలు పంపిస్తుంటాము. చేరిన తరువాత వారు ఎంతో సంతోషపడి ఫోన్ చేసి చెప్తారు. అలాగే కొంతమంది ఈ పుస్తకాలు చదివిన తరువాత తమ జీవితాలలో జరిగిన అనేక అద్భుత సంఘటనలు ఫోన్ చేసి చెప్తుంటారు. అవి విని మాకెంతో సంతోషం కలుగుతుంది. ఇలా ఎందరికో వెళ్ళి వాళ్ళ జీవితాలు బాగు పడుతుంటే అంతకుమించి మన అందరికీ సంతోషం ఏముంటుంది? అందరూ బాగుంటే మనం బాగుంటాము. అదే నా ఆలోచన నా విశ్వాసం. ఈ సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో అద్భుతాలు వింటుంటాను. ఈ పుస్తకాలు గురించి తెలపడం, దొరకడం కూడా భగవంతుని అనుగ్రహంగా చాలామంది భావిస్తారు. ఇంకా విశేషం ఏమిటంటే కొంత మందికి ఆయా దేవతలే ఈ పుస్తకాల గురించి చెప్తున్నారు అంటే ఒళ్ళు గగుర్పొడుస్తుంది. ఈ కలియుగంలో కూడా ఇలా జరుగుతున్నయంటే ఎంతో ఆశ్చర్యం కలుగుతుంది. ఇంతకు మించిన భాగ్యం నాకు ఏముంటుంది? ఇలా ఈ మధ్య వచ్చిన రెండు ఫోన్లు చెప్తాను విని ఆనందించండి.

నేను రాసిన పుస్తకాల్లో ఆ జగన్మాత పై రాసిన శ్రీశుభదుర్గ వ్రతం ఒకటి. ఈ పుస్తకం ఎందరో స్త్రీమూర్తులకు అపురూపం. ప్రతీ శుక్రవారం ఈ పుస్తకం లోని అయిదు కథలూ చదువుతారు. నవరాత్రులలో ప్రతీరోజూ చదువుతారు. ఎందరో దేవి ఉపాసకులకు ఈ పుస్తకం ఎంతో అపురూపం. ఎన్నో ఆలయాలలో నిత్యం చదవబడుతోంది. కొన్ని నెలల క్రితం అమెరికా నుంచి ఒకతను ఫోన్ చేసి ఇలా అన్నాడు. విశ్వపతి గారూ! మీకు ఎన్నో నమస్కారాలు. నేను ఇక్కడ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాను. శ్రీ కనకదుర్గ మాత అంటే నాకు ఎంతో ఇష్టం. ఒకరోజు నేను మా ఇంటికి దగ్గర్లో వున్న ఒక గడిలో కూర్చుని కళ్ళు మూసుకుని అమ్మవారిని ధ్యానం చేస్తున్నాను. ఒక్కసారిగా నా ఒళ్ళో ఏదో పడినట్లు అనిపించింది. కళ్ళు తెరిచి చూస్తే ఒక రెండు సంవత్సరాల

పాప నా ఒళ్ళో శ్రీ శుభదుర్గ వ్రతం పుస్తకం పడేసి వెంటనే చిన్ని చిన్ని అడుగులు వేసుకుంటూ క్షణంలో మాయమయింది. ఒక్కసారిగా జరిగిన ఈ పరిణామానికి ఆశ్చర్యపోయాను. ఆలయం అటూ ఇటూ తిరిగాను. ఆ పాప ఎక్కడా కనపడలేదు. మీ పుస్తకాలు గురించి, మీ గురించీ నాకు ఇప్పటిదాకా తెలీదు. గర్భాలయం దగ్గర మీ పుస్తకాలు మరికొన్ని చూసాను. ఎవరు ఇచ్చారో తెలీదు. ఆ పాప ఈ అమ్మవారి పుస్తకమే నాకు ఎందుకు ఇచ్చినట్లు? కళ్ళకు అద్దుకుని ఇంటికి వచ్చి మా శ్రీమతికి చెప్పాను.

వెంటనే తను ఆనందంతో ఉండు ఆనంద్ ఒక విషయం చెప్తాను. వారం రోజుల నుంచి అమ్మవారు రోజూ కలలోకి వస్తున్నారు. ఇందుకే అన్నమాట. అమ్మవారే ఆ పాప రూపంలో మనకు అనుగ్రహించింది. ఏ మాత్రం అనుమానం లేదు. అని ఎంతో సంతోషపడుతూ చెప్పింది. విశ్వపతి గారూ! ఇదండీ విశేషం సాక్షాత్తూ అమ్మవారే అనుగ్రహించిన ఈ పుస్తకం నాకెంతో అపురూపం అని అన్నారు. నాకు ఒళ్ళు జలదరించింది. ఆ జగన్మాతకు ఇక్కడ నుంచే నమస్కారాలు పెట్టుకున్నాను.

క్రిందటి వారం మరో ఫోను. హైదరాబాద్ నుంచి ఒక అమ్మాయి ఫోన్ చేసి ఇలా చెప్పింది. అంకుల్! మీరు రాసిన శ్రీ శుభదుర్గ వ్రతం పుస్తకం కావాలి. పంపిస్తారా?నీకు ఈ పుస్తకం ఎలా తెలిసింది అమ్మా అని అడిగాను. అప్పుడు ఆ అమ్మాయి ఇలా అంది. అంకుల్! ఒక వారం క్రితం అమ్మవారు నాకు కలలో కనపడి ఒక పుస్తకం చూపించి ఈ పుస్తకం చదువు. నీకు మంచి జరుగుతుంది అని చెప్పారు. తెల్లవారాక ఆ పుస్తకం పేరు గుర్తు రాలేదు ఏదో స, శ్రీ అక్షరాలతో ఉంటుంది ఎంత ఆలోచించినా గుర్తుకు రాలేదు. అప్పుడు అమ్మని అడిగాను శ్రీతో వచ్చే నాలుగు అయిదు అమ్మవారి పుస్తకాల పేర్లు చెప్పింది. కానీ అవేమీ కావు.

ఇంక లాభంలేదు అనుకుని అమ్మవారికి నమస్కారం పెట్టుకుని ఇంటర్నెట్‌లో అమ్మవారి పుస్తకాల కోసం వెతికాను. అంతే మీ వెబ్‌సైట్ కనిపించింది. అందులో శ్రీ శుభదుర్గ వ్రతం పుస్తకం కనిపించింది. అంతే ఎగిరి గంతేశాను. కలలో అమ్మవారు చూపించింది ఈ పుస్తకమే! ఎంతో సంతోషం వేసింది. నాకు ఎలాగైనా ఒక పుస్తకం పంపండి అంకుల్! అంది ఇది విన్న నాకు

నోట మాట రాలేదు అమ్మవారి అనుగ్రహానికి నాకు ఎంతో ఆనందం వేసింది. కళ్ళ నీళ్ళు కారాయి. సాక్షాత్తూ ఆ జగన్మాత ఈ పుస్తకం చదవమని చెప్పారంటే ఇంతకుమించి భాగ్యం ఏముంటుంది? ఇలా ఇప్పటిదాకా ఎన్నో సార్లు ఆయా దేవతలేఈ పుస్తకాల గురించి భక్తులకు చెప్పడం లేదా ఏదో రూపంలో ఇవ్వడం వింటున్నాను. అమ్మవారి అనుగ్రహం అపారమైనది ఆ తల్లికి మనం అందరం అంటే ఎంతో ప్రేమ.

12

అప్పుడప్పుడు నా దగ్గరకి వచ్చే కొంతమంది తాము ఎన్నో మంచి పనులు చేస్తున్నా ఎంతో ధర్మ మార్గంలో ఉంటున్నా, ఎన్నో నియమనిష్టలు పాటిస్తున్నా, నిత్యం ధ్యానంలో ఉంటున్నా ఆత్మ పయనంలో, సాధన మార్గంలో ముందుకు వెళ్ళలేక పోతున్నాం అని చాలా బాధపడుతుంటారు. ముందుకు వెళ్ళాలి అంటే ఏమి చెయ్యాలి అని అడుగుతుంటారు. కొంతమంది ఆధ్యాత్మిక మార్గంలో తమ తోటివారు ముందుకు వెళుతుంటే తాము అంత వెళ్ళలేక పోతున్నామని నా దగ్గర ఎంతో బాధపడుతూ చెప్పుకుంటారు. చాలా అసంతృప్తితో ఉంటారు. ఎంత ప్రయత్నించినా ఇంకా ముందుకు వెళ్ళలేదని బాధపడుతుంటారు.

ఈ మధ్య సుబ్బారావు అని ఒకాయన నా దగ్గరకి వచ్చారు. వారు ఎంతో ఉన్నతంగా బ్రతుకుతున్నారు. చిన్న ఉద్యోగం చేసుకుంటూ, తోటివారికి సహాయం చేస్తూ ఎంతో ప్రశాంతంగా జీవితం గడుపుతున్నారు. నా గురించి ఎవరి ద్వారానో తెలుసుకొని నన్ను కలవడానికి వచ్చారు. మొదటిసారి వచ్చినప్పుడు లౌకిక సంబంధమైన విషయాలు మాట్లాడారు. వారిని చూడగానే

నాకు వీరు ఆధ్యాత్మిక పరంగా ఎంతో ఉన్నత స్థితిలో ఉన్నారని తెలిసింది. కాసేపు సాధారణ విషయాలు, వారి జీవితం గురించి కొన్ని విశేషాలు మాట్లాడి వెళ్ళిపోయారు.

మళ్ళీ కొన్ని రోజుల తర్వాత ఒకరోజు ఫోన్ చేసి కొన్ని సందేహాలు ఉన్నాయని కాస్త మాట్లాడాలని ఉంది అని మా ఇంటికి వచ్చారు. వచ్చిన కాసేపటికి మళ్ళీ ఇదే మాట అన్నారు. నేను ఎంత ప్రయత్నించినా ఆధ్యాత్మిక మార్గంలో ముందుకు వెళ్ళలేక పోతున్నానండి. మా ఇంటి ప్రక్కన ఉండే కృష్ణారావు రోజుకు ఉదయం రెండు గంటలు, సాయంత్రం రెండు గంటలు ధ్యానం చేస్తాడు. మాకు ఎదురుగా ఉండే రామన్న పంతులు ఉదయం రెండు గంటలసేపు పూజ చేస్తారు. రెండు పూటలా సంధ్యావందనం చేస్తారు. వారు ఆధ్యాత్మిక పరంగా ఎంతో ముందుకు వెళుతున్నారు. కాని నేను మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడ లాగే ఉన్నాను. ఏదో నా ఉద్యోగం, ఉదయం అరగంట పూజ...అంతే తప్ప వేరే ఏమి చెయ్యలేక పోతున్నాను. కనీసం ఒక గంట అయిన ధ్యానంలో కూర్చోవాలంటే కుదరడం లేదు. ఇలా ఉంటే నాకు ఎన్ని జన్మలకు మోక్షం కలుగుతుంది. ఎప్పటికి ఈ జనన మరణ చక్రంలోపడి కొట్టుకు తిరగవలసిందేనా? కాస్త ఆధ్యాత్మిక మార్గంలో ఒక గంటసేపయిన ప్రశాంతంగా ధ్యానం చేసే విధానం, మెళకువలు దయచేసి నాకు బోధించండి అని అన్నారు.

అప్పుడు నేను సుబ్బారావుగారితో ఇలా అన్నాను చూడండి సుబ్బారావుగారు మీరు మీ ఆత్మయొక్క ఆధ్యాత్మిక పయనంలో చాలా ముందుకు వెళుతున్నారు. మీకు ఇంకో విషయం చెప్పనా! ఇందాక మీరు చెప్పిన వారిద్దరికంటే ఆధ్యాత్మికంగా ఆత్మ ప్రయాణంలో మీరే ముందు ఉన్నారు. నిజం చెప్పాలంటే మోక్షానికి వారిద్దరి కంటే మీరే ఎన్నో జన్మలు చాలా దగ్గరగా ఉన్నారు. అయితే ఈ విషయం మీ ఆత్మకి తెలుసు. కాని మీ మనస్సుకు తెలియదు అంటే మీ బుద్ధికి తెలియదు. మీ ఆత్మకు తాను ఎంత ఉన్నత స్థితిలో ఉన్నదో తన ఆధ్యాత్మిక ప్రయాణం ఎంత ముందుకు సాగుతోందో తెలుసు. కాని వీరు ఈ జన్మలో మీరు చేస్తున్న కర్మలనుబట్టి, మీ జీవన విధానంబట్టి, మీ ప్రస్తుత అనుభవాలబట్టి, అనుభూతులబట్టి మీ ఆత్మయొక్క ఆధ్యాత్మిక పయనాన్ని బేరీజు వెయ్యడానికి ప్రయత్నిస్తున్నారు. కాని ఈ విధానం సరికాదు.

మీరు చూసేవన్నీ అనుభవిస్తున్నవన్నీ ప్రస్తుత శరీరంలోని బుద్ధికి సంబంధించినవి. మీ ఆత్మకు సంబంధించినవి కాదు. మీ ఆత్మ ఇప్పటికి ఎంతో ఉన్నత మార్గంలో ముందుకు వెళుతోంది. మీ ధ్యానం, సాధన ఇంతకు ముందు జన్మలలో ఎంతో ఎక్కువగా చేసి మీరు ఈ స్థితులన్నీ దాటివచ్చారు. మీరు కొన్ని జన్మల క్రితమే రోజుకు ఒక గంట కాదు, కొన్ని రోజులు తరబడి ధ్యానంలో ఉండేవారంటే నమ్ముతారా! ఇదంతా మీ ఆత్మకి తెలుసు. ఎటొచ్చి మీ మనసుకే తెలియదు. దయచేసి ఇకముందు ఇలా ఆలోచించి బాధపడకండి. మీ ఆత్మ ఎంతో గొప్ప మార్గంలో పయనిస్తోందని గ్రహించండి. అని నేను సుబ్బారావు గారికి చెప్పాను. ఇది విన్న తర్వాత సుబ్బారావు గారి మనస్సు తేలికపడింది. సంతోషంగా ఇంటికి వెళ్ళిపోయారు. తర్వాత ఎప్పుడు ఈ విషయం నా వద్ద ప్రస్తావించలేదు.

మనలో చాలామంది మనుషులు ఇదే విధంగా ఆలోచిస్తుంటారు. మనందరం ఎప్పుడూ ఒక విషయం గుర్తుంచుకోవాలి మన ఆత్మ ఎంత ఉన్నత మార్గంలో ఉన్నది అనే విషయం మనం పుట్టిన మతంతో గాని, కులంతో గాని, ఉద్యోగంతో గాని, మనకు ప్రస్తుత జీవితంలో జరుగుతున్న అనుభవాల గురించి గాని, మన అనుభూతుల వలన గాని, మన ప్రవర్తన వలన గాని అస్సలు అంచనా వెయ్యలేము. మనం ఇంతకు ముందు జన్మల్లోనే ఆధ్యాత్మిక పరంగా ఎంతో ఉన్నత స్థాయిలో ఉండి ఉండవచ్చును. కొన్ని కర్మల ఫలితంగా ఈ జన్మలో మనం అత్యంత సాధారణ జీవితం గడుపుతూ ఉండవచ్చు. మన ప్రస్తుత జన్మ ఇలా అతి సాధారణంగా గడుస్తున్నప్పటికి, మనం కూడా అందరి వలనే అనేక ఆవేశకావేషాలకు లోనవుతున్నప్పటికి మన ఆత్మ మాత్రం ఇప్పటికి ఇంకా ఉన్నత మార్గంలో ఉంది. పూర్వజన్మలలో చేసిన కర్మఫలాలు అనుభవించడానికి ఈ జన్మలో ఇలా అత్యంత సాధారణ జీవితం గడుపుతున్నాము అని గ్రహించాలి.

నన్ను కలసిన చాలామంది ఇదే విధంగా ఆలోచించి అనవసరంగా బాధపడుతున్నారు. ఈ జన్మలో వారు పడుతున్న కష్టాలు, వారి మానసిక పరిస్థితి బట్టి వారు ఇలా ఆలోచిస్తున్నారు. కాని వారు సత్యం గ్రహించడం లేదు. కాబట్టి మీరెవరూ ఈ విధంగా అనవసరంగా ఆలోచించి, ఆత్మనూన్యతతో బాధపడవద్దు.

సాధారణ మానవులు సరే! నేను ఈ మధ్య ఈ విధంగా మధన పడుతున్న విశ్వేశ్వర శాస్త్రి ఒక గొప్ప పండితుడిని కలిసాను. వారు ఎన్నో శాస్త్రాలలో ఆరితేరినవారు, గొప్ప విద్వత్తు కలిగినవారు. వారు ఎన్నో వేద సభలలో పాల్గొనడమే కాదు, అధ్యక్షత వహించినవారు. ఎప్పుడూ సరళంగా మాట్లాడుతూ అందరి యెడల ఎంతో ప్రేమ అభిమానం కలిగి ఉంటారు. అటువంటి వారు కూడా ఏమీ సాధించలేక పోయానని బాధపడడం గ్రహించాను. వీరి ఆత్మ ఎంతో ఉన్నత పథంలో ఉంది. కాని ఈ శరీరంలోని మనస్సు మాత్రం ఆ విషయం గ్రహించలేక పోతున్నది. దాని వలనే వీరు ఇంత బాధపడుతున్నారు.

ఇక్కడ మనమందరం గమనించవలసిన అద్భుత విశేషం ఒకటి ఉన్నది. మనకి సహజంగానే అనుమానం రావచ్చు. ఇంతటి మహానుభావుడు ఏమిటి ? ఇలా బాధపడడం ఏమిటి ? విశేషం ఏమిటంటే వీరు ఎన్నో జన్మల నుంచి చాలా గొప్ప మార్గంలో ఉన్నారు. మోక్షానికి అతి దగ్గరలో ఉన్నారు. కాని వీరికి ఆ సంగతి తెలియకపోవడానికి క్రిందటి జన్మలో వీరికి జరిగిన ఒక సంఘటనే కారణం. వీరు ఆ జన్మలో గొప్ప సంగీత విద్వాంసులు. అంతకు ముందు జన్మలలోనే ఎన్నో శాస్త్రాలలో ఎంతో ప్రావీణ్యం సంపాదించారు. ఆ శాస్త్రాలన్నీ వీరి ఆత్మను గట్టిగా పట్టుకున్నాయి.

వీరికి సంగీతం మీద ఎంతో అభిమానం ఉండేది. అది నేర్చుకోవాలని ఆసక్తి ఎంతో ఉండేది. కాని ఇంతకు ముందు ఏ జన్మలోను సంగీతం నేర్చుకొనడం సాధ్యం కాలేదు. అయితే వారి ఆత్మను ఆ కోరిక గట్టిగా పట్టుకొనడం చేత భగవదనుగ్రహం వలన వీరికి క్రిందటి జన్మలో గొప్ప సంగీత జ్ఞానం లభించింది. అసలు పుట్టడమే గొప్ప సంగీత కారుల కుటుంబంలో జన్మించారు. ఆ పుట్టినప్పటినుంచి సంగీత వాతావరణంలో పెరగడం వలన, పూర్వజన్మ పుణ్యఫలం వలన, ఎన్నో జన్మల నుంచి వీరికి సంగీతం నేర్చుకోవాలని తపన ఉండడం వలన వారి ఆత్మ ఎంతో ఉన్నత మార్గంలో పయనిస్తున్నందువలన వారికి సంగీత జ్ఞానం అద్భుతంగా కలిగింది.

కొద్ది కాలంలోనే వీరు ఎంతో గొప్ప సంగీత విద్వాంసులు అయ్యారు. ఎన్నో సంగీత కచేరీలు చేసారు. చాలా గొప్ప సంగీత విద్వాసులుగా

పేరు తెచ్చుకున్నారు. ఆ విధంగా వారి ఆత్మకు సంగీతం కూడా నేర్చుకున్నాను అనే తృప్తి లభించింది. నేర్చుకోవడమే కాదు, సంగీతంలో ఎంతో మహా విద్వాంసుడుగా పేరు ప్రతిష్టలు సంపాదించారు.

ఒకసారి ఒక సంగీత సభ జరుగుతుంటే ఒక చిన్న పిల్లవాడు తానుకూడా ఆ సభలో పాల్గొంటానని, ఒక పాట పాడడానికి చిన్న అవకాశం ఇప్పించమని అడిగాడు. దానికి వీరు సరే అని ఆ పిల్లవాడిని ఒక పాట పాడమన్నారు. అతనికి ఇచ్చిన సమయం కేవలం ఐదు నిమషాలు అయితే ఆ పిల్లవాడు ఎంతో అద్భుతంగా పాడి అక్కడ ఉన్న విద్వాంసులందరిని మెప్పించాడు. వారందరు ఎంతో సంతోషపడి ఆ పిల్లవాడిని అపర గంధర్వుడిగా కీర్తించి మరొక పాట పాడమన్నారు. అది మన విశ్వేశ్వర శాస్త్రికి నచ్చలేదు. ఆ పిల్లవాడిపై కొంచెం ఈర్ష్య కలిగింది. అక్కడ ఉన్నవారందరు ఆ పిల్లవాడికి అంతగా పొగడడం వీరికి కొంచెం ఆగ్రహం తెప్పించింది. అయితే వీరు ఆ ఆగ్రహం బయటకి కనబడనీయలేదు.

ఆనాటి ఆ అసూయ కారణంగా విశ్వేశ్వర శాస్త్రి ఈ జన్మలో ఇంత గొప్ప పండితుడయినప్పటికి ఒక మాయకు లోనై తాను ఆధ్యాత్మికంగా ముందుకు ఎదగలేదని బాధపడుతున్నాడు. చూసారా? ఎప్పుడో ఒక జన్మలో కలిగిన చిన్న అసూయ ఆ మనిషికి మరో జన్మలో ఏ విధంగా ప్రభావం చూపగలదో ! ఆ ప్రభావం చేతనే విశ్వేశ్వర శాస్త్రి ఈ జన్మలో ఇంత గొప్ప పండితుడయినప్పటికి ఆనాటి అసూయ కారణంగా ఒక మాయకు లోనై ఆనందాన్ని కోల్పోతున్నాడు. తన ఆత్మ పయనం గురించి ఎంతో తక్కువగా ఊహించుకొని బాధపడుతున్నాడు. మన ప్రస్తుత జీవితంలో మనకు జరిగే కొన్ని అనుభవాలు ఇలా క్రిందటి జన్మలలో జరిగిన ఎన్నో సంఘటనల వలన ప్రభావితం అవుతాయి.

మీలో కొందరు ఎంతో నిజాయితీగా జీవిస్తున్నామని, ఎన్నో పూజలు, వ్రతాలు చేస్తున్నామని, ఎంతో నియమనిష్ఠలతో ఉంటున్నామని, ఎవ్వరికి హాని తలపెట్టలేదని అయినా కూడా మాకు ఇన్ని కష్టాలు ఎందుకు వచ్చాయి అని అనుకుంటారు. అంతే కాకుండా ఇంత మంచి మార్గంలో జీవిస్తున్నప్పటికి ఇన్ని కష్టాలు పడుతుండడం వలన క్రిందటి జన్మలలో ఎన్నో

పాపాలు చేసి ఉండవచ్చునని, ఇక తమ ఆత్మ ఉన్నత మార్గంలో ఎలా పయనిస్తుంది అని ఎంతో మధన పడుతుంటారు.

కాని మీరు ఎప్పుడూ అలా అనుకోవద్దు. ఇప్పుడే విశ్వేశ్వర శాస్త్రి గారి గురించి చదివారు కదా! మీరెంతో ఉన్నతులు. మీ ఆత్మ ఎంతో మంచి మార్గంలో ముందుకు పయనిస్తోంది. ఎటొచ్చి మీ బుద్ధికి ఈ విషయం తెలియడం లేదు. ఇది గ్రహించి మీరు ఆత్మనూన్యతతో బాధ పడకుండా సంతోషంగా ఉండండి.

13

మనం ప్రతీ చిన్న విషయానికి, చిన్న సంఘటనలకి చిన్న చిన్న వస్తువులు పోగొట్టుకున్నప్పుడు చిన్న మొత్తాలలో డబ్బు పోగొట్టుకున్న, చిన్న చిన్న విషయాలలో మన కుటుంబ సభ్యులతో ఏదైనా గొడవ పడిన ఎంతో కుమిలిపోతాము. అసలు ఇంత పెద్ద విశ్వంలో మన ఉనికి ఎంతటిది? ఆ సంఘటన జరిగిన కాలం ఎంత చిన్నది? అంత చిన్న సంఘటన మనలని ఇంతగా ప్రభావితం చెయ్యాలా? ఒకరోజు జరిగిన చిన్న సంఘటన మనలని రోజుల తరబడి బాధపెట్టాలా? ఒకసారి ఆలోచించండి ఇది ఎంత సమంజసమో? ఆ చిన్న సంఘటన వలన కొన్ని రోజులపాటు మీ ప్రశాంతత కోల్పోవటం లేక ఒక వ్యక్తితో ఎంతో విరోధం తెచ్చుకోవడం ఏమైనా భావ్యమా?.

ఒకసారి మీరు మీ ఇంట్లోంచి బయటకు వచ్చి రోడ్డు మీదకు వెళ్ళి అటుపక్కగా నుంచొని మీకు కనబడే విషయాలన్నీ ఒక్కసారి గమనించండి. వీరు అక్కడ నుంచున్న ఒక అరగంటలో ఒక యాభై మంది వ్యక్తులు అటు ఇటు తిరిగిఉంటారు. ఒకరు సైకిల్ మీద వెళ్ళారు. మరొకరు స్కూటర్ మీద వెళ్ళారు. మరొకాయన కారులో వెళ్ళారు. మరొకరు గవర్నమెంటు బస్సులో వెళ్ళారు.

అలాగే వీరిలో ఒకరు మాసిన బట్టలు వేసుకున్నారు. మరొకరు చక్కటి ఇస్త్రీ బట్టలు వేసుకున్నారు. ఒకరు ఏదో ఆలోచిస్తూ నడుస్తున్నారు. మరొకరు ఎంతో దిగాలుగా నడుస్తున్నారు. ఇప్పుడే మీ కంటి ఎదురుగా ఒకాయన ఎంతో హుషారుగా కారులో వెళ్తున్నారు. మరొకరు ఎంతో ఆందోళనతో మనస్సు ఏ మాత్రం ప్రశాంతత లేనట్టు కారు నడుపుతున్నారు. ఇవన్నీ కేవలం ఒక అరగంటలో మీరు గమనించిన విశేషాలు. ఒక్క అరగంట మీరు ఇంటి బయటకు వస్తే మీకు ఇన్ని రకాల వ్యక్తులు కనబడ్డారు. వీరెవరితోనూ మీకు పరిచయంలేదు.

ఒకొక్కళ్ళది ఒక్కో జీవితం. సైకిల్ మీద వెళ్తున్న అతనికి భార్య చనిపోయింది. అతను ఆఫీసునుంచి త్వరగా ఇంటికి వెళ్ళి పిల్లలకు వంట వండి పెట్టాలి. ఈ పిల్లలను పెంచి పెద్ద చెయ్యాలి అతడి మనసులో ఇదే ఆలోచన. బస్సులో కూర్చున్న వ్యక్తికి ఈ మధ్యనే ఉద్యోగం పోయింది నాలుగు నెలలుగా ఇల్లు గడవడం కష్టంగా ఉంది. బోలెడన్ని అప్పులు ఉన్నాయి. మళ్ళీ క్రొత్త ఉద్యోగం ఎప్పుడు వస్తుందా అని బెంగ. అతడి మనసులో ఇదే ఆలోచన.

కారులో వెళ్తున్న ఆయనకి క్రితం సంవత్సరం కూతురి వివాహం అయింది. దురదృష్టవశాత్తు వివాహం అయిన ఆరునెలలకే భార్యా భర్తల ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చి విడిపోయారు. తన కూతురి పరిస్థితి ఏమిటా అని ఆలోచిస్తున్నాడు. అలాగే మరో కారులో వెళ్తున్న ఆయన ఆసుపత్రిలో అనారోగ్యంతో ఉన్న తన భార్య వద్దకు వెళ్తున్నాడు. మీ ఎదుట ఇప్పుడే వడి వడిగా చేతిలో కూరల సంచి పట్టుకొని నడిచి వెళ్తున్న వ్యక్తి కూతురుకి నిన్ననే వివాహం నిశ్చయం అయింది. ఎంతో ఆనందంతో ఇంటికి పనులు చూసుకొని వెళ్తున్నాడు.

ఇదంతా కేవలం అరగంటలోనే! చూసారా! ఎన్ని రకాల జీవితాలో! వీరి జీవితాలలో ఎంత వైవిధ్యం ఉందో గమనించారా. ఒకరి జీవితానికి మరొకరి జీవితానికి ఏమాత్రం పోలిక లేదు. మీరు ఇందాకటి నుంచి మీకు కలిగిన చిన్న సమస్య గురించి ఇంత ఆలోచిస్తున్నారు. ఒకటే బాధపడుతున్నారు. మీ మనస్సు ఏమాత్రం ప్రశాంతంగా లేదు. క్రిందటి రాత్రి మీరు హాయిగా నిద్రపోలేదు. ఈ ఆలోచనతో రాత్రంతా లేస్తూనే ఉన్నారు.

మీరున్న ఈ ఊరిలో మీరు నివసిస్తున్న ఈ కాలనీ ఎంత చిన్నది? మీరున్న పట్టణంలో నివసిస్తున్న జనాభాలో ఈ యాభై మంది ఎంత చిన్న సంఖ్య? కోటి మందికి పైగా ఉన్న ఈ పట్టణంలో కేవలం యాభై మందిని మాత్రం మీరు గమనించారు. ఇలా కొన్ని వందలకోట్ల మంది ప్రపంచ వ్యాప్తంగా ఈ క్షణంలో ఏదో పని చేస్తూ ఉంటారు. ఎవరి జీవితాలు వారివి. ఎవరి కష్టాలు వారివి. ఎవరి సమస్యలు వారివి. ఎవరి సుఖాలు వారివి. ఈ అరగంటలో నీ ఎదురుగా వెళ్ళిన ఈ యాభై మందిలో ఎవరికైనా నీ గురించి గాని నీ కష్టాలు గురించి గాని పట్టిందా. అటువంటిది ఈ పట్టణంలో ఉన్న కోట్ల మంది గురించి నీకు వేరే చెప్పాలా?.

అసలు ఆ రోడ్డు ప్రక్కన నువ్వు నుంచున్న అరగంట ఒక్కరోజులో ఎన్నో వంతు? మీరు ఒక 70 సంవత్సరాలు జీవించి ఉండేటట్లు అయితే ఈ అరగంట సమయం దాని ముందు ఎన్నో వంతు? ఎంత చిన్నది? మానవ జీవితం అతి స్వల్పం. ఈ విశ్వంతో పోల్చుకుంటే ఒక కనురెప్ప పాటు సమయంలో కోటవ వంతు కంటే చిన్నది. అంత చిన్న జీవితం కోసం ఇంత తాపత్రయ పడాలా? ఆలోచించండి.

అందుకే మీరు బ్రతికినంతకాలం సుఖంగా జీవించండి. చిన్న చిన్న విషయాలలో ఆనందం గమనించండి. ఆనందం ఆస్వాదించండి. ఒక పూట ఒక కప్పు కాఫీ త్రాగితే ఎంత ఆనందం కలుగుతుంది. ఒక పూట మీకు ఇష్టమైన అల్పాహారం తింటే మీ మనస్సుకు ఎంత ఆనందం కలుగుతుంది. ఇటువంటి చిన్న చిన్న సంతోషాలను మీ నుంచి ఎవ్వరూ దొంగలించలేరు కదా! ఈ జీవితం అత్యంత స్వల్పం అని గ్రహించి ప్రతి క్షణం సంతోషంగా ఉండడానికి ప్రయత్నించండి.

మీ అక్క మీద మీకు కోపం వస్తే ఒక్క విషయం గుర్తు తెచ్చుకోండి. మీరు ఇప్పటిదాకా కొన్ని కోట్ల జన్మలలో జన్మించారు. ఎందరో కోట్లాది బంధువులు! ఏ జన్మలో ఎవరు తండ్రో, ఎవరు తాతో! ఎవరు కొడుకో, ఎవరు కూతురో! ఇలా కోట్లాది జన్మల్లో ఈ ఒక్క జన్మలో మీకు అక్కగా జన్మించిన ఈ అమ్మాయి మీద ఇంత చిన్న విషయానికి ఇంత కోపం తెచ్చుకోవచ్చా ఆలోచించండి. ఇలా కోపం తెచ్చుకొని మనస్సు పాడుచేసుకొని మీ అక్క

మనస్సును కూడా బాధ పెట్టడం, అదికూడా రోజుల తరబడి బాధపెట్టడం ఏ మాత్రం సమంజసం కాదు. ఈ జన్మ తరువాత మీరెవరో తనెవరో ఎవరు ఎక్కడ ఎప్పుడు ఎలా జన్మిస్తారో ఆ భగవంతుడికే ఎరుక.

ఇలా మీ అక్క మీదనే కాదు మీకు తెలిసిన ఏ వ్యక్తిమీద కోపం వచ్చినా ఇలాగే ఆలోచించండి. మీ కోట్లాది జన్మలలో ఒక్క జన్మలో అదీ ఒక్క చిన్న విషయంలో కోపం తెచ్చుకోవడం ఎంత సమంజసం? ఈ విషయం మీరు ఒకసారి ఆలోచించి ఈ సారి ఎవరిమీదైనా కోపం వచ్చినప్పుడు ఇది గుర్తు తెచ్చుకొని మిమ్మల్ని మీరు నిగ్రహించకోండి. దీని వలన మీకు, అవతలి వ్యక్తికి ఎంత హాయిగా ఉంటుందో గ్రహించండి.

14

ఇలా ఉండగా 2018 వ సం॥లో తిరుమల విశేషాలతో నేను శ్రీవారి దర్శన్ అనే ఇంగ్లీష్ పుస్తకాన్ని వ్రాసాను. ఇన్ని సంవత్సరాలుగా నాకు ఎంతో ఆప్తులైన కొందరు స్నేహితులకు బహుమానంగా ఇద్దామని తిరుమల కొండల విశిష్టతను, శ్రీవేంకటేశ్వర స్వామి వారికి సంబంధించిన అనేక విశేషాలతో పూర్తి ఫొటోలతో ఇంగ్లీష్‌లో ఈ శ్రీవారి దర్శనం పుస్తకం వ్రాసాను. ఆ స్వామివారి అపారమైన దయవలన ఈ పుస్తకం ప్రపంచంలోని అనేక దేశాలలోని ప్రముఖ యూనివర్శిటీల లైబ్రరీలలో ఉంచబడింది. అమెరికాలోని హార్వర్డ్, స్టాంఫర్డ్, కార్నెల్, వాషింగ్‌టన్, కొలంబియా, చికాగో లైబ్రరీలలోను, బ్రిటన్‌లోను ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్ యూనివర్శిటీ లైబ్రరీలలోను, బ్రిటీష్ లైబ్రరీ, లండన్ లోను, డెన్మార్క్‌లోని రాయల్ డేనిష్ లైబ్రరీలోను, జర్మనీలోని హైడెల్‌బర్గ్ యూనివర్శిటీలోను, ఫిలిప్పైన్స్ లోని ఫిలిప్పైన్స్ యూనివర్శిటీలోను ఇంకా అనేక ప్రముఖ యూనివర్శిటీలలోను ఈ శ్రీవారి దర్శన్ పుస్తకం ఉంచడం జరిగింది. ఇదంతా శ్రీనివాసుని దయ తప్ప మరొకటి కాదు.

ఇలా ఈ పుస్తకం వెళ్ళిన యూనివర్సిటీలలోని కొందరు ప్రొఫెసర్లు ఈ పుస్తకం చదివి ఎంతో సంతోషపడుతూ నాకు ఈ మెయిల్స్ ఇచ్చారు. ఇప్పటికి అప్పుడప్పుడు వీరిలో కొందరు నాతో ఈమెయిల్‌లో మాట్లాడుతున్నారు. అయితే వీరందరిలో హార్వర్డ్ లైబ్రరియన్ నాకెంతో దగ్గరయ్యాడు. ఇంకో విశేషమేమిటంటే హార్వర్డ్ వారికి నా పుస్తకాలు గురించి తెలిసి నేను వ్రాసిన 15 తెలుగు పుస్తకాలు వారు లైబ్రరీలో ఉంచారు. ఒకే రచయిత వ్రాసిన 15 తెలుగు పుస్తకాలు హార్వర్డ్ లైబ్రరీలో ఉంచడం ఇదే ప్రథమం. ఇదంతా ఆ శ్రీవేంకటేశ్వర స్వామి వారి అనుగ్రహం తప్ప మరొకటి కాదు.

హార్వర్డ్ యూనివర్శిటీలో కొందరు ప్రముఖ ప్రొఫెసర్‌లు ఇప్పటికే నాతో మాట్లాడుతూ ఉంటారు. ఎన్నో జన్మల బంధం వలన వారు ఎంతో ఆప్యాయతతో మాట్లాడుతూ ఉంటారు. ఎన్నో విషయాల మీద ఈ మెయిల్‌లో సంప్రదిస్తుంటారు. ఎప్పుడు ఇండియా వచ్చి తిరుమల దర్శిస్తామా అని ఎంతో కోరికతో ఉంటారు. ఇదంతా వీరికి భారతదేశంతో పూర్వజన్మలలో గల బంధమే కారణం. పూర్వజన్మ బంధాలు, వాసనలు ఎంతో గాఢంగాను, ఎంతో ఆశ్చర్యకరంగాను ఉంటాయి.

15

ఈ ప్రపంచంలో ఇప్పటిదాకా ఎన్నో లక్షల కోట్ల మంది జన్మించి మరణించారు. వారందరు కూడా వారి జీవిత కాలంలో ఎన్నో రకాల అనారోగ్యాలు అనుభవించి ఉంటారు కదా ! మనం కూడా క్రిందటి జన్మలో ఏ అనారోగ్యానికి గురయ్యామో ఇప్పుడు మనకి తెలియదు కదా ! ఆ మధ్య నాదగ్గరకి చంద్రశేఖర్ అనే స్నేహితుడొచ్చాడు. అతడు తనకు షుగర్, బి.పి. ఉన్నాయని ఎంతో బాధపడుతున్నాడు. ఇంక ఈ ప్రపంచమంతా తన తలపై పడుతున్నట్లు బాధపడుతున్నాడు. ఈ ప్రపంచంలో ఎందరికో ఈ బి.పి. షుగర్‌లు ఉన్నాయని ఇవి అతి సామాన్యం అని అందుకు అంత ఆందోళన పడనక్కర్లేదని నేను చెప్పేవాడిని. అయినా అతను వినేవాడు కాదు.

ఇలా ఉండగా ఒకరోజు అతను నా దగ్గరకి వచ్చినప్పుడు ఒక పది నిమిషాలు ధ్యానంలోకి వెళ్ళాను. అప్పుడు అతడి పూర్వజన్మలు కొన్ని గోచరించాయి. అతనితో ఇలా చెప్పాను. చంద్రశేఖర్ నీవు రెండు జన్మల క్రితం ఔరంగాబాద్‌లో జన్మించావు. అప్పుడు నువ్వు పన్నెండు సంవత్సరాలు పాటు క్యాన్సర్‌తో బాధపడి మరణించావు. ఆ పన్నెండు సంవత్సరాలు నరకయాతన అనుభవించావు. క్రిందటి జన్మలో నీవు విజయవాడ దగ్గర కంకిపాడు గ్రామంలో

సుబ్బారావు అనే పేరుతో ఒక వ్యవసాయ కుటుంబంలో జన్మించావు. అప్పుడు కూడా నీ పూర్వజన్మ కర్మఫలం వలన 14 సం॥లు పక్షవాతం వచ్చి మంచంమీదనే ఉన్నావు. ఈ రెండు జన్మలలోను నువ్వు ఇంతకు మునుపు 20 జన్మల క్రితం కొన్ని జన్మలలో చేసిన పాపకార్యాల వలననే ఈ విధంగా అనారోగ్యం పాలయ్యావు. అటు తరువాత కొన్ని జన్మలలో చేసుకున్న పుణ్యఫలం వలన ప్రస్తుత జన్మలో నీకు అటువంటి తీవ్ర వ్యాధులు రాక నీ ప్రారబ్ధ కర్మ కొంచెం తగ్గి ఈ మాత్రం షుగర్,బి.పి.ల వంటి తేలికపాటి అనారోగ్య సమస్యలతో ఉన్నావు.

నువ్వు ఒక్కసారి ఆలోచించు. ఆ జన్మలలో నువ్వు ఎంత బాధపడి ఉంటావో ఇప్పటి నీ బాధ ఎంత ? అప్పటి బాధతో పోలిస్తే ఇప్పటిది ఒక బాధేనా అని అతడితో గట్టిగా చెప్పాను. అప్పుడు అతనికి కొంచెం అర్థమయ్యింది. ఒక అరగంట నా ఎదురుగా కూర్చొని ఏమీ మాట్లాడలేదు. ఎందుకు అలా మౌనంగా ఉన్నావు అని అడిగితే ఒక్కసారి ఆ క్రిందటి రెండు జన్మలలో తాను ఎంత బాధపడి ఉంటానో తల్చుకున్నానని అన్నాడు. ఆ ఊహే ఎంతో తీవ్రమైన బాధ కలిగించిందని అన్నాడు. ఇంక అటు తరువాత చంద్రశేఖర్ ఎప్పుడూ తన షుగర్, బి.పి. ల గురించి మాట్లాడలేదు.

ఇందాక చెప్పినట్లుగా అనారోగ్యం సద్గురువుల దర్శనం వలన, ఎంతో గొప్ప శక్తి గల పుణ్యక్షేత్రాలు దర్శించడం వలన తప్పక తగ్గుతుంది. సద్గురువులు మన కష్టం, మనం పడుతున్న బాధ గ్రహించి మన అనారోగ్య తీవ్రత కొంచెం తగ్గిస్తారు. అక్కడితో మనకి బాధ తగ్గి ఎంతో ఉపశమనం కలుగుతుంది. ఎంతటి వారికైనా ప్రారబ్ధ కర్మ అనుభవించక తప్పదు. మానవ జన్మ ఎత్తిన మహాయోగులు కూడా తమ చివరి దశలో ఎన్నో బాధలు పడడం మనం చూసాము. అంతటి శక్తి గలవారు తాము కావాలనుకుంటే ఆ బాధను తగ్గించుకోలేకనా? లేక పూర్తిగా పోగొట్టుకొనలేకనా? కాని వారు అలాచేయక శరీరానికి కలిగి ఆ బాధను చిరునవ్వుతో సీక్వరిస్తారు. అయితే విశేషమేమిటంటే అటువంటి మహాత్ములు ఎంత బాధపడుతున్నప్పటికి వారి వద్దకు ఎంతో అనారోగ్యంతో వచ్చిన వారికి తమ శక్తితో ఉపశమనం కలిగేలా చేస్తారు. మహాత్ములు ఇది ఎన్నో రకాలుగా చేస్తారు.

16

తిరుమల శ్రీనివాసుని ఆలయంలోని శ్రీస్వామి వారి విగ్రహం ఎన్నో కోట్ల సంవత్సరాల నాటిది. తిరుమల క్షేత్రానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. సాక్ష్యాత్తు శ్రీమన్నారాయణుడే కొన్ని కోట్ల సంవత్సరాల క్రితం ఇక్కడ తిరుమలపై తానే స్వయంగా శిలారూపంలో ఆవిర్భవించాడని మన విశ్వాసం. ప్రతీ రోజు ప్రపంచంలోని ఎన్నో ప్రదేశాలనుంచి లక్షలాది భక్తులు ఎన్నో కష్టాలకోర్చి తిరుమల చేరి శ్రీస్వామి వారిని దర్శించుకొంటున్నారు. కాని అక్కడ వారికి దొరికేది కేవలం అరసెకను దర్శనమే. ఆమాత్రం దానికే ఎంతో సంతృప్తి చెంది ఎంతో ఆనందపడి తిరిగి వెళతారు. దర్శనం జరిగి బయటకు రాగానే తాము పడిన శ్రమంతా మరచిపోతారు. మళ్ళీ తిరిగి తిరుమల ఎప్పుడు వస్తామా? అని ఆలోచించడం మొదలు పెడతారు. అక్కడ ఉన్న శ్రీ స్వామి వారి శక్తి అంతటి మహత్తరమైనది. అయితే అక్కడ అంత శక్తి ఎలా ఉంది ? అసలు ఏ శక్తి మనల్ని అంతగా ఆకర్షిస్తోంది. ఏ శక్తి ప్రపంచం నలుమూలలనుండి భక్తులను తన దగ్గరకు ఆకర్షిస్తోంది. ఇవన్నీ తెలుసుకుంటే ఈసారి మనం తిరుమల వెళ్ళినప్పుడు దివ్య అనుభూతికి లోనవుతాము.

ఈ విశ్వంలో అక్కడక్కడ ఎంతో శక్తివంతమైన ప్రదేశాలు ఉంటాయి. అక్కడ కొన్ని దివ్య తరంగాలు ఎప్పుడూ ప్రసరిస్తూ ఉంటాయి.

అటువంటి శక్తి గల ప్రదేశాలలో నెలకొల్పబడే ఆలయాలు, అక్కడ ఉండే దేవతలు ఎంతో మహిమాన్వితంగా ప్రసిద్ధి పొందుతాయి. తిరుమల, శ్రీరంగం, మధుర, కంచి, కాశీ, హరిద్వార్, కేధార్‌నాథ్, బదరీనాథ్, కాశ్మీర్‌లోని వైష్ణోదేవి, నేపాల్ లోని పశుపతినాథ దేవాలయం ఇటువంటి దేవాలయాలు ఉన్న ప్రదేశాలు ఈ భూమండలంపై ఎంతో శక్తి ఉన్న ప్రదేశాలు.

ఉదాహరణకు తిరుమల గురించి ఆలోచిస్తే తిరుమల ఆనంద నిలయంలో మనం శ్రీమహావిష్ణువు రూపంలో కొలుస్తున్న అక్కడ ఉన్న దేవత నిజం చెప్పాలంటే ఈ సృష్టి మొత్తానికి మూలకారణమైన దివ్యశక్తియే ! సామాన్య మానవులు ఏరూపం లేని ఆ దివ్యశక్తిని ఊహించుకొని అర్చించలేరు కాబట్టి ఆ మహాశక్తియే తిరుమలలో శ్రీవేంకటేశ్వరుని గాను, కాశీలో పరమేశ్వరుని గాను, కంచిలో కామాక్షిగాను, బృందావనంలో శ్రీకృష్ణునిగాను, కాశ్మీర్‌లో శ్రీవైష్ణోదేవి గాను, శ్రీలంకలో శాంకరీ దేవి గాను మనకు దర్శనమిస్తున్నారు. కానీ మనం దీర్ఘంగా ఆలోచిస్తే ఈ క్షేత్రాలన్నింటిలో ఉన్నది ఒకే ఒక మహాశక్తియే. ఆ శక్తియే అనేక చోట్ల అనేక రూపాలు ధరించి భక్తులను అలరిస్తున్నది. ఇంతకు ముందు చెప్పినట్లుగా సామాన్య మానవులకు వీలైన అర్చారూపంలో ఈ దేవతలందరు మనకు సామాన్య నేత్రాలకు కనిపిస్తున్నారు. ఈ క్షేత్రాలలో సాధకులు ధ్యానంలోకి వెళ్ళినప్పుడు అక్కడ ఉన్న దివ్య తరంగాలను అనుభవించి అక్కడ ఉన్న దేవత కేవలం ఏ మహావిష్ణువో, ఏ మహేశ్వరుడో కాక ఈ విశ్వం మొత్తానికి కారణభూతమైన దివ్యశక్తిగా గ్రహిస్తారు.

పూర్వకాలంలో అనేక మంది యోగులు మహర్షులు ఈ క్షేత్రాలను ఇలాగే దర్శించారు. ఈ కేత్రాలలోని అనంతశక్తిని వారు గ్రహించగలిగారు. ఈ పుణ్యక్షేత్రాలలో ఇంతటి శక్తి ఉన్నది కాబట్టే మనం ఈ క్షేత్రాలకు వెళ్ళినప్పుడు మన మనస్సు ఎంతో ప్రశాంతంగా ఉంటుంది. మన మనస్సులలో మాటల్లో వర్ణించలేని దివ్యానుభూతులు కలుగుతాయి. తిరుమల కూడా అటువంటి ఒక అద్భుతమైన శక్తిగల ప్రదేశమైంది. ఈ కొండలపై శ్రీవారి ఆలయం ఉన్న పరిసర ప్రాంతాలలో నేరుగా గ్రహమండలం దాటి ఈ సృష్టిమొత్తానికి ఆధారభూతమైన దివ్యశక్తి తరంగాలు ఈ ప్రాంతంలో నిత్యం ప్రసరిస్తుంటాయి.

మనం శ్రీమహావిష్ణువుగా కొలుస్తున్నప్పటికి ఇప్పటికి చాలా మంది దేవతలు, సిద్ధులు, యోగులు, మహాపురుషులు అదృశ్యరూపాలలో తిరుమలకు వచ్చి ఆ మహాశక్తిని దర్శించుకొని వెళుతుంటారు. అక్కడ ఉన్న మూర్తి కేవలం శ్రీమహావిష్ణువుగా మాత్రమే వారు భావించరు. ఈ సృష్టి మొత్తానికి కారణభూతమైన ఆ దివ్యశక్తిగా గ్రహించి ఆరాధిస్తారు. సామాన్య మానవులైన మనం మాత్రం అక్కడ ఉన్నది శ్రీమన్నారాయణులవారిలాగా మనం తలుస్తాము. మనం అంతటి ఉన్నత స్థాయికి వెళ్ళి ఆలోచించలేము కాబట్టి శ్రీమన్నారాయణుని రూపంగా అక్కడ ఉన్న మూర్తిని కొలుస్తున్నాము.

అక్కడ అంతటి మహాశక్తి ఉన్నది కాబట్టే తిరుమల క్షేత్రం అంతా నిత్యం దివ్యతరంగాలతో నిండి ఉంటుంది. అందుకే మనం ఆ కొండ ఎక్కుతున్నంతసేపు ఎటువంటి శ్రమ తెలియదు. ఆ దివ్యతరంగాలు మన శరీరం గుండా ప్రసరిస్తూ ఉంటే మన శరీరాలు ఎంతో శక్తివంతమౌతాయి. మనస్సు ఎంతో హాయిగా ఉంటుంది. ఇప్పటికీ నాతో కొంతమంది అక్కడకు వెళ్ళినప్పుడు తిరుమల ఆలయంలో ఉన్న దైవం తమకు శివునిగా దర్శనమిచ్చాడని చెబుతారు. తమిళనాడుకు చెందిన కొందరు భక్తులు ఇప్పటకీ అక్కడ ఆలయంలో ఉన్నది శ్రీసుబ్రహ్మణ్య స్వామిగా కొలుస్తారు. ఇలా ఎందరో భక్తులు శ్రీస్వామివారిని అనేక దేవతా రూపాలలో దర్శించుకుంటారు.

తిరుమలకు నేను వెళ్ళినప్పుడల్లా అక్కడ ఎన్నో అద్భుతాలు గమనించాను. ఒకసారి ఆలయంలోనికి వెళ్తున్నప్పుడు ఆలయ ధ్వజస్థంభం దగ్గర బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ముగ్గురు దర్శమిచ్చారు. అక్కడే దివ్యశరీరాలతో నుంచొని ఉన్నారు. మరొకసారి తెల్లవారుఝామునే దర్శనానికి వెళ్ళినప్పుడు మేము వెండి వాకిలి దాటగానే అక్కడ శ్రీసరస్వతి, శ్రీమహాలక్ష్మి, శ్రీపార్వతీదేవి కనిపించారు. మరొకసారి తిరుమల వెళ్ళినపుడు నేను కాసేపు నారాయణగిరి శ్రీవారి పాదాల దారిలో ఉండి అడవిలో కాసేపు ధ్యానంలో కూర్చొని ఉన్నప్పుడు అక్కడ ప్రక్కనే హనుమంతులవారు దర్శనమిచ్చారు. హనుమంతులవారు తిరుమల కొండలలో నేటికి దివ్యరూపంలో సంచరిస్తూంటారు.

17

పూర్వజన్మల బంధాలు ఎంత విశేషంగా ఉంటాయో అని తెలియడానికి మరొక్క అద్భుత సంఘటన...అది 1987 సం॥ అప్పుడు నేను ఆల్విన్ కంపెనీలో ఇంజనీర్ గా ఉద్యోగం చేస్తూండేవాన్ని. హాబీగా ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో మొదటిపేజీలో కార్టూన్ కాలమ్ వేసేవాణ్ని. అప్పటికింకా టి.వి. రాకపోవడంతో అందరూ పేపర్లు ఉత్సాహంగా చదువుతూండేవారు. అందున పేపరు వచ్చిందంటే ముందుగా మొదటి పేజీలో క్రింద ఉన్న కార్టూన్ చూసేవారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ రామ్‌నాథ్ గోయంకా ఆధ్వర్యంలో అరుణ్ శౌరీ చీఫ్ ఎడిటర్‌గా ఎంతో దూసుకుపోతున్న రోజులవి. ఒకరోజు నాకు పంటి నొప్పి వస్తే ఆ రోజుల్లో ప్రముఖ దంత వైద్యుడు అయిన డాక్టర్ రామ్మూర్తి గారి వద్దకు వెళ్ళాను. వెయిటింగ్ రూంలో కూర్చొని ఉన్నాను. ఇంతలో ఒక పెద్దాయన వచ్చి నా ప్రక్కన ఉన్న గాద్రేజ్ కుర్చీలో కూర్చొని ఉన్నారు. ఆరోజుల్లో అన్ని చోట్ల అవే కదా ! గాద్రేజ్ కుర్చీలే ఉండేవి కదా !

నా ప్రక్కన కూర్చున్న వారు వయసులో పెద్దవారు కాని పర్సనాలిటీలో చిన్నగా ఉన్నారు. పేషెంట్స్ ఎక్కువ మంది ఉండటంతో ఆ రోజు

మా వంతు వచ్చేసరికి ఆలస్యమయ్యేలా ఉంది. ప్రక్కన కూర్చున్న ఆయన ఎంతకి మాట్లాడడం లేదు. అప్పుడప్పుడు నా వంక చూసి చిరునవ్వు నవ్వుతున్నారు. ఇంక ఉండబట్టలేక నన్ను నేను పరిచయం చేసుకొని మీరు ఏమిచేస్తుంటారు అని అడిగాను. అందుకు ఆయన మళ్ళీ చిరునవ్వుతో నాపేరు వి.కె.రావు అండీ! నేను ఐ.సి.యస్. రిటైర్ అయ్యాను అన్నారు. అమ్మో మీరు ఐ.సి.యస్సా? ఎంత సౌమ్యంగా ఉన్నారో అనుకున్నాను. కాస్త నా గొప్ప చెప్పుకుందామనుకొని నా పేరు తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి అండీ! ఆర్.ఇ.సి. వరంగల్ లో యం.టెక్. చదివి ఆల్విన్ లో ఉద్యోగం చేస్తున్నానండి అని చెప్పాను. ఇంజనీరా అదీ ఆర్.ఇ.సి.లో చదివారా అని సంతోషంగా అన్నారు. నేను మరో రెండు అడుగులు ముందుకు వేసి మా అమ్మగారు వాళ్ళు భోగరాజు వారు అండీ! నా భార్య వాళ్ళది తెనాలి, వాళ్ళ ఇంటిపేరు వల్లూరు అని అన్నాను. అప్పుడు ఆయన అలాగా! నా ఇంటిపేరు కూడా వల్లూరే! నా పూర్తిపేరు వల్లూరు కామేశ్వరరావు అని అన్నారు. అప్పుడు నేను ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో ఫ్రంట్‌పేజ్ కార్టూన్స్ వేస్తుంటానని వారికి చెప్పాను. ఆయన ఎంతో సంతోషపడి అలాగా! రోజు మీ కార్టూన్ చూస్తూంటాను. ఎంతో బాగుంటాయి నాకు మీ కార్టూన్స్ ఎంతో ఇష్టం అని అన్నారు. ఇంతలో ఆయనకు డాక్టర్ దగ్గర నుంచి పిలుపు రావడంతో లోపలకి వెళ్ళారు.

ఇది జరిగి 31 సం॥లు అయింది... నేను మళ్ళీ ఆయన్ని ఎప్పుడూ కలవలేదు. కొన్నాళ్ళక్రితం మురళికృష్ణ గారు అనే ఒకాయన ఫోన్ చేసి నా పుస్తకాల కోసం వస్తాను అని అన్నారు. అలాగే రమ్మన్నాను. ఆ మర్నాడు ఉదయాన్నే వచ్చారు. వచ్చి నాతో ఇలా అన్నారు. సార్ ! మీరు ఎవరో నిన్నటిదాకా నాకు తెలియదు. నాకు పుస్తకాలు ఎంతో ఇష్టం. ప్రతి ఆదివారం అబిడ్స్‌లో పాత పుస్తకాలు కొంటూ ఉంటాను. నిన్న బైక్ మీద లక్డికపూల్ మీదుగా వెళ్తుంటే రోడ్డు ప్రక్కన పాత పుస్తకాలు పెట్టి అమ్ముతుండడం చూసాను. ఇక్కడ ఎప్పుడూ చూడలేదే అని అనుకొంటూ బైక్ వెనక్కి తీసుకు వచ్చి ఆ పుస్తకాలు చూసాను. ఏవీ పెద్ద గొప్పగా అనిపించలేదు. తిరిగి బైక్ ఎక్కబోతుండగా వెనకాల గోడకు ఆనించి ఉన్న మధుర పథం అనే పుస్తకం కనబడింది. ఆ పుస్తకం నన్ను ఎంతో ఆకర్షించింది. దాని వెనుక రూ. 125/- అనే స్టిక్కరు ఉన్నది. ఆ పుస్తకం వెంటనే కొనుక్కొని అక్కడినుంచి బయలుదేరాను.

ఇంటికి వచ్చి పుస్తకం తెరవగానే మొదటి పేజీలో రచయిత పెన్నుతో వ్రాసిన ' శ్రీలక్ష్మీశ్రీనివాస కటాక్ష సిద్ధిరస్తు! ' అని కనిపించింది. ఎవరికో మీరు ఆప్యాయంగా వ్రాసి ఇచ్చారన్నమాట ! నా అదృష్టం కొద్ది నాకు దొరికింది! అలా ఆ పుస్తకం చదవగానే మీ గురించి ఎన్నో విశేషాలు తెలిసాయి. మీరు వ్రాసిన పుస్తకాలు గురించి తెలిసింది. ఇది నా పూర్వజన్మ పుణ్యఫలం. దయచేసి మీ పుస్తకాలు ఇస్తారా అని అన్నారు. తప్పకుండా మురళీకృష్ణ గారు అని నా పుస్తకాలు అన్నీ ఇచ్చాను. కళ్ళకద్దుకొని తీసుకున్నారు. అప్పుడు ఆయన మీరు ఒకసారి మా ఇంటికి వస్తే సంతోషిస్తానండి అని అన్నారు.

నన్ను ఎందరో వాళ్ళ ఇళ్లకి రమ్మని ఎంతో ఆప్యాయంగా పిలుస్తుంటారు. కానీ నాకు బయటకి వెళ్ళడం ఇష్టం ఉండదు. ఇన్ని సంవత్సరాలుగా నా వద్దకు వచ్చి సన్నిహితులైన ఎందరో ఎంతో అభిమానంతో వాళ్ళ ఇళ్ళకి ఒకసారైనా రమ్మని ఎంతో ఆప్యాయంగా అడుగుతారు. కానీ నాకు ఎందుకో ఈ వ్యక్తి ఆరాధన అంత ఇష్టం ఉండదు. గడచిన 15 సం॥లలో నేను బహుశా 5 లేక 6 గురి ఇళ్ళకు మాత్రమే వెళ్ళి ఉంటాను. ఒకొక్కసారి మనస్సులో బాధ అనిపిస్తుంది. కానీ వాళ్ళందరి ఇళ్లకి వెళ్ళడం, వారందరు పొగడడం నాకసలు ఇష్టం ఉండదు.

మీ ఇల్లు ఎక్కడ మురళీకృష్ణ గారు అని మాటవరసకు అడిగాను మా ఇల్లు శ్రీనగర్ కాలనీలో సార్ ! సీనియర్ ఐ.సి.యస్. వి.కె.రావుగారి ఇంటి ప్రక్క ఇల్లే! అని అన్నారు. అది విన్న నా ఒళ్ళు ఝల్లుమంది. నేను ఎంతో ఆశ్చర్యపోతూ అయితే నాకు ఒక సహాయం చేసి పెడతారా అని అడిగాను. ఆయన అయ్యో అంతకంటే భాగ్యం ఏముంటుంది సార్ చెప్పండి అని అన్నారు. నేను మురళీకృష్ణ గారికి నా శ్రీవారి దర్శనం పుస్తకం, కార్టూన్స్ పుస్తకం ఇచ్చి అవి వి.కె.రావు గారికి అందజేయమన్నాను. పుస్తకాలు ఇచ్చినప్పుడు వీలుంటే ఆ పెద్దాయనతో ఒక ఫొటో దిగి వాట్సాప్‌లో పంపమన్నాను. ఓ అలాగే అని అన్నారు.

మరుసటిరోజు నాకు మురళీకృష్ణగారు ఫోన్ చేసారు. విశ్వపతిగారూ మీరు చెప్పినట్లే వి.కె. రావుగారికి మీ పుస్తకాలిచ్చాను. ఆయనెంతో సంతోషపడ్డారు. వారు జ్వరంతో మంచంమీద పడుకొని ఉన్నారు. చేతులు ముందుకు చాపి మీ పుస్తకాలు రెండు తీసుకున్నారు అయితే మీరు ఫొటో

పంపమన్నారు కదా ! నాదగ్గర ఉన్నది మామూలు ఫోన్! దీంట్లో కెమెరా కూడా లేదు. ఎలామరి అనుకొని వెంటనే రోడ్డుమీదకు వచ్చాను. ఎవరో పిల్లవాడు స్కూటర్ మీద ఆ వీధిలో వెళ్తున్నాడు. ఒక్కసారి అతణ్ని ఆగమని బాబూ నీ దగ్గర వాట్సప్ ఫోన్ ఉందా అని అడిగాను...ఆ పిల్లవాడు ఉంది అని అన్నాడు. బాబ్బాబు చిన్న సహాయం చేస్తావా? నీ ఫోన్‌తో ఒక ఫొటో తీసి ఒక సార్ కి పంపుతావా? అని ప్రాదేయపడ్డాను నా అదృష్టం కొద్ది అతను ఒప్పుకున్నాడు. అతణ్ని వెంటనే లోపలకి పిలిచి వి.కె.రావు గారికి పుస్తకాలు ఇస్తున్నట్లు ఫొటో తీయించుకున్నాను. ఆ పిల్లాడి ఫోన్ నుంచి మీకు ఫొటో పంపించాను అని అన్నారు.

అప్పుడు నేను మురళీకృష్ణ గారూ మీకు ఎంతో కృతజ్ఞుణ్ని అని అన్నాను. దాందేముందు విశ్వపతిగారూ! మీ పుస్తకాలు, మీ వంటి వారి పరిచయం అవ్వడం నా అదృష్టం అని అన్నారు. నా కార్టూన్స్ ఎంతో ఇష్టపడే వి.కె. రావుగారికి నా కార్టూన్ కలెక్షన్ బుక్ చేరడం నాకు ఎంతో సంతోషం కలిగించింది. ఇది జరిగి ఒక రెండు మూడు రోజులయింది. ఉదయాన్నే పేపరులో కనబడిన వార్త నన్ను షాక్‌లో పడవేసింది. అదేమిటంటే మాజీ ఐ.సి.యస్ అధికారి వి.కె.రావుగారు ఇకలేరు అన్నది. ఒక్కసారిగా నా బ్రెయిన్ స్థంభించింది! ఆయన వయస్సు 104 సంవత్సరాలు! బ్రిటీష్ కాలంనాటి చివరి ఐ.సి.యస్. ఆఫీసర్ ఆయనే! 1914 వ సం॥లో పుట్టిన ఈయన 1937 లో అప్పటి ఐ.సి.యస్. లో చేరారు. ఎన్నో గొప్ప పదవులు నిర్వహించి వీరు ఆంధ్రప్రదేశ్ చీఫ్ సెక్రటరీగా పనిచేశారు. మాజీ రాష్ట్రపతి శ్రీ నీలం సంజీవరెడ్డిగారి దగ్గర ప్రిన్సిపల్ సెక్రటరీగా కూడా చేశారు. అంతటి గొప్ప వ్యక్తి వద్దకు ఎటువంటి ఆశ్చర్యకరమైన పరిస్థితులలో నా పుస్తకాలు చేరాయో చూడండి.

నా పుస్తకాలు రోడ్డు మీద మురళీకృష్ణ గారికి దొరకడం ఏమిటి ! అందునా కేవలం 1000 కాపీలు మాత్రమే అదీ దగ్గర వాళ్ళకి ఇద్దామని ఆశీర్వచనంతో రాసిన మధురపథం పుస్తకం రోడ్డుమీదకి రావడం... అది ఈ మురళీకృష్ణగారికి దొరకడం...ఆయన రావుగారి ప్రక్క ఇంట్లోనే ఉండడం...ఎవరో అపరిచిత కుర్రవాడి సెల్‌ఫోన్‌లో ఫొటో తీయడం... భగవంతుడి లీలలు, పూర్వజన్మ బంధాలు ఎలా ఉంటాయో చూడండి. !

శ్రీవేంకటేశ్వర స్వామి లీలా విశేషాలతో ఉన్న శ్రీవారి దర్శన్, కార్టూన్స్ పుస్తకం వారు కాలంచేసే ముందు వారికి చేరడం భగవంతుడి లీలా విశేషం కాక మరేమిటి!

మురళీకృష్ణగారు ఆ రోజు ఆ రోడ్డులో వెళ్ళకపోయినా, అక్కడ నా పుస్తకం పైన మరో నాలుగు పుస్తకాలు ఉండి అది కనబడక పోయినా, ఇవన్నీ జరిగినా కూడా ఈయన వి.కె.రావు గారి ఇంటిప్రక్కన కాకుండ, ఇంత మహానగరంలో మరొక చోట ఉన్నా, శ్రీ రావుగారికి నా పుస్తకాలు చేరేవి కాదు కదా! దీన్నే ఇంగ్లీష్‌లో అంటారు గాడ్స్ గ్రాండ్ డిజైన్ ఆఫ్ థింగ్స్ అంటారు...శ్రీరావుగారు కూడా ఆ జన్మలో హిమాలయాశ్రమంలో నన్ను కలసినవారే అప్పటి బంధం వలననే ఇంతటి విచిత్రకర పరిస్థితులలో వారిని కలవడం చివరి రోజుల్లో వారి వద్దకు నా పుస్తకాలు చేరడం జరిగింది.

18

ఈ పూర్వజన్మ వాసనల ఫలితాలు చాలా విచిత్రంగా ఉంటాయి. ఒకసారి నాకు తెలిసిన మిత్రుడు ఒకరు తీవ్రమైన డిప్రెషన్ కు గురయ్యాడు. అతని వయస్సు సుమారు 40 సం॥లు ఉంటాయి. ఎంత మంది డాక్టర్లను కలిసినా ఇతనికి ఏమాత్రం ఉపశమనం కలుగలేదు. ఎన్నో పూజలు చేశాడు. అతని బంధువులు అతడిని ఎన్నో పుణ్యక్షేత్రాలకి కూడా తీసుకువెళ్ళారు. కాని అతనిలో పెద్ద మార్పు ఏమీ రాలేదు. ఎప్పుడూ చాలా దిగాలుగా ఏదో బాధతో ఉండేవాడు. డాక్టర్లకి కూడా ఏమీ అర్థం కాలేదు. అతను కూడా తన మనస్సు ఇలా ఎందుకు ఉంటుందని ఫలానా కారణమని ఇదమిద్ధంగా చెప్పలేకపోయేవాడు. కాని ఎప్పుడూ దిగాలుగా ఉండేవాడు.

రోజులు ఇలా జరుగుతుండగా ఒకరోజు వాళ్ళ బంధువులొకరు నా వద్దకు వచ్చి ఇతనికి అసలు తగ్గుతుందా లేదా జీవించినంతకాలం ఇలా బాధపడాల్సిందేనా అని ఎంతో బాధపడుతూ అడిగాడు. నేనప్పుడు కాసేపు ఆలోచించి వారితో ఒక విషయం చెప్పాను. రెండు నెలల్లో అతడికి తగ్గడం మొదలు పెడుతుందని. నాలుగైదు నెలలకు పూర్తిగా తగ్గిపోతుందని అన్నాను.

ఆరోనెలకల్లా మీ వాడు చాలా హుషారుగా అవుతాడు అన్నాను. దానికి వాళ్లు ఎంతో ఆశ్చర్యపోయి ఇన్ని మందులు వాడినా తగ్గని వ్యాధి రెండునెలల్లో ఎలా తగ్గుతుంది అని అన్నాడు. లేదు తప్పకుండా తగ్గుతుంది. మీరే వచ్చి నాతో చెప్తారు చూడండి అన్నాను. వాళ్ళు ఎంతో సంతోషపడి వెళ్లిపోయారు.

మా స్నేహితుడు సఫీల్‌గూడ ప్రాంతంలో ఉండేవాడు. రెండు నెలలు తరువాత వాళ్ళ ప్రక్క అపార్ట్‌మెంటులో ఉండేవారు. అతడికి వేరే ఊరికి ట్రాన్స్‌ఫర్ అయ్యి అపార్ట్‌మెంటు ఖాళీ చేసి వెళ్ళిపోయారు. దాంట్లో వేరే క్రొత్త కుటుంబం వచ్చి అద్దెకు చేరింది. భార్య భర్త ఇద్దరు చిన్న పిల్లలు. వాళ్ళచిన్నబ్బాయి కిషోర్ ఎప్పుడూ మా స్నేహితుడి ఇంటిలోకి వచ్చి ఇక్కడే ఆడుతుండేవాడు. మా స్నేహితుడి దగ్గరకు వచ్చి ఎప్పుడూ ఏదో మాట్లాడించేవాడు.

మా స్నేహితుడు డిప్రెషన్‌తో ఉండడం వల్ల ఆ పిల్లవాడు కిషోర్‌కి పెద్దగా సమాధానం చెప్పేవాడు కాదు. అయినా కిషోర్ ఇతన్ని వదిలిపెట్టేవాడు కాదు. ప్రతిరోజు వచ్చి ఏదో చిన్న చిన్న కబుర్లు చెప్తూ వెళుతుండేవాడు. ఇలా కొన్ని రోజులు గడిచిన తరువాత మాస్నేహితునిలో నెమ్మదిగా మార్పురావడం మొదలైంది. మనిషి కొంచెం హుషారుగా తయారవుతున్నాడు. రెండు నెలల్లో అతడి డిప్రెషన్ చాలామట్టుకు తగ్గిపోయింది. శ్యామ్ పూర్తిగా ఆరోగ్యవంతుడై మునుపటి చలాకీతనం పూర్తిగా వచ్చేసింది. వాళ్ల కుటుంబం, బంధువులందరూ ఎంతో సంతోషపడ్డారు. నాకు దగ్గరకు వచ్చి ఎంతో ఆనందంగా తమ కృతజ్ఞతలు తెలిపారు.

ఇంతకీ ఇన్నేళ్ళుగా ఏ మందులకు లొంగని మా స్నేహితుడు శ్యామ్ డిప్రెషన్ ఇలా రెండు నెలల్లో ఒక్కసారిగా ఎలా తగ్గిందో తెలుసా ? నాలుగు జన్మల క్రితం శ్యామ్ ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఒక వ్యాపారుల కుటుంబంలో ఘన్‌శ్యామ్ అనే పేరుతో జన్మించాడు. అది చాలా చిన్న ఊరు అతడికి నాలుగు ఎకరాల భూమి ఉండేది. అతనికి వివాహం జరిగిన 12 సం॥లకు రాధేశ్యామ్ అనే కొడుకు పుట్టాడు. తల్లి దండ్రులు అతడిని ఎంతో అపురూపంగా చూసుకునేవారు. తండ్రి ఘన్‌శ్యామ్‌కు కొడుకే సర్వస్వం.

రోజులు ఇలా గడుస్తుండగా ఒకరోజు రోడ్డుమీద ఆడుకుంటున్న రాధేశ్యామ్ ఒక యాక్సిడెంట్‌లో మరణించాడు. ఉన్నట్లుండి జరిగిన ఈ సంఘటనకు తల్లిదండ్రులు ఎంతో షాక్ అయ్యారు. లేక లేక కలిగిన తమ కుమారుడు ఇలా అర్థాంతరంగా మరణించడంతో వారెంతో బాధపడ్డారు. ఈ ఆ ఘన్‌శ్యామే ఈ జన్మలో మా స్నేహితుడు శ్యామ్‌సుందర్ గా జన్మించాడు. అప్పుడు జరిగిన ఆ దుర్ఘటన అతని ఆత్మను గట్టిగా పట్టుకొని ఈ జన్మలో తనకే కారణం తెలియకుండా ఎప్పుడూ బాధపడుతూ ఉంటూ డిప్రెషన్‌లోకి వెళ్ళాడు.

పూర్వజన్మలో ఇతడి కొడుకైన రాధేశ్యామ్ ఈ జన్మలో వేరొక కుటుంబంలో పుట్టాడు. అతడే ఈమధ్య వీరి ప్రక్క అపార్ట్‌మెంటులో వచ్చిన కుటుంబంలోని కిషోర్ అప్పటి రాధేశ్యామే! అంతే ! ఈ కిషోర్ రాగానే మా స్నేహితుడిలోని ఎంతో మార్పు వచ్చింది. ఇతని ఆత్మ ఎంతో సంతోషపడింది. పూర్వజన్మలోని తన కుమారుడు దగ్గరకు వచ్చాడని గ్రహించి ఎంతో ఆనందపడ్డాడు. శ్యామ్ తనకు తెలియకుండానే కిషోర్‌ను కలిసినప్పటినుంచి ఎంతో హుషారుగా అయ్యి డిప్రెషన్ నుంచి బయటపడ్డాడు.

ఈ విషయం తెలిసే నేను రెండు నెలల క్రితం వారి బంధువులకి శ్యామ్‌సుందర్ కి రెండు నెలల్లో పూర్తిగా తగ్గిపోతుందని చెప్పాను. కాని ఇదంతా వివరంగా వారికి చెప్పలేదు. శ్యామ్‌సుందర్ ఈరోజు ఎంతో సంతోషంగా ఉన్నాడు. ఇంతకంటే మనకింకే కావాలి?

19

మనకి ఏదైనా కష్టం కలిగినపుడు తప్పక బాధ కలుగుతుంది. ఇది శరీరానికి, మనస్సుకి కూడా కలుగుతుంది. అలా బాధపడడం మానవ సహజం అయితే దానినే పట్టుకొని మన మనస్సు పాడుచేసుకొని, మన దగ్గర వాళ్ళతో బంధాలు తెంచుకునేలా ఉండకూడదు. మన జీవితంలో ప్రశాంతత కోల్పోకూడదు. ఇదంతా అత్యంత స్వల్పం అని గ్రహించాలి. ప్రతీ విషయాన్ని విశాల దృక్పధంతో ఆలోచించాలి. అప్పుడే మనము, మన చుట్టూ ఉన్నవాళ్ళు ప్రశాంతంగా ఉండగలుగుతారు.

ప్రతీ మానవుడు ఒక్కొక్క జన్మలో ఎన్నో పుణ్య, పాప కార్యాలు చేస్తూ, వాటి కర్మఫలాలను అనుభవించడానికి మరల మరల జన్మిస్తూ మళ్ళీ కొత్త కర్మలు చేస్తూ, మళ్ళీ కర్మఫలాలు మూట కట్టుకుంటూ అవి అనుభవించడానికి మరల మరల జన్మిస్తూ, ఇలా కోట్లాది జన్మల్లో ఈ జనన మరణ చక్రం నుంచి తప్పించుకోలేకపోతారు. మనం చేసే పాప పుణ్యాల బట్టి మనం తరువాత జన్మలో ఏ ప్రదేశంలో ఏ కుటుంబంలో జన్మిస్తామో ఎలా జీవిస్తామో, ఎలా కష్ట సుఖాలు అనుభవిస్తామో ఇదంతా నిర్ణయించబడుతుంది. కొన్ని వందల

జన్మలపాటు మనం చాలా ఎక్కువగా పాపకర్మలు చేస్తే ఆ తరువాత జన్మలలో మనకు మానవ జన్మ లభించదు. అన్ని వందల జన్మలలో అనేక పాపాలు చేసి ఉండడం వలన జంతు ప్రపంచంలో ఏ కొండలపైనో, ఏ అడవులలోనో ఏ జంతువుగానో జీవించి అతి హీనమైన జీవితం గడుపుతాము.

చాలా మంది అనుకునేటట్లు ఒక పది, పదిహేను జన్మలలో పాప కార్యాలు చేయగానే జంతు ప్రపంచంలో జన్మించడం జరగదు. మళ్ళీ మానవులగానే పుడతాం. కాని చాలా కష్టాల పాలవుతాము. ఎన్నో బాధలు ఎదుర్కొంటాము. ఇలా కాక కొన్ని వందల జన్మలలో ఎక్కువ పాప కార్యాలే చేస్తే అప్పుడు జంతు ప్రపంచంలో జన్మిస్తాము. మనం ఆ వందల జన్మలలో ఎంతటి ఘోర పాపకార్యాలు చేసామో తోటివారిని ఎంతగా హింసించామో అన్న దానిని బట్టి మనం జంతు ప్రపంచంలో ఎన్ని జన్మలు ఉంటామన్నది నిర్ణయించబడుతుంది.

సాధారణంగా ఇలా పాపకర్మలు చేసినవారు ఒకసారి జంతు ప్రపంచంలోకి వెళ్తే కనీసం నూరు జన్మలు ఆ జంతు ప్రపంచంలోనే జన్మిస్తూ ఉంటారు. ఒక జన్మలో కుక్కగానో, మరో జన్మలో పిల్లిగానో, మరో జన్మలో పెద్ద పులిగానో, మరో జన్మలో యే ఏనుగుగానో, ఇలా రకరకాల జంతువులుగా జన్మిస్తాం. అలా కొన్ని వందల సంవత్సరాలు అనేక జన్మలలో అనేక జంతుజాతుల్లో జన్మించి అనేక కష్టాలు అనుభవించి తిరిగి మానవ జన్మ పొందుతాం. ఎన్ని సంవత్సరాలు జంతులోకంలో జన్మిస్తామో అది మనం చేసే మానవ జన్మలో ఉన్నప్పుడు చేసిన పాపకార్యాల తీవ్రతను బట్టి నిర్ణయించబడుతుంది.

అయితే కొన్ని వందల జన్మలలో పాపాలు చేసినవారు ఆ పాప కర్మఫలమంతా జంతువుల లాగానే జన్మించినప్పుడే పూర్తిగా అనుభవించరు. తిరిగి మానవ జన్మ పొందగానే కొంత పాప ఫలం అనుభవిస్తారు. అతిగా పాప కార్యాలు చేయడంతో కొంత పాప ఫలాన్ని పశుపక్ష్యాదులుగా జన్మించి అనుభవించవలసి వస్తుంది. మిగిలిన పాపఫలం మానవ జన్మలలో అనుభవిస్తాము. ఇలా కొన్ని వందల జన్మలు జంతు ప్రపంచంలో జన్మించిన వారి ఆత్మ తిరిగి మానవ జన్మ ఎప్పుడు లభిస్తుందో అని ఎంతో ఆరాటపడుతుంది.

అందుకే ఒక్కొక్కప్పుడు కుక్కలు, పిల్లులు ఇలా అనేక జంతువులు మనలని ఎంతో బాధతో చూస్తూ కనిపిస్తాయి. వాటి ఆత్మకు ఇంతకుముందు జన్మలలో మన మధ్యే ఉన్నామని తెలుస్తుంటుంది. అందువలన మనలని ఆ జంతువులు అతి దీనంగా చూస్తూ ఉంటాయి. తిరిగి మానవ జన్మలోకి ఎప్పుడు వస్తామా అని తహతహలాడుతుంటాయి.

ఇలా జంతుప్రపంచంలో ఉన్న జంతువులు తిరిగి మానవ జన్మ లభించే ముందు మానవులకు అతి దగ్గరగా జీవిస్తాయి. కొందరి ఇళ్ళల్లో పెంపుడు జంతువులుగా ఉండి అటు తరువాత జన్మలలో తిరిగి మానవ జన్మ పొందుతాయి. ఇలా ఒక్కొక్క జీవి ఏ జన్మలో ఎక్కడ ఏ జీవిగా జన్మిస్తాడో ఆ జీవి గత జన్మలలో చేసుకున్న పుణ్య, పాప కార్యాలను బట్టి నిర్ణయింపబడుతుంది.

20

ఒక్కొక్కసారి మన చుట్టూ ఉండేవారిలో కొంతమంది జీవితాన్ని పూర్తిగా అనుభవించుదామని చూస్తారు. జీవితంలో ప్రతీ సంఘటనని ఎంతో ఆస్వాదిస్తారు. ఎన్నో ప్రదేశాలు తిరగాలని, రకరకాల పదార్ధాలను తినాలని, సమాజంలోని కట్టుబాట్లను తెంచుకొని అన్నీ అనుభవించాలని, విచ్చలవిడిగా తిరుగుతూ, తమ ప్రవర్తనతో నలుగురిని బాధిస్తూ విపరీతమైన కోరికలతో జీవిస్తుంటారు. సాధారణంగా ఇటువంటి వారిలో కొంతమంది అంతకుముందు కొన్ని వందల జన్మలు జంతు ప్రపంచంలో జన్మించినవారే! కొన్ని వందల జన్మల తరువాత మానవ జన్మ లభించడంతో వారి ఆనందానికి అంతు ఉండదు. తమ జీవితాన్ని పూర్తిగా అన్ని విధాలా అనుభవించుదామని చూస్తారు. అయితే ఈ తాపత్రయంలో పడి వారు ఒకొక్కసారి అనేక పాప కార్యాలను కూడా చేయడం మనం గమనిస్తాం. ఒకొక్కసారి మనకి తెలిసిన వ్యక్తి ఎంతో ఉన్నత పదవి పొంది జీవితం మొత్తం అనుభవించాలని అనుకుంటూ అనేక పాప కార్యాలను చేయడం గమనిస్తుంటాం. అటువంటివారు తరువాత జన్మలలో ఎంతో హీనంగా బ్రతకవలసి వస్తుంది.

అయితే ఇందుకు విరుద్ధంగా కొంతమంది మాత్రం ఇలా ఎన్నో వందల జన్మలు జంతు ప్రపంచంలో జన్మించి తిరిగి మానవ జన్మ పొందగానే

ఎంతో సాత్వికంగా జీవిస్తుంటారు. ఎన్నో పుణ్యకార్యాలను కూడా చేస్తారు. అటువంటి వారు తరువాత జన్మలలో కూడా ఎన్నో మంచి పనులు చేస్తూ మంచి జీవితాన్ని గడుపుతారు. ఇలా మన చుట్టూ ఉండే మనుషుల ప్రతీ ప్రవర్తనకి వారు ఇంతకుముందు జన్మలలో చేసిన పుణ్య, పాప కార్యాల ఫలమే అని గ్రహించాలి. ప్రతీ మానవుడు ఎప్పుడూ మంచి జీవితాన్ని గడుపుతూ, మన చుట్టూ ఉండే వారందరి శ్రేయస్సు కోరుకుంటూ జీవిస్తే మనం జంతు ప్రపంచంలో జన్మించడం జరుగదు. ఇది సత్యం.

నేను కొంతకాలం క్రితం మా స్నేహితుడు వెంకట్రావును చూడడానికి వెళ్ళాను. నేను వెళ్ళేటప్పటకి అతను ఒక పెద్ద కుక్కతో ఆడుకుంటున్నాడు. ఆ దృశ్యం చూడగానే నాకు విపరీతమైన ఆశ్చర్యం కలిగింది. ఎందుకంటే అతనికి చిన్నప్పటినుంచి కుక్కలంటే విపరీతమైన భయం. అటువంటిది వెంకట్రావు ఇలా కుక్కతో ఇంత ఆనందంగా ఏమాత్రం బెరుకు లేకుండా ఆడడం చూస్తే ఎంతో ఆశ్చర్యం వేసింది. ఇదే ప్రశ్న వెంకట్రావుని అడిగాను. దానికి అతను నాతో ఇలా అన్నాడు. విశ్వపతీ! నువ్వు చెప్పినట్లు నాకు చిన్నప్పటినుంచి కుక్కలంటే మహా భయం. విపరీతమైన భయం. ఎవరింట్లో అయినా కుక్క ఉంటే వాళ్ళ ఇంటి ఛాయలకు కూడా అస్సలు వెళ్ళేవాడిని కాదు. అయితే ఈ మధ్య మా అబ్బాయి కొంతకాలం నుంచి కుక్కను పెంచుకుంటానని ఒక్కటే గొడవ చేస్తున్నాడు. ఎంత చెప్పినా విన్నాడు కాదు. వాడి స్నేహితుని ఇంట్లో కుక్కను చూసాడట. అవి చూసి వీడికి కూడా ఎలాగైనా ఒక కుక్కను పెంచుకోవాలి అని గట్టి కోర్కె. నాకు కుక్కలంటే ఉన్న భయం కొద్ది ఇదిగో అదిగో అంటూ ఎప్పటికప్పుడు దాటేస్తూ వచ్చాడు. కాని వాడు మాత్రం కుక్కని ఎలాగైనా తెచ్చుకోవాలంటూ నన్ను నస పెట్టడం ఆపలేదు.

ఒక రోజు మా స్నేహితుడు రామారావు మా ఇంటికి వచ్చాడు. కాసేపు కూర్చొని అవి ఇవి కబుర్లు మాట్లాడుతున్నాడు. ఇంతలో బయట ఆడుకుంటున్న మా అబ్బాయి లోపలకి వచ్చి నాన్నా కుక్కని ఎప్పుడు తీసుకొస్తావు అంటూ మళ్ళీ మొదలుపెట్టాడు. నాకు విసుగొచ్చి బయటకు వెళ్ళి ఆడుకో అని గట్టిగా అరిచాను. అక్కడితో వాడు బిక్కమొహం వేసుకొని వెళ్ళిపోయాడు.

ఇది విన్న మా స్నేహితుడు రామారావు ఏమిట్రా వెంకట్రావు! మీ వాడికి కుక్కలంటే అంత ఇష్టమా ప్రక్కనే మా స్నేహితుడు ఒకతను తాను ఒక

ఆరునెలల ప్రాజెక్ట్ మీద అమెరికా వెళ్తున్నాడు అని తన కుక్కని ఏమిచెయ్యాలో అర్థం కావడంలేదు అని అన్నాడు. ఆ కుక్కను మా స్నేహితుడు ఎంతో ప్రాణంగా పెంచుకుంటున్నాడు. ఇన్నాళ్ళు ఎవరి దగ్గర ఉంచాలా అని ఒకటే ఆలోచిస్తున్నాడు. ప్రాజెక్ట్ ఒక సంవత్సరం దాకా సాగినా సాగవచ్చు అని అన్నాడు.

ఇదంతా కిటికీ బయట నుంచుని వింటున్న వెంకట్రావు కొడుకు ఒక్కసారిగా లోపలకి వచ్చి నాన్న ఆ కుక్కను మనం తెచ్చుకుందామా అని అన్నాడు. వెంకట్రావుకి ఇక తప్పింది కాదు. ఆ తరువాత రోజే వెంకట్రావు రామారావుతో కలిసి అతని స్నేహితుని ఇంటికి వెళ్ళి ఆ కుక్కని తెచ్చుకున్నాడు. వెంకట్రావు నాతో ఇంకా ఇలా అన్నాడు. విశ్వపతీ! ఇదిగో ఈ కుక్క మా ఇంటికి ఇలా వచ్చింది. అయితే నాకొక విషయం చాలా ఆశ్చర్యంగా ఉంది. కుక్కలంటే ఏ మాత్రం ఇష్టం లేని నేను ఎందుకో ఈ కుక్కను చూడగానే ఏదో అభిమానం పుట్టుకొచ్చింది. అంతే కాదు దీనికి కూడా నా మీద ఎంతో ప్రేమ. మా అబ్బాయితో ఆడినంత సేపు ఆడి సాయంత్రానికి తిరిగి నా దగ్గరకి వస్తుంది. అలా నా మొహం వైపు చూస్తూ కూర్చుంటుంది. కుక్కలు ఉన్న ఇంటికే వెళ్ళడానికి బయపడే నేను దీనిని మాత్రం ఇంత అభిమానంగా ఎలా చూస్తున్నానో నాకు ఆశ్చర్యం కలుగుతుంది. అని అన్నాడు. ఆ తరువాత వెంకట్రావు దగ్గర కాసేపు కూర్చొని వేరే కబుర్లు చెప్పుకొని ఇంటికి వచ్చేసాను.

ఇంటికి వచ్చి ఈ విషయాన్నే ఆలోచిస్తూ కూర్చున్నాను. అప్పుడు నాకు వెంకట్రావుకి ఆ కుక్క మీద అంత అభిమానం ఎందుకు కలిగిందో అర్థమయింది. కొన్ని జన్మల క్రితం వీళ్ళిద్దరూ తండ్రి కొడుకులు. ఈ జన్మలో కుక్కగా జన్మించినది కొన్ని వందల జన్మల క్రితం వెంకట్రావు తండ్రే! అందుకే పూర్వజన్మ బంధాల ఫలితంగా ఆ కుక్క ఇప్పుడు వెంకట్రావు వద్దే కూర్చుంటుంది. ఆ జన్మలో సాయంత్రం అవ్వగానే తండ్రి కొడుకులిద్దరూ పొలం నుంచి ఇంటికి వచ్చి ఇంటి వసారాలో కూర్చొని కబుర్లు చెప్పుకునే వారు.

అందుకే ఈ జన్మలో కుక్కగా జన్మించినా ఆత్మ యొక్క పూర్వ జన్మ వాసనన వలన వెంకట్రావు దగ్గర సాయంత్రానికల్లా చేరుకుంటాడు. పూర్వజన్మ బంధం గట్టిగా ఉండడం వలన అతని ఆత్మ ఈ జన్మలో ఒక కుక్కగా ఎక్కడో

జన్మించినా ఆత్మను గట్టిగా పట్టుకున్న బంధం చివరికి అతని కుమారుడి వద్దకే తీసుకొచ్చింది. పూర్వ జన్మ బంధాలు గట్టిగా ఉన్నప్పుడు మన తోబుట్టువులు, ప్రియ స్నేహితులు తరువాత జన్మలలో విచిత్రమైన రీతులలో తిరిగి మనల్ని కలుసుకుంటారు. ఆ జన్మలో బంధం ఎంత గాఢంగా ఉండేదో దానిని బట్టి ఈ జన్మలో వాళ్ళు మనదగ్గర అంతకాలం గడుపుతారు.

ఇలా పూర్వజన్మ బంధాల వలన ఒకొక్క సారి కొంతమంది కేవలం మనల్ని ఏ అయిదు నిమిషాలో, పది నిమిషాలో కలిసి వెళ్ళిపోతారు. ఆ విషయం మన ఆత్మ గ్రహిస్తుంది. కాని ఈ శరీరంలోని బుద్ధి మాత్రం గ్రహించదు. అందుకే ఒక్కోసారి మనం ఏదైనా ప్రయాణంలో వెళ్తున్నప్పుడు మన ప్రక్క సీటులో కూర్చున్న అపరిచితుడు మనకు ఎందుకో ఎప్పుడో ఇంతకుముందు కలిసినట్లు అనిపిస్తుంది. ఒక్కోసారి అతడిని ఈ విషయం అడుగుతాం కూడా. కాని నిజంగా ఈ జన్మలో ఇంతకుముందు ఎప్పుడూ కలిసి ఉండలేదు. ఇదే మొదటిసారి. కాని మనకు ఎందుకో చాలా తెలిసిన వ్యక్తిగా అనిపిస్తాడు.

అంటే ఈ వ్యక్తిని మనం గత జన్మల్లో ఎప్పుడో, ఎక్కడో కలిసి ఉన్నాం. అందుకే మన మనస్సుకు ఇంత సన్నిహితంగా అనిపిస్తున్నాడు. మన ఊరు రాగానే మనం బస్సు దిగి మన దారిన మనం వెళ్ళిపోతాం. ఆ బంధం అక్కడితో సరి! కాని ఒకొక్కసారి అలా ఏదో ప్రయాణంలో కలిసినవారు తరువాత కాలంలో ఎంతో సన్నిహితులయ్యి వాళ్ళతో సంబంధ బాంధవ్యాలు కలుపుకునే దాకా వెళ్ళడం కూడా మనం గమనిస్తుంటాము. ఇవన్నీ పాత జన్మల బంధాలే. ఇంతకు ముందు జన్మల్లో మన బంధం ఇంత గట్టిగా ఉంది అన్న దాన్నిబట్టి ఈ జన్మలో ఎంతకాలం, ఎంత గాఢంగా ఉంటుందో నిర్ణయించబడుతుంది.

21

పూర్వజన్మ బంధాలు కేవలం వ్యక్తులతోనే కాకుండా ప్రదేశాలతో కూడా ఉంటాయి. ఒకసారి మేము కారులో ఒక ఊరు వెళ్తున్నాము. దారి మధ్యలో ఎక్కడైనా కాసేపు ఆగి టీ త్రాగుదామని అనుకున్నాను. ఇదే మాట డ్రైవర్‌తో చెప్పాను. అతను రోడ్డుకి అటూ ఇటూ చూస్తూ డ్రైవింగ్ చేస్తున్నాడు. మేము కూడా ఏదైనా టీ కొట్టు కనబడుతుందా అని చూస్తున్నాము. ఇంతలో ఒకచోట చెట్టుక్రింద చిన్న టీకొట్టు కనబడింది. అక్కడ ఆపి టీ అడిగితే వాళ్ళబ్బాయి పాలకోసం వెళ్ళాడని ఒక గంట పడుతుందని అన్నాడు. అంత సమయం మాకు లేదని చెప్పి మళ్ళీ కారెక్కి మరొక కొట్టు దగ్గర ఆపాము.

మేము వెళ్ళేటప్పటికి అక్కడ నలుగురు వ్యక్తులు నుంచొని టీ త్రాగుతున్నారు. మేము వెళ్ళి ఆ షాపు కుర్రాడిని టీ అడిగితే అతడు మాతో సార్! పాలు ఇప్పుడే అయిపోయాయి మా తమ్ముడు పాలు తీసుకురావడానికి ఊళ్ళోకి వెళ్ళాడు. ఒక అర్థగంటలో వస్తాడు ఉండండి సార్! అన్నాడు. కాని ఇక్కడ ఎంతసేపు ఉండవలసి వస్తుందో అని మళ్ళీ కారెక్కి ముందుకి వెళ్ళిపోయాము.

ఈ రోజు మా పరిస్థితి ఇలా ఉందేమిటా అనిపించింది. ఇంకా కొంచెం ముందుకి వెళ్ళగానే ఒక ముసలవ్వ చిన్న టీ కొట్టు పెట్టుకొని కనిపించింది. ఏం అవ్వ టీ ఉందా! అని అనుమానంగా అడిగాం. ఎంతో సంతోషంగా ఉంది సార్! ఇప్పుడే వేడిచేసి వచ్చాను అని మంచి వేడి వేడి టీ తెచ్చి ఇచ్చింది.

టీ త్రాగుతూ ఆలోచిస్తున్న నాకు అసలు విషయం అర్థమయింది. ఈ ముసలవ్వ ఒక జన్మలో మా డ్రైవర్‌కి తండ్రి. ఇతడికి అప్పటి బంధం ఇంకా ఉండడం చేత ఇలా ఈ రోజు కలవడం జరిగింది. లేకపోతే ఆ రెండు టీ కొట్లలో టీ లేకపోవడం ఏమిటి. ఈ ముసలవ్వ దగ్గర టీ త్రాగడం ఏమిటి. ఇలా ఇద్దరి ఆత్మల బంధం ఇంత గట్టిగా ఉండి తిరిగి ఈరోజు ఇలా కలుసుకున్నారు.

ఆశ్చర్యకంగా ఆ అవ్వ మేము టీ త్రాగుతున్నంతసేపు మా డ్రైవర్ ప్రక్కనే కూర్చొని అతనికి అవి ఇవి విషయాలు చెప్పింది. తన పిల్లలు ఏమి చేస్తుంటారో అన్నీ చెప్పింది. తన కష్టసుఖాలన్నీ మా డ్రైవర్‌తో చెప్పింది. ఇలా ఎవరైనా ఒక్క ఐదు నిమిషాల పరిచయంలో చెప్పడం గమనించారా? ఆ అవ్వకి పూర్వజన్మలో మా డ్రైవర్‌తో గల బంధం వలన ఆ ఆత్మ మా డ్రైవర్‌తో తన విషయాలన్నీ ఏ మాత్రం సంకోసించకుండా పంచుకోవాలి అని అనిపించింది. ఈ కలయిక అత్యంత తాత్కాలికం. అక్కడ మేమున్నది కేవలం ఒక ఇరవై నిమిషాలు మాత్రమే.

ఇక్కడ ఇంకో విషయం చెప్పాలి. మేము నలుగురం టీ త్రాగాం. నేను జేబులోనించి డబ్బుతీసి ఇచ్చేలోపే మా డ్రైవర్ అవ్వకి తానే టీ డబ్బులు ఇచ్చేసాడు. అయ్యో ఇదేంటి నువ్వు ఇచ్చావు అంటే పరవాలేదు సార్ కొంచెమే కదా అన్నాడు. చూసారా గతజన్మ బంధం ఎంత గట్టిదో. టీ డబ్బులు కూడా ఆ అవ్వకి తానే ఇచ్చాడు. అక్కడితో ఆ అవ్వ ఆత్మ ఎంతో సంతోషించింది. పూర్వజన్మ బంధాలు ఒక్కోసారి ఎంతో అద్భుతంగా, ఆశ్చర్యకరంగా ఉంటాయి.

పూర్వజన్మల బంధాలు మనుషులు, జంతువులు, ప్రదేశాలతోనే కాదు, మనకు ప్రకృతితో కూడా ఉంటుంది. మానవులు అందరికి చెట్లతో ఎంతో బంధం ఉంటుంది. మన చుట్టూ ఉండే రకరకాల చెట్లను మొక్కలను ప్రాణం లేనివాటివిగా ఏమాత్రం భావించవద్దు. వాటికి ప్రాణం ఉంటుంది. వాటికి

మనలాగే ఎన్నో అనుభూతులు ఉంటాయి. ఒకసారి ఎప్పుడైనా వర్షం పడినప్పుడు చెట్లని గమనించండి. ఎంత సంతోషంగా ఉంటాయో! అంతే కాదు. మీరు ఒక చెట్టుదగ్గర నుంచొని మీ మొబైల్ ఫోన్ నుంచి చక్కటి శ్రావ్యమైన సంగీతం ఆ చెట్టుకు వినిపించండి. అప్పుడు ఆ చెట్టుని గమనించండి. ఎంతో ప్రశాంతతతో కనిపిస్తుంది. అదే ఘోరమైన సంగీతం వినిపించండి. ఆ చెట్టు ఎలా ముడుచుకుపోతుందో మీరు గ్రహిస్తారు. ఎందుకంటే ఆ చెట్టు ఈ ఘోరమైన సంగీతాన్ని భరించలేకపోయింది. అదే చక్కటి శ్రావ్యమైన సంగీతాన్ని వినిపించినప్పుడు ఎంతగానో ఉప్పొంగిపోయి చక్కగా ఆకులు అటూ ఇటూ కదుపుతూ ఎంతో ఆనందపడి మనకు కూడా తన భావనని చెప్తుంది. తాను ఆనందించిన విషయాన్ని తనకు తెలిసిన రీతిలో వ్యక్తపరుస్తుంది.

22

మీరు ఒక తోటకి వెళ్ళి గమనించండి. అక్కడ చెట్లన్నీ ఒక దానితో ఒకటి ఎంతో అవినాభావ సంబంధం కలిగి ఉంటాయి. మీరు ఒక చెట్టుకొమ్మను నరికితే మిగతా చెట్లన్నీ రోదిస్తాయి. ఒకసారి నాకు తెలిసిన ఒకతను తన తోటలో ఒక గేటు పెట్టాలి అని రెండు పచ్చని చెట్లను నరికేసాడు. అంతే నాలుగు రోజుల్లో ఒక ఇరవై చెట్ల దూరంగా ఉన్న రెండు చెట్లు అవంతటవే క్రింద పడిపోయాయి. తమతో పాటు పచ్చగా ఉన్న తమ సోదరులను అలా అర్థాంతరంగా నరకడం అవి భరించలేకపోయాయి. ఆ బాధతో అవి కూడా మరణించాయి.

మనందరం ఒకప్పుడు ప్రకృతిలో నివసించినవాళ్ళమే! కొన్ని కోట్ల సంవత్సరాల పాటు అడవుల్లో, కొండల్లో, కోనల్లో ప్రకృతితో కలిసి జీవించాం. అందుకే మనకి ఇప్పటికి చెట్లవద్దకు వెళ్ళినప్పుడు ఎంతో సంతోషం అనిపిస్తుంది. మనం తోటల్లో అటూ ఇటూ తిరుగుతున్నప్పుడు మన మనస్సుకి ఎంతో ఆనందంగా ఉంటుంది.

మీకు మనస్సు ప్రశాంతంగా లేనప్పుడు దగ్గరలో ఉన్న ఏ పార్కుకో వెళ్ళండి. ఏదైనా చెట్టుక్రింద కాసేపు కూర్చోండి. మీ మనస్సుకి ఎంత హాయిగా ఉంటుందో గమనించండి. చెట్లు ప్రకృతి నుంచి ఎనర్జీని గ్రహిస్తాయి. కొన్ని రకాల చెట్లు ఈ విశ్వంలో ఉండే కాస్మిక్ ఎనర్జీని ఎంతో ఎక్కువ శక్తితో గ్రహిస్తాయి. అటువంటి చెట్లక్రింద మనం కాసేపు కూర్చున్నా మన శరీరంలో కూడా ఈ కాస్మిక్ తరంగాలు ప్రసరించి మన ఆరోగ్యం ఎంతో బాగుంటుంది. మన మనస్సుకు ఎంతో హాయి కలుగుతుంది. ఒకసారి నేను అమెరికా దేశంలో యోసమెటి అనే పెద్ద జాతీయ పార్కుకి వెళ్ళాను. అప్పుడక్కడ ప్రపంచంలోనే ఎంతో ఎక్కువ వయస్సు ఉన్న చెట్లను చూసాను. వాటిలో కొన్ని ఆరువందల సంవత్సరాలు, కొన్ని వెయ్యి సంవత్సరాలు వయస్సు చెట్లు కూడా ఉన్నాయి.

ఈ చెట్లు కొన్ని వందల సంవత్సరాలు ఏ ఆహారం లేకుండా ఎలా ఉన్నాయి? ఒక్కో సంవత్సరం అసలు వర్షాలే పడేవి కాదు. ఒకొక్క సారి కొన్ని సంవత్సరాలు పాటు వర్షపు చుక్క కూడా పడని రోజులు ఉన్నాయి. అయినా ఇన్ని వందల సంవత్సరాలు ఈ వృక్షాలు ఇలా బ్రతికుండడానికి కారణం అవి ఈ విశ్వం నుంచి కాస్మిక్ శక్తిని గ్రహించడమే! ఆ కాస్మిక్ శక్తితోనే ఈ వృక్షాలు ఇన్ని సంవత్సరాల పాటు బ్రతికి ఉన్నాయి. ఇప్పుడు వాటిని చూస్తుంటే నాకు కొన్ని వందల సంవత్సరాల నుంచి తపస్సు చేస్తున్న మహార్షులు లాగా నాకు గోచరించాయి.

ఇటువంటి అద్భుత వృక్షాలు మనదేశంలో కూడా కొన్ని చోట్ల ఉన్నాయి. పవిత్ర తిరుమల కొండపై ఇటువంటి వందల సంవత్సరాల వయస్సు గల వృక్షాలు ఎన్నో ఉన్నాయి. ఇవి విశ్వం నుంచి ఎంతో కాస్మిక్ శక్తిని తీసుకుంటాయి. అందుకే మనం తిరుమల కొండ ఎక్కేటప్పుడు ఈ అద్భుత వృక్షాల నుంచి వచ్చే కాస్మిక్ తరంగాలు మన శరీరానికి ఎంతో శక్తిని ఇస్తాయి. అందుకే అస్సలు నడవడం ఏ మాత్రం అలవాటు లేనివాళ్ళు కూడా తిరుమల కొండ ఎక్కేటప్పుడు ఏ మాత్రం అలసట ఉండదు. ఏమాత్రం కష్టం అనిపించదు. ఎంతో హాయిగా ఎక్కగలుగుతున్నారు. ఆ చెట్లనుంచి వచ్చే దివ్యమైన కాస్మిక్ తరంగాలే మనలోని ఆ ఉత్తేజానికి, హుషారుకి కారణం.

ఈ చెట్లు మనతో మాట్లాడతాయి కూడా. అయితే ఆ భాష, ఆ సందేశాలు మన ఈ మెదడుతో అర్థం చేసుకోలేము. కాని మన ఆత్మకి తెలుస్తుంది. అందుకే ఒకోసారి ఏదో పార్కులో నడుస్తూ చెట్టుకింద కూర్చుందామని ఆ చెట్టు దగ్గరకి వెళ్ళి మళ్ళీ క్షణంలో మనసు మార్చుకొని దూరంగా ఉండే మరో చెట్టు దగ్గరకి వెళ్ళి ఆ చెట్టుకింద కూర్చుంటాము. అలా ఎందుకు చేస్తాము అంటే ఆ చెట్టునుంచి మనకు ఏదో సందేశం వచ్చిందన్నమాట మన ఆత్మ ఆ సందేశాన్ని గ్రహించడం చేత మనకు తెలియకుండానే ఆ చెట్టు వద్దకు వెళ్ళి ఆ చెట్టుకిందే కూర్చుంటాము.

ఇటువంటి సందేశాలు చిన్న పిల్లలు ఇంకా బాగా గ్రహించగలుగుతారు. అందుకే మనం మన పిల్లల్ని తీసుకొని ఏదైనా పార్కుకి వెళ్ళినప్పుడు పిల్లవాడు ఒక్కసారిగా మన చెయ్యి వదిలించుకొని వేరే చెట్లవైపు పరుగెత్తి అక్కడే ఆడతామని మొండికేస్తాడు. ఆ చెట్టు ఈ పిల్లవాడిని తన దగ్గరకు పిలవడమే దీనికి కారణం. పిల్లవాడి ఆత్మ ఆ చెట్టునుంచి వచ్చిన సందేశాన్ని తేలికగా గ్రహించి అటువైపే పరుగెడతాడు. చిన్న పిల్లలే కాదు, సాధన మార్గంలో ఉన్నవారు సత్కార్యాలను చేసేవారు, ఎప్పుడూ ప్రశాంత మనస్సుతో ఉండేవారు, ఇతరులకు సహాయపడేవారు కూడా ఇలా చెట్ల నుంచి వచ్చే సందేశాలను తేలికగా గ్రహించగలుగుతారు.

23

మన చుట్టూ ఉండే ప్రకృతి మొత్తం మనకి ఎప్పుడు ఎన్నో సందేశాలు ఇస్తూ ఉంటుంది. దురదృష్టం ఏమిటంటే ఇవేమి మనం గ్రహించలేకపోవడం. మానవుడు కొన్ని వేల సంవత్సరాలుగా ప్రకృతికి దూరమై ఆ సంకేతాలను అందుకోలేకపోతున్నాడు. ప్రకృతిని విధ్వంసం చేస్తూ ప్రకృతికి మరింత దూరంగా వెళ్ళిపోతున్నాడు. దీని వలననే మానవుడి బుద్ధి కూడా నెగిటివ్ గా తయారయ్యి అన్నీ దుష్కర్మలే చేస్తున్నాడు.

మీరు ఎప్పుడైనా గమనించండి. నిత్యం పొలాలలో పనిచేసి, ఆ విధంగా ప్రకృతితో ఎంతో సన్నిహితంగా గడిపేవారి మనస్సు ఎంత ప్రశాంతంగా ఉంటుందో. అంతేకాదు వారు ప్రకృతిలో ప్రతీ చిన్న మార్పుని తేలికగా గ్రహించగలుగుతారు. ఆకాశం వంక చూసి ఎంతసేపట్లో ఎంత వర్షం పడుతుందో చెప్పగలుగుతారు. ఇది మన తాతల తరాల వారు అందరూ చెప్పేవారు. వారు ప్రకృతితో మమేకమై జీవించేవారు. ప్రకృతిలోని మార్పులను ఇట్టే గ్రహించేవారు. దానికి తగ్గట్టుగా జీవనం సాగించేవారు.

అసలు ప్రకృతి మనకు ఎన్నో ప్రశ్నలకు సమాధానం ఇస్తుంది తెలుసా! ఆ ప్రకృతిలో ఎంతో అద్భుతమైన కాస్మిక్ ఎనర్జీ ఉంటుంది. రకరకాల పండ్ల చెట్లు, పూల మొక్కలు, ఇవన్నీ కాస్మిక్ ఎనర్జీని ప్రసురింపచేస్తూ ఉంటాయి. మీకు ఎప్పుడైనా ఏదైనా పెద్ద సమస్య వచ్చిందనుకోండి ఆ సమస్య నుంచి ఎలా బయటపడాలా అనేదొకటే ఆలోచిస్తూంటారు. ఏం చేయాలో తోచదు. ఆ సమస్య నుంచి ఎలా బయటపడాలో ఒకంతట అర్థం కాదు. అప్పుడు మీరు బయటకువెళ్ళి పచ్చని చెట్లు ఉన్న ప్రదేశంలో కాసేపు కూర్చోండి. కాసేపటికల్లా ఈ సమస్యకు సమాధానం దొరుకుతుంది. ఆ సమస్యనుండి ఎలా బయటపడాలో మీ మనస్సుకి వెంటనే స్ఫురిస్తుంది.

ఇది ఎలా జరుగుతుందో తెలుసుకుంటే ఎంతో ఆశ్చర్యం కలుగుతుంది. ఈ విశ్వం అంతా ఇచ్చే కాస్మిక్ ఎనర్జీని ఎలా గ్రహించాలో మనకు తెలియదు. పూర్వకాలంలో ఋషులు తపస్సు ద్వారా ఈ కాస్మిక్ శక్తిని తమలో ప్రవహింపచేసుకునే వారు. ఎంతో శక్తివంతులు అయ్యేవారు. మనం కూడా ఆ కాస్మిక్ శక్తిని వారంత స్థాయిలో కాకపోయినా కొంతైనా గ్రహించవచ్చును. మన కంటికి కనబడని ఈ కాస్మిక్ తరంగాలు ఎప్పుడూ ఈ విశ్వంలో ఉంటాయి.

ఈ కాస్మిక్ తరంగాలు కొన్ని ప్రదేశాలలో చాలా ఎక్కువగా ఉంటాయి. తిరుమల, శ్రీరంగం, కాశీ, హరిద్వార్ వంటి పవిత్ర పుణ్యక్షేత్రాలలో ఈ కాస్మిక్ తరంగాలు ఎంతో ఉన్నత స్థాయిలో ఉంటాయి. అందుకే మనకు ఆ పుణ్యక్షేత్రాలలో ఉన్నప్పుడు మనస్సు ఎంతో ప్రశాంతంగా ఉంటుంది. అటువంటి ప్రదేశాలలో కూర్చునప్పుడు మన మనస్సు ప్రకృతి నుంచి వచ్చే సందేశాలను బాగా గ్రహించగలుగుతుంది. అప్పుడు మన మనస్సులో ఉన్న ఏ సమస్యకైనా పరిష్కారం వెంటనే స్ఫురిస్తుంది. ఇది ఎలా జరుగుతుంది? ఎన్నో రోజులనుంచి సమాధానం దొరకని ఆ సమస్యకు ఇప్పుడు ఎలా సమాధానం దొరికింది? ఎందుకంటే ఇక్కడ ప్రకృతి అంతా ఎంతో ప్రశాంతంగా ఉండడంతో మీ ఆత్మకి ప్రకృతి ఇచ్చిన సందేశం తేలికగా అర్థమయింది. అందుకే మనకు సమాధానం వెంటనే స్ఫురించింది.

మనం అందరం ఒక విషయం తెలుసుకోవాలి. ఈ ప్రకృతి మనకు ఎంతో సహాయపడాలని చూస్తుంది. అసలు మన జీవన ఆధారానికి

ముఖ్యం ఈ పంచభూతాలే కదా! చెట్లు, నీరు ఇవన్నీ లేకపోతే మన మనుగడ లేదు. ఎప్పుడైతే మనం ప్రశాంతంగా ప్రకృతిని ఆరాధిస్తూ, స్మరిస్తూ, నిశ్చల మనస్సుతో ఉంటామో అప్పుడు మనం ప్రకృతి నుంచి వచ్చే సందేశాలను తేలికగా గ్రహించగలుగుతాము. వెంటనే మన సమస్యలన్నింటికి పరిష్కారం అర్థమవుతుంది. అందుకే గమనించండి మీరు ఎప్పుడైనా పుణ్యక్షేత్రాలకు వెళ్ళినప్పుడు మీకు ఉన్న ఎన్నో సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. అక్కడ ఉన్న కాస్మిక్ తరంగాల మహిమవలనే ఇది సాధ్యమవుతుంది.

మనలను మన పెద్దలు మనం కష్టాలలో ఉన్నప్పుడు ఏదైనా పుణ్యక్షేత్రానికి వెళ్ళి ఒక మూడురోజులో, ఇంకా కొద్ది రోజులో నిద్ర చేయమంటారు. ఎందుకంటే అలా కొన్ని రోజులు మనం ఆ పుణ్యక్షేత్రంలో గడపడం వలన అక్కడ ఉన్న దేవత యొక్క తేజస్సు ద్వారా ఆ ప్రదేశంలో ప్రసరిస్తున్న కాస్మిక్ తరంగాల ప్రభావం చేత మన అనారోగ్యం పూర్తిగా నయం అవుతుంది. ఎప్పుడైతే ఆ దివ్యక్షేత్రంలో కొన్ని రోజులు ఉంటామో అప్పుడు ఆ దివ్య తరంగాలు మన శరీరమంతా ప్రవహించి మనం పూర్తి ఆరోగ్యవంతులమయ్యి, ఎంతో ఉత్సాహంతో ఇంటికి వస్తాము.

24

ఇక్కడ ఇంకొక అద్భుతమైన విషయం కూడా మీకు చెప్పాలి. సామాన్య మానవులకి ఈ కాశ్మిక్ ఎనర్జీని గ్రహించడం అంత తేలిక కాదు. కాని గొప్ప గొప్ప సాధకులకు ఇది చాలా తేలిక. మీకు తెలిసిన ఎవరైనా గొప్ప గురువు ఉంటే వారి సమక్షంలో కూర్చున్నప్పుడు వారి అనుగ్రహం మీపై ఉంటే వారు ఈ కాశ్మిక్ తరంగాలను తమ శక్తి ద్వారా మీలో ప్రసరింపచెయ్య గలుగుతారు. అందుకే మన పెద్దలు గురువులను ఆశ్రయించమని చెప్తారు. అలా ఆశ్రయిస్తే ఆ గురువులు మనల్ని అనుగ్రహించి ఈ ప్రకృతిలో ఉన్న కాశ్మిక్ శక్తిని మనలో ప్రవహింపచేసి మనకు ఎటువంటి అనారోగ్యం ఉన్నా క్షణంలో తొలగిస్తారు. మన శరీరంలోకి ఎంతో తేజస్సు వచ్చినట్లు మనకు గ్రహింపు కలుగుతుంది.

మనం గురువుల సమక్షంలో కాసేపు కూర్చున్నా చాలు. ఆ దివ్య తరంగాలు మనలో కూడా ప్రవహిస్తాయి. అసలు ఎంతో గొప్ప గురువుల చుట్టూ ఈ దివ్య తరంగాలు ఎప్పుడూ ఉంటాయి. అందుకే వీరు ఎంతో తేజస్సుతో కనిపిస్తుంటారు.

మనం నమ్ముకున్న గురువు చాలా గొప్పవారు అయితే వారు ఈ విశ్వంలో ఎక్కడ ఉన్నా మీపై ఈ కాశ్మిక్ శక్తిని ప్రసరింపచేయగల్గుతారు. మీరు ఏ అమెరికాలోనో ఉండి, మీరు నమ్ముకున్న గురువు భారతదేశంలో ఏ మూలనో ఒక చిన్న పల్లెటూరులో ఉన్నాసరే, మీరు ఆ గురువును మనస్ఫూర్తిగా ధ్యానిస్తే, ఆ గురువు వెంటనే మీపై ఆ దివ్య తరంగాలను ప్రసరింపచేస్తారు. అప్పుడు మీ మనస్సు ఎంతో ప్రశాంతంగా ఉంటుంది. ఇలా అప్పుడప్పుడు ఆ గురువును ఇలా ధ్యానిస్తూ ఉంటే మీలో దివ్యమైన కాశ్మిక్ తరంగాలు ప్రవహించి మీరు ఎంతో శక్తివంతంగా, ఎంతో ఆరోగ్యంగా ఉండగలుగుతారు.

అయితే మీరు ఇంతటి గొప్ప గురువును గుర్తించగలగాలి. మనకు తెలిసిన శ్రీ షిరిడిసాయిబాబా, శ్రీ రమణ మహర్షి, శ్రీ మహావతార్ బాబాజీ, శ్రీ లాహిరి మహాశయ వంటి మహానుభావులు ఇటువంటి గురువులే! అంతటి మహనీయులు వారి భౌతిక శరీరాలను విడిచిపెట్టినా వారు మన ప్రార్థనలను ఎప్పుడూ స్వీకరిస్తారు. మన సమస్యలను ఎప్పటికీ తీరుస్తూ ఉంటారు. వారు ఈ భూమిపై నడచిన కాలంలో వారిని ప్రత్యక్షంగా దర్శించుకున్న భక్తులు ఎంతో అదృష్టవంతులు. ఎన్నో జన్మల పుణ్యం చేసుకున్నవారు. అయితే మనం ఈ కాలంలో ఉన్నా వారిని స్మరించినంత మాత్రాన్నే వారు మనల్ని అనుగ్రహిస్తారు. వారు అంతటి మహనీయులు.

ప్రస్తుత కాలంలో కూడా అటువంటి మహనీయులు మన మధ్య ఉన్నారు. ఇంతకు ముందు కాలంలో అటువంటి మహానుభావులు ప్రత్యక్షంగా ప్రజల మధ్య ఉంటూ, ఎన్నో బోధలు చేస్తూ ఉండేవారు. కాని ఇప్పుడు కలి ప్రభావం విపరీతంగా పెరగడం వలన అటువంటి మహనీయులు ఇక ప్రత్యక్షంగా కనపడరు. మన మధ్యనే అతి సామాన్య వ్యక్తులు లాగా వీరు జీవిస్తారు. ఈ మానవాళి మంచి కోసం కొంతకాలం ఈ భూమిపై నివసించి, అతిసామాన్యులవలె కనబడుతూ తిరిగి వారి లోకాలకు వెళ్ళిపోతారు. ఎన్నో జన్మల పుణ్యఫలం వలన మాత్రమే మనం అటువంటి మహానుభావులను గుర్తించగలుగుతాము. అలా వారిని గుర్తించిన వారు ఎంతో అదృష్టవంతులు. ఎంతో పుణ్యాత్ములు.

అటువంటి మహనీయులు ఇంతకుముందు చెప్పినట్లుగా అతి సామాన్య జీవన విధానంలో ఉంటారు. అంతే కాదు మనందరిలాగే అన్ని కష్ట–సుఖాలు అనుభవిస్తారు, సామాన్యులవలె భౌతిక బాధలు పడుతూ ఆవేశకావేషాలకు లోనై అత్యంత సామాన్యులుగా ప్రవర్తిస్తుంటారు. ఇదంతా మనందరిని వారు మభ్యపెట్టడానికే! మనందరిని ఒక మాయలో పడవెయ్యడానికే అని గ్రహించండి. వారు అనేకసార్లు ఎంతో విచిత్రంగా ప్రవర్తిస్తూ మనలాగే కోపం, సంతోషం కలిగి ఉంటారు. అయితే ఇదంతా వారు బయట ప్రపంచానికి తమ గురించి తెలుసుకోకుండా ఉండేందుకే ఇలా ప్రవర్తిస్తారు.

మనం అటువంటి వారిని నిశితంగా పరిశీలిస్తూ, ఎటువంటి తర్కానికి తావివ్వకుండా, వారు బాహ్యంగా ఉండే విధానాన్ని గురించి ఆలోచించకుండా, ఆ ప్రభావం మన ఆలోచనలపై పడనీయకుండా ఉంటే మనం అటువంటి మహనీయులను తప్పక గుర్తించగలుగుతాము. మనం వారిని గుర్తించి, వారిని ఆశ్రయించి మన జన్మ సార్థకం చేసుకోవాలి.

ఇందాక చెప్పినట్టుగా వీరి చేష్టలు చాలా విచిత్రంగా ఉంటాయి. అయితే మనం ఏ తర్కానికి తావివ్వకుండా అటువంటి మహనీయులను సేవించుకోవాలి. వారు మీ వద్ద నుంచి ఒక పెన్నో, పెన్సిలో అడిగి తీసుకున్నారంటే అక్కడితో మీ జన్మ జన్మల ప్రారబ్దం తొలగిపోయినట్లే అని గ్రహించండి. వారు మీ వద్దనుంచి ఏ పదార్థమైనా తీసుకొని తిన్నారంటే మీ జన్మ జన్మల ప్రారబ్ధాన్ని వారు ఆ క్షణంలోనే క్షయం చేసినట్లు గ్రహించండి. ఇటువంటి మహానుభావులను గుర్తించి, సేవించి మన జన్మ ధన్యం చేసుకోవాలి.

మన పూర్వజన్మ సుకృతాలని బట్టి ఈ మహనీయులను మనం గుర్తించగలుగుతాము. మనం ఎన్నో జన్మల పుణ్యం చేసుకొని, ఎన్నో జన్మల నుంచి సద్గురువు కోసం విపరీతమైన ఆర్తితో అన్వేషిస్తున్నట్లయితే అప్పుడు మనం వీరిని గుర్తించగలుగుతాము. అటువంటి గురువులను మీరు గ్రహించగలిగితే మీ అదృష్టానికి, మీ భాగ్యానికి ఎంతో సంతోషపడండి. అయితే ఎటువంటి పరిస్థితిలోను గర్వం తెచ్చుకోకండి. అతి సౌమ్యంగా ప్రవర్తించండి. మీరు గుర్తించిన ఆ గురువును మీకు వీలున్నంత సేవించండి. వారి సమక్షంలో మీరు

ఒక గంట గడిపినా ఎన్నో జన్మల ప్రారబ్ధకర్మ పూర్తిగా నశిస్తుంది. వారికి తెలియని విద్య అంటూ ఉండదు. వీరు ఎంతో శక్తివంతులు వీరిలో చాలామంది సాక్షాత్తు ఆ భగవంతుడి అంశతోనే జన్మించినవారై ఉంటారు.

అందుకే అటువంటి మహనీయులతో మాట్లాడుతున్నా, వాళ్ళతో కాసేపు గడిపినా మన మనస్సుకు ఎంతో ఆనందం కలుగుతుంది. మన శరీరం ఎంతో అనిర్వచనీయమైన అనుభూతికి లోనౌతుంది.

25

మన చుట్టూ నిత్యం ఎన్నో డైమెన్షన్స్ ఉంటాయి. అంటే ఎన్నో ప్లేన్‌లు అన్నమాట. అంటే వేరే లోకాలువంటివి. ఈ జీవకోటి మొత్తం మన కంటికి కనబడే ఒక ప్లేన్‌లో ఉంది. ఇలా మన కంటికి కనపడే ప్రపంచంతో పాటు అనేక ప్లేన్‌లు అంటే అనేక లోకాలు మనతోపాటే ఉన్నాయి. ఈ ప్లేన్‌లలోనే సిద్ధులు, యోగులు ఉంటారు. మనం అనుకునే ఈ లోకాలన్నీ ఎక్కడో ఆకాశంలో ఎక్కడో పైన ఉండవు ఇవన్నీ ఎప్పుడూ మనతోపాటే ఉంటాయి. కాని మనమెవ్వరము ఆ ప్లేన్‌లలోకి వెళ్ళలేము. ఈ విషయం మనం బాగా గుర్తించుకోవాలి.

మనకి తెలిసిన గొప్ప మహర్షులు, గొప్ప యోగులు ఒక ప్లేన్‌లో ఉంటారు. మరొక ప్లేన్‌లో దేవతలు ఉంటారు. దేవతలు కూడా అనేక ప్లేన్‌లలో ఉంటారు. అన్నిటికంటే ఉన్నతమైన ప్లేన్ దాటి ఈ సృష్టిమొత్తానికి కారణభూతమైన మహాశక్తి ఉంటుంది. ఆ మహాశక్తియే ఈ ప్లేన్స్ అన్నిటికి ఆధారం. ఈ సృష్టి మొత్తానికి మూలకారణం. ఆ మహాశక్తియే ఈ సృష్టి మొత్తాన్ని

సృజించింది. మనకంటికి కనబడేవి, కనబడనివి అన్నింటిని సృష్టించింది ఆ మహాశక్తియే! ఈ సృష్టిలో మనకంటికి కనబడుతున్న ఈ ప్రపంచం, ఆకాశంలో కనబడుతున్న నక్షత్ర మండలాలు, గ్రహమండలాలు అన్నీ ఆ మహాశక్తి ఆదేశం ప్రకారం, అనుగ్రహంతో తమతమ కక్ష్యలలో పరిభ్రమిస్తున్నాయి.

ఇంత గొప్పదైన మహాశక్తి ఎంత శక్తివంతమైనదో అసలు ఊహించడం కూడా కష్టం. దేవతలు కూడా ఆ మహాశక్తిని కొంతమేరకు మాత్రమే అర్థం చేసుకొనగలుగుతారు. మహర్షులు, యోగులు ఆ మహాశక్తిని కొంతమేరైన తెలుసుకొనడం కోసమే నిత్యం తపస్సు చేస్తూ ఉంటారు.

మనం నిద్రపోయినపుడు కలలు వస్తుంటాయి కదా! ఆ కలలలో మనం ఎన్నో అద్భుత సంఘటనలు చూస్తూంటాము. అసలు ఈ భౌతిక ప్రపంచంలో ఊహించలేని విషయాలు ఆ ప్రపంచంలో చూస్తాం. ఆ కలలు లోకం మరొక ప్లేన్ అన్నమాట. ఆ ప్లేన్‌లో జరగలేనిది ఏదీ ఉండదు. ఆ ప్లేన్‌లో దేనికి పరిమితులు లేవు. మన వెనుక తరాలవారిని కూడా ఒక్కోసారి కలల్లో మనం చూస్తాం. వారితో మాట్లాడుతాం. ఈ కలలు ఒకోసారి చాలా బాధాకరంగా ఉంటాయి. ఒకోసారి సంతోషకరంగా ఉంటాయి. అలా జరుగుతున్నంతసేపు మనకు అది నిజమే అనిపిస్తుంది. అంతే కాదు మనకు మెలకువ వచ్చిన తరువాత కూడా ఆ కలల ప్రభావం మన శరీరం మీద ఉంటుంది. రాత్రి వచ్చిన కల బాధాకరమైనది అయితే ఆ రోజంతా చికాకుగా ఉంటుంది. సంతోషకరమైనది అయితే ఆ రోజంతా ఎంతో ఉత్సాహంగా ఉంటాం.

మనకు ఈ భౌతిక ప్రపంచంలో తీరని కోరికలెన్నో ఆ కలల ప్రపంచంలో జరుగుతాయి. ఆ ప్లేన్ ఎప్పుడూ మనతోపాటే ఉంటుంది. అందుకే రాత్రి పగలుతో సంబంధం లేకుండా, మనం ఉండే ప్రదేశంతో సంబంధం లేకుండా, మనం ఆ కలల ప్లేన్‌లోకి ఎంతో తేలికగా వెళ్ళగలుగుతాము. ఆ ప్లేన్‌లో మనకు ఎన్నో అనుభూతులు కలుగుతుంటాయి.

దేవతలందరూ ఇంకా ఉన్నతమైన ప్లేన్‌లలో ఉంటారు. మహర్షులు, యోగులు తమ తపోబలంచేత ఆ దేవతల లోకంలోకి వెళ్ళగలుగుతారు. సామాన్య మానవులైన మనం కూడా ఒకోసారి ఆ దేవతల

ప్లేన్‌లోకి కొన్ని క్షణాలు వెళ్ళడం సంభవిస్తుంది. ఎలాగంటే ఒకోసారి మనం ఏదైనా గొప్ప పుణ్యక్షేత్రానికి వెళ్ళినపుడు అక్కడ కూర్చొని ఉన్నప్పుడు, లేదా క్యూలైన్‌లో ఆ దేవత దర్శనానికి వెళుతున్నప్పుడు ఒకోసారి మనకు ఒక్కసారిగా కొన్ని క్షణాల పాటు ఒళ్ళు జలదరించినట్లు ఒక గొప్ప అనుభూతి కలుగుతుంది.

ఇలా ఎందుకు జరిగిందో అని మనకు అర్థం కాదు. కొన్ని క్షణాల పాటు మనం దేవతల డైమెన్షన్‌లోకి వెళ్ళాము అన్నమాట. ఇది మనకు తెలియకుండానే జరుగుతుంది. ఈ అనుభూతి సాధారణంగా మనం ఎంతో ఎక్కువ శక్తి తరంగాలు ఉండే ప్రదేశాలలో ఎక్కువగా పొందుతాము. అంటే గొప్ప గొప్ప పుణ్యక్షేత్రాలు, హిమాలయాలు వంటి సిద్ధులు, యోగులు సంచరించే ప్రదేశాలలో ఈ దేవతల డైమెన్షన్‌లోకి వెళ్లడం కొంచెం తేలికగా, సామాన్య మానవులకి కూడా కొద్దిపాటి సాధనతో అనుభవంలోకి వస్తుంది.

అయితే ఇలా వెళ్లిన వ్యక్తి పూర్వజన్మలలో ఎన్నో పుణ్యకార్యాలు చేసి ఉంటాడు. ఆ పుణ్యఫలం చేత మనం ఈ జన్మలో అతి సాధారణ జీవితం గడుపుతున్నప్పటికి మనకి ఈ దివ్య అనుభూతులు కలుగుతాయి. అందుకే ఒకోసారి మనం మన బంధువులకు గాని, స్నేహితులలో గాని అతి సామాన్యంగా కనిపించే వారికి కూడా ఇటువంటి అద్భుత అనుభూతులు కలగడం గమనిస్తుంటాము.

ఒక్కొక్కసారి మనం ఏదైనా కొండలు ఎక్కుతున్నప్పుడు మధ్య దారిలో అలిసి, ఎక్కడో ఒకచోట కాసేపు కూర్చుంటాము. మనకుగొప్ప అనుభూతి కలుగుతుంది. దీనికి కారణం ఎన్నో వేల సంవత్సరాల క్రితం ఆ ప్రదేశంలో ఎవరో గొప్ప మహర్షి తపస్సు చేసి ఉంటాడు. ఆ తపస్సు ప్రభావం నేటికి ఆ ప్రదేశంలో ఉండడం వలన ఇప్పటికి అక్కడ గొప్ప కాశ్మిక్ తరంగాలు ఉంటాయి. మనం ఆ ప్రదేశంలో ఏమి తెలియకుండా కూర్చున్నప్పుడు లేదా కొన్ని రోజులు ఉన్నప్పుడు మన మనస్సు ఎంతో ఉల్లాసంగా ఉంటుంది. అంతేకాదు మనం ఒకోసారి ఆ మహర్షుల ప్లేన్‌లోకి వెళ్ళివస్తాము. ఇదంతా మనకు తెలియకుండా జరుగుతుంది. అందుకే ఒకొక్కసారి మనం ఏదైనా కొండలపైన విహారయాత్రకు వెళ్ళి అక్కడ కొన్ని రోజులు ఉన్నప్పుడు మనకు అద్భుత అనుభూతులు కలుగుతాయి.

అలాగే మన జీవితాలలో మనం గమనించే మరొక విశేషం ఉంటుంది. మనకు తెలిసిన కొంతమంది తాము అప్పుడప్పుడు దేవతలను దర్శించామని, గొప్ప యోగులను చూస్తున్నామని, ఒక్కోసారి వారితో సంభాషిస్తున్నామని చెప్తారు. మనలో చాలామందికి ఇవన్నీ అంత నమ్మసక్యంగా అనిపించదు. కాని ఇది నిజమే! ఎన్నో జన్మలలో ఎంతో సాధన చేసిన కొంతమందికి ఇలా గొప్ప యోగులు అప్పుడప్పుడు దర్శనమిస్తుంటారు. అందువలననే ఈ జన్మలో వీరు అలా ఒకోసారి వారి ప్రయత్నం లేకుండానే ఆ యోగులు, సిద్ధులు ఉండే ప్లేన్‌లలోకి వెళుతుంటారు. అక్కడ మహనీయులను దర్శిస్తారు.

సాధారణంగా ఇటువంటి అనుభూతులు చాలా మందికి కొంతకాలం ఉండి తరువాత ఉండవు. ఎక్కడో అతి తక్కవమంది తాము జీవించినంత కాలం ఇలాంటి దివ్య అనుభూతులు పొందుతుంటారు. వీరికి ఆ మహర్షులనుంచి ఎన్నో సందేశాలు వస్తుంటాయి. వీరి ఆత్మలు ఆ సందేశాల్ని గ్రహించి వీరు వాటికి అనుగుణంగా ఈ లోకంలో ఎన్నో గొప్ప పనులు చేస్తారు. ఈ పనులన్నీ వీరికి ఏ అడ్డంకులు లేకుండా విజయవంతంగా జరగడానికి ఆ మహర్షులు, సిద్ధులు ఎప్పుడూ సహాయం చేస్తుంటారు.

ఈ ప్రపంచంలో జరగుతున్న ఎన్నో గొప్ప పనులు కొందరి మహనీయుల ద్వారా జరుగుతున్నవే. అయితే వీరు వేరే ప్లేన్స్‌లో ఉండి ఈ ప్రపంచంలో ఎన్నో చోట్ల గొప్ప గొప్ప కార్యాలు జరిగేలా తాను ఎంచుకున్న సాధకులకు సందేశాలు పంపిస్తూ ఆ పనులు నెరవేరేలాగ చూస్తుంటారు. వైద్యరంగంలో గొప్ప గొప్ప ఆవిష్కరణలు ఈ విధంగా వేరే ప్లేన్‌లో ఉన్న ఎవరో మహనీయుడు ఎంతో పుణ్యఫలం చేసుకున్న ఒక రీసెర్చ్ సైంటిస్టుకు గాని లేదా ఒక గొప్ప డాక్టర్‌కు గాని సందేశాన్ని పంపించి ఆ ఆవిష్కరణలు వారికి స్ఫురించేలాగా సందేశాన్ని పంపించి మానవాళి సుఖంగా జీవించేలాగ చూస్తారు.

26

ఒక్కొక్కప్పుడు నేను ధ్యానంలో ఉండగా ఎన్నో యుగాలలో జరిగిన అనేక అద్భుత సంఘటనలు నా కంటికి కనిపిస్తాయి. ఇక్కడ మనందరం గమనించవలసిన విషయం ఒకటుంది. సాధారణంగా ఏ దృశ్యమైనా కనబడాలంటే ఎంతో కొంత కాంతి అవసరం. కాని మనం కనులు మూసుకున్నప్పుడు కూడా ఒక్కొక్కసారి మనకు ఎన్నో దృశ్యాలు కనిపిస్తుంటాయి. ఇది ఎలా సాధ్యం అని మనకు అనిపించవచ్చు. పూర్తిగా కన్నులు మూసుకొని మీరు పూర్తి చీకటి గదిలో కూర్చుని ఉన్నా మీరు కొన్ని దృశ్యాలు చూడగలుగుతారు. ఇది ఎలా సాధ్యం అని మనకు చాలా ఆశ్చర్యం వేస్తుంది. బయట కాంతి లేకుండా ఇన్ని దృశ్యాలు మనకి ఎలా కనబడుతున్నాయి.

దీనికి కారణం మన హృదయంలో ఉన్న అంతరాత్మయే! సాక్షాత్తూ ఆ భగవంతుడే మనందరి హృదయాలలో అంతరాత్మ రూపంలో ఉంటాడు. ఆ అంతరాత్మ నుండి విపరీతమైన తేజస్సు ప్రసరిస్తూంటుంది. ఆ తేజస్సు యొక్క కాంతితో మనం ఎన్నో దృశ్యాలను చీకటిలోకూడా మన మనో నేత్రంతో చూడగలుగుతాము.

మహా పురుషులు ఆ తేజస్సుతో, దాని ద్వారా వచ్చే అద్భుత కాంతితో ఎన్నో వందల సంవత్సరాల వెనకాల జరిగిన సంఘటనలు కూడా చూడగలుగుతారు. ఋషులు, యోగులు ఇలా తమలోని అంతరాత్మ తేజస్సుతో అనేక యుగాలలో జరిగిన సంఘటనలు దర్శించి మనకు పురాణాల రూపంలోను, ఉపనిషత్తుల రూపంలోను మనకు అందించారు. వారు ఏ కాలంలో ఉన్నప్పటికి ఎన్నో వేల సంవత్సరాల క్రితం జరిగిన సంఘటనలు కూడా వివరంగా వ్రాయగలిగారు. అన్ని విషయాలు వారి అంతర్మాతల నుండి వెలువడే దివ్య తేజస్సుతోనే వారు దర్శింపగలిగారు. ఆ దివ్య తేజస్సు నుండి వచ్చే అద్భుత కాంతి పుంజాలతో ఎన్నెన్నో యుగాలలో జరిగిన సంఘటనలు అన్నీ చూడగలిగారు.

ఒకరోజు నేను ధ్యానంలో ఉన్నప్పుడు ఒక్కసారిగా ఎన్నో యుగాలలోకి వెళ్ళడం జరిగింది. కనులు మూసుకొని కాసేపు ఆ పురుషోత్తముని ధ్యానించగానే నా ముందు ఎన్నో యుగాలు ఒక దృశ్య ప్రవాహం లాగా కనిపించసాగాయి. ఆ యుగాలలో జరిగిన సంఘటనలన్నీ ఎంతో చక్కగా చూడగలుగుతున్నాను. నాకు కనబడిన దృశ్యం వివరిస్తున్నాను చూడండి.

ఈ అధ్యాయం రాస్తున్నప్పుడు నేను కనులు మూసుకొని మళ్ళీ ఆ యుగాలలోకి వెళ్ళడం జరిగింది. ధ్యానంలో నాకు కనబడినవన్నీ ఇక్కడ వివరిస్తున్నాను. హృదయంలో ఉన్న అంతరాత్మయొక్క దివ్య తేజస్సు చేత ఆ అద్భుత కాంతిలో అన్ని యుగాలు నా ముందు కనబడుతున్నాయి. ద్వాపరయుగం కనిపించింది.

అదిగో చూడండి చిన్న కృష్ణుడు ఎంత చక్కగా ఆడుకుంటున్నాడో చుట్టూతా ఎందరో గోప బాలురు అందరూ ఇటు అటు పరుగెడుతూ ఆడుకుంటున్నారు. కృష్ణయ్య తన మురళి ఎంతో మధురంగా ఊదుతున్నాడు. ఆ మురళి గానానికి, అప్పుడు వస్తున్న దివ్య తరంగాలకి అక్కడ ఉన్న ప్రకృతి అంతా ఎంతో పులకిస్తోంది. చెట్లపై పక్షులు ఆనందంతో పాటలు పాడుతున్నాయి. గోప బాలురు ప్రక్కన చెట్లపై నుంచి నేలకు వాలి కొన్ని నెమళ్ళు ఎంతో అద్భుతంగా నృత్యం చేస్తున్నాయి. గోప బాలురులో కూడా కొందరి వద్ద వేణువులు ఉన్నాయి. వారిలో కొంతమంది కూడా వేణువు ఊదుతున్నారు. కృష్ణయ్య కాసేపు తన వేణుగానం ఆపి తన స్నేహితుల వేణుగానం వింటున్నాడు. ఆ పిల్లలు ఎంతో

మురిసిపోతున్నారు. శ్రీకృష్ణుని చుట్టూ ఉన్న స్నేహితులలో కొందరిని నేను తరువాత జన్మలలో ఈ కలియుగంలో గొప్ప వేణు విద్వాంసులుగా గ్రహించాను.

ఇంతలో శ్రీకృష్ణుడు తన వేణువును తన స్నేహితులకిచ్చి కాసేపు ఊదమన్నాడు. నలుగురైదుగురు చిన్ని కృష్ణుని వేణువును ఎంతో అద్భుతంగా ఊదారు. క్రిష్ణయ్య తన స్నేహితులను చూసి ఎంతో మురిసిపోయాడు. ఆ వేణువును మళ్ళీ తాను తీసుకొని చిన్న రాయిమీద కూర్చుని ఊదసాగాడు. ఇంతలో ఎక్కడ నుంచో ఒక చిన్న పక్షి వచ్చి చిన్ని క్రిష్ణుని భుజం మీద వాలింది. క్రిష్ణయ్య ఆ పక్షి వంక చిరునవ్వుతో చూసాడు. ఆ పక్షి ఎంతో సంతోషపడుతూ చిన్న చిన్న కూతలు చేసింది.

ఆ పక్షి మరెవరో కాదు. సాక్షాత్తూ స్వర్గలోకంలోని ఇంద్రుడే. చిన్ని క్రిష్ణుని వేణుగానం వినడానికి అలా కాసేపు పక్షి రూపంలో వచ్చి ఆనందించాడు. చిన్ని క్రిష్ణుడు చిరునవ్వు నవ్వగానే కాసేపటి తరువాత ఎగిరి వెళ్ళిపోయాడు. క్రిష్ణుడితో ఆడుతున్న పిల్లలకి ఈ పక్షి ఇలా రావడం క్రిష్ణయ్య భుజం మీద కూర్చోవడం ఎంతో ముచ్చట వేసింది.

ఇంతలో ఆకాశం నుండి సన్నటి జల్లు ప్రారంభం అయింది. ఆ జల్లులోనే తడుస్తూ క్రిష్ణయ్య, గోప బాలురందరు ఎంతో అద్భుతంగా వేణువుని ఊదుతున్నారు. ఇదంతా వినడానికి చెవులకు ఎంతో శ్రావ్యంగా ఉంది. వీరి అందరి వేణుగానంతో పాటు ఆ చినుకులు నేలపై పువ్వులపైన, క్రింద గడ్డిపైన పడుతుంటే ఈ రెండు ధ్వనులు కలిసి ఎంతో దివ్య అనుభూతిని కలుగజేస్తున్నాయి.

ఇంతలో అక్కడికి ఒక చిన్న కోతుల గుంపు వచ్చింది. వాటిని చూడగానే ఈ గోపబాలురందరికి ఎంతో సంతోషం కలిగింది. అప్పుడు చిన్ని క్రిష్ణుడు వాటి వద్దకు వెళ్ళి వాటిని చేతితో నిమిరాడు. అక్కడితో అవన్నీ అద్భుత సౌందర్యంతో మెరిసిపోతున్న అప్సరసలుగా మారారు. వారిని చూస్తూ ఈ పిల్లలందరూ ఎంతో ఆశ్చర్యపోయారు. చిన్ని క్రిష్ణుడికి ఆ వచ్చిన వారు ఎవరో తెలుసు. అందుకే మరల కాసేపు ఎంతో అద్భుతంగా వేణువు ఊదాడు. అప్పుడు ఆ అప్సరసలందరు ఆ వర్షపు జల్లులోనే ఎంతో అద్భుతంగా నాట్యం చేశారు. వారందరూ దేవలోకాలనుంచి వచ్చిన అప్సరసలే. భూలోకంలో వెలసి అందరిని ఆనందపెడుతున్న ఆ పురుషోత్తముని దర్శించడానికి ఇలా వచ్చారు.

అలా కాసేపు అయిన తరువాత వారందరూ అటు ఇటు నాట్యం చేస్తూ చెట్ల ప్రక్కకి వెళ్ళి మాయమయ్యారు. ఇంతలో ఒకరిద్దరు గోప కాంతలు క్రిష్ణుని వెతుకుతూ ఇటు వచ్చారు. అయితే ఆశ్చర్యంగా అక్కడ క్రిష్ణుడు గాని గోప బాలురు గాని వారి కంటికి పక్షుల వలే కనిపిస్తున్నారు. అక్కడితో ఆ గోప కాంతలు ఇక్కడ క్రిష్ణుడు, అతడి స్నేహితులు లేరని తిరిగి వెళ్ళిపోయారు.

అటు పిమ్మట క్రిష్ణుడు తన స్నేహితులతో తిరిగి ఇంటికి బయలుదేరాడు. దారంతా ఆడుతూ పాడుతూ ఈ పిల్లలందరూ క్రిష్ణుడి వెనకే వెళుతుంటే ఆ దృశ్యం ఎంతో అద్భుతంగా ఉంది.

ఈ మధ్య ఒకసారి నేను తిరుమల వెళ్ళినప్పుడు అక్కడ నాకు తెలిసిన ఒక మిత్రునియొక్క మిత్రుడు శ్రీరవికుమార్ కలిసారు. వారిని కలవడం ఇదే మొదటిసారి అప్పుడు నా వద్ద ఉన్న నా శ్రీ వేంకటేశ్వర వ్రతకల్పము వారికి ఇచ్చాను. వారు ఎంతో సంతోషపడి ఆ పుస్తకాన్ని కనులకు అద్దుకొని తీసుకున్నారు.

తరువాత కొన్ని రోజులకు ఒకరోజు శ్రీరవికుమార్ నాకు ఫోన్ చేసి ఇలా అన్నారు! విశ్వపతి గారు నేను వృత్తిరిత్యా ఒక ఇంజనీర్ని అయితే నాకు శ్రీకృష్ణుల వారంటే ఎంతో ఇష్టం నా చదువు పూర్తి అయిన తరువాతన మంచి ఉద్యోగంలో చేరాను. వీలున్నప్పుడల్లా అనేక పుణ్యక్షేత్రాలు దర్శించేవాడిని. నాకు చిన్నప్పటి నుంచి వేణువు నేర్చుకోవాలని ఎంతో ఆసక్తిగా ఉండేది.

మా ఇంటి ప్రక్కనే ప్రపంచ ప్రఖ్యాత వేణువు విద్వాంసులు ఉండేవారు. ఒకరోజు వెళ్ళి వారికి నమస్కరించి నాకు వేణువు నేర్పించమని వారిని అర్థించాను. అయితే వారు ఇప్పుడు నీకు నేర్పడం కుదరదు అన్నారు. దానికి నేను ఎంతో నిరుత్సాహ పడ్డాను. కొన్ని రోజుల తరువాత వారిని మళ్ళీ అర్థించాను. అయినా వారు ఒప్పుకోలేదు. ఇలా కొన్ని రోజులు అడగగా అడగగా వారు నాకు వేణువు నేర్పించడానికి అంగీకరించారు. నేనెంతో సంతోషపడ్డాను.

వారు ఒకసారి నాతో నాయనా రవికుమార్ నేను నిన్ను శిష్యుడిగా అస్సలు తీసుకోవాలని అనుకోలేదు. కాని ఏదో శక్తి నన్ను నిన్ను శిష్యుడిగా తీసుకొమ్మని ప్రేరేపించింది అని అన్నారు.

రవికుమార్ నాతో ఇంకా ఇలా చెప్పసాగారు. విశ్వపతిగారు నేను వేణువుని ఎంతో అద్భుతంగా ఊదగలను. ఎందరో పీఠాధిపతుల సమక్షంలో, ఎన్నో ఆలయాలలో ఎన్నోసార్లు వేణునాదం చేసాను. వారందరు ఎంతో సంతోషపడి నన్ను ఆశీర్వదించారు. ఇప్పటికి అనేక దేవాలయ ఉత్సవాలలో నేను వెళ్ళి వేణువు ఊదుతాను. ఇది నా ఎన్నో జన్మల పుణ్యఫలంగా భావిస్తున్నాను అని అన్నారు.

అప్పుడు నేను వారితో రవికుమార్ గారు మీరు ఎన్నో జన్మలలో ఎంతో పుణ్యం చేసుకున్నారు. అందుకే ఈనాడు మీరు ఎన్నో ఆలయాలలోను, ఎందరో మహాత్ముల వద్ద మీ వేణునాదం చేయగలుగుతున్నారు. ఇక్కడ మీకు ఒక విశేషం చెప్తాను. మీరు ద్వాపర యుగంలో సాక్షాత్తు శ్రీకృష్ణులవారి బాల్యస్నేహితులలో ఒకరు. చిన్నప్పుడు క్రిష్ణుడితో ఆడుతూ పాడుతూ వేణువు ఊదేవారు. ఒకనాడు మీరు శ్రీకృష్ణుని వేణువు తీసుకొని కాసేపు మీరు ఆ దివ్య వేణువును ఎంతో శ్రావ్యంగా ఊదారు. అని రవికుమార్‌తో అన్నాను.

వారికి ఒక్కసారి కళ్ళ నీళ్ళు తిరిగాయి. వారు నాతో ఇలా అన్నారు. విశ్వపతి గారు ఇక్కడ మీకు ఒక విశేషం చెప్పాలి. చాలా కాలం క్రితం కంచి మహాస్వామి శ్రీ చంద్రశేఖర సరస్వతి స్వామివారు మా అమ్మగారికి కలలో కనబడి అమ్మా మీ కుమారుడు ఎంతో పుణ్యాత్ముడు. ద్వాపర యుగంలో ఒకసారి సాక్షాత్తూ శ్రీకృష్ణుల వారి వేణువు వీరు కూడా ఊదారు అంతటి పుణ్యాత్ముడు ఈ జన్మలో మీ కుమారుడుగా జన్మించాడు. అప్పటి శ్రీకృష్ణులవారి అనుగ్రహం చేత ఈ జన్మలో కూడా ఎంతో గొప్ప వేణు విద్వాంసుడు అవుతారు అని అన్నారు.

ఇది జరిగి ఎన్నో సంవత్సరాలు అయింది విశ్వపతి గారూ ఈ రోజు మీరు అదే విషయం చెప్పారు. నాకెంతో ఆనందం, ఆశ్చర్యం కలిగాయి. ఎన్నో జన్మల పుణ్యఫలం చేత నేను మిమ్మల్ని కలుసుకునే మహాభాగ్యం కలిగింది అని అన్నారు. నేనెంతో సంతోషపడి వారి కుటుంబాన్ని శ్రీకృష్ణుల వారు ఎప్పుడూ చల్లగా చూస్తారని అన్నాను.

ఇటువంటి సంఘటనలు నాకు ఎన్నోసార్లు జరిగాయి. నేను చెప్పిన విషయం వారికి ఇంతకుముందే ఎవరో మహానుభావులు చెప్పారని అదే విషయం నేనిప్పుడు అన్నానని చెప్తుంటారు. నేను ఇంతకుముందు చెప్పినట్లుగా

నన్ను ఏ వ్యక్తిఅయినా కలిసినప్పుడు వారి అనేక జన్మలు నా కంటి ముందు అప్రయత్నంగా కనిపిస్తాయి. వాటిలో కొన్ని విశేషాలు అప్పుడప్పుడు కొంతమందికి చెప్తుంటాను.

ఇలా ధ్యానంలో నేను అనేక యుగాల దృశ్యాలను చూడగలిగాను. ఒకనాడు అలా త్రేతాయుగంలో శ్రీరాముల వారు వనవాసం చేస్తున్నప్పుడు ఉన్న పర్ణశాలను దర్శించాను. ఆ పర్ణశాల ఎంతో అద్భుతంగా ఉంది. అప్పుడు ఒకనాడు అక్కడకి ఒక పక్షి వచ్చి సీతారాముల ప్రక్కనే నేలపై వాలి ఎంతో అద్భుతంగా కూసింది. సీతమ్మ వారు ఆ పక్షిని చూసి ఎంతో ముచ్చటపడింది.

ఆ పక్షి రోజు ఉదయం సాయంత్రం వేళలలో సీతారాముల వద్దకు వచ్చి ఎంతో చక్కగా గొంతెత్తి పాడేది. సీత ముచ్చట చూసిన రాములవారు ఈ పక్షి తరువాత కలియుగంలో ఒక అద్భుత సంగీతజ్ఞురాలిగా జన్మిస్తుంది అని అన్నారు. ఆ పక్షియే మనకందరికి తెలిసిన ఒక దక్షిణ భారత మహా గొప్ప సంగీత విద్వాంసురాలు. ఆమె తన గానంతో ఆ పురుషోత్తముని నిత్యం కీర్తిస్తూ తన జన్మ ధన్యం చేసుకుంది. ఆ స్వామి ఆనాడు పక్షికి ఇచ్చిన వరంచేత ఆ స్వామితో పాటు ఆమె కీర్తనలు వింటున్న మనందరం కూడా ఎంతో ధన్యులం అయ్యాము.

ఇలా నా ముందు ఎన్నో యుగాలకు సంబంధించిన ఎన్నో సంఘటనలు నా హృదయంలోనే కనబడుతున్నాయి. శరీరమంతా ఎంతో అద్భుతమైన ఆనందంతో పులకరిస్తుంది. ఆయా యుగాలలో ఉన్న ఎందరో వ్యక్తులు ఈ కలియుగంలో కూడా అప్పుడప్పుడు అనేక ప్రాంతాలలో జన్మించడం గమనించాను. వారు ఎవరో కూడా నాకు అర్థమైంది. ఆ యుగాలలోని దృశ్యాలన్నీ అలా నా మనో నేత్రానికి కనబడినప్పుడు ఎంతో గొప్ప అనుభూతి కలుగుతుంది. అప్పటి యుగాలలోని ఎన్నో లక్షల మంది తరువాత ఎన్నో జన్మలెత్తుతూ ఇప్పటికి మన మధ్యనే ఉండడం గమనించాను.

ఇంతే కాదు ఆయా యుగాలలో ఉన్న ప్రదేశాలలో అటు తరువాత కాలాలలో ఏ కట్టడాలు ఉన్నాయి. ప్రస్తుత కలియుగంలో ఆ ప్రదేశాలలో ప్రస్తుతం ఉన్న కట్టడాలు ఎంతో స్పష్టంగా కనబడ్డాయి. ద్వాపర

యుగంలో మహర్షుల ఆశ్రమాలు ఉన్న కొన్ని ప్రదేశాలలలో నేడు గొప్ప దేవాలయాలు ఉండడం గమనించాను. అలాగే మహర్షులు తపస్సు చేసిన కొన్ని ప్రదేశాలు ఈ రోజు గొప్ప పుణ్యక్షేత్రాలుగా వెలుగుతుండడం గమనించాను.

ఎంతటి అద్భుతాలు? కాల మహిమ ఎంతటి విచిత్రమైనది? యుగయుగాలలో ఒకే ప్రదేశంలో ఎన్నెన్ని రకాల అద్భుత కట్టడాలు ఒక వెలుగు వెలిగి తరువాత కాలంలో పూర్తిగా శిథిలమై కనీసం వాటి ఆనవాలు కూడా లేకుండా కొంత కాలానికి మరికొన్ని కట్టడాలు రావడం ఆ తరువాత అవి కూడా శిథిలమై కాల ప్రవాహంలో ఒకే ప్రదేశంలో ఎన్నో రకాల కట్టడాలు రావడం ధ్యానంలో గమనించాను.

ఇలా అప్పుడప్పుడు ధ్యానంలోకి వెళ్ళినప్పుడు అప్రయత్నంగానే ఎన్నో అద్భుత దృశ్యాలు దర్శించాను. అలా దర్శిస్తున్నప్పుడు కలిగిన అనుభూతి మాటలలో వర్ణించలేనిది. ఎంతో అద్భుతమైనవి. కాల ప్రవాహంలో ఎన్నెన్ని మార్పులు? ఆ మార్పులన్నీ కంటిముందు ఒక దివ్య దృశ్యంలా వెళుతుంటే నాకు దివ్య అనుభూతి కలిగింది.

27

ఇలా నేను పూర్వజన్మ స్మృతుల లోనికి వెళ్ళినప్పుడు ఇంకా ఎన్నో ఆశ్చర్యకరమైన విషయాలు తెలిసాయి. ప్రతీ వ్యక్తి పుట్టినప్పటినుంచి కలిసే ప్రతీ వ్యక్తి, నివసించే ప్రతీ ప్రదేశానికి, జరిగే ప్రతీ సంఘటనకి, చేసే ప్రతీ పనికి పూర్వజన్మల బంధం ఏదో తప్పక ఉండి ఉంటుంది. ఒక విధంగా బుద్ధిః కర్మానుసారిణి అంటే ఇదే! మన పూర్వకర్మల ఫలంగా మన బుద్ధి ప్రవర్తిస్తుంది. ఎన్నో జన్మలు మనం ఎంతో గట్టిగా ప్రయత్నిస్తే తప్ప మన బుద్ధిలో మార్పురాదు. అలా కొన్ని జన్మలు సద్బుద్ధితో జీవించిన తరువాత మనకు ఉత్తమ జన్మలు లభిస్తాయి.

మన భార్యకాని, భర్తకాని, సంతానం కాని, బంధువులు కాని, స్నేహితులు కాని అన్నీ పూర్వజన్మల బంధాల వలనే ఒనగూరుతాయి. మనం ఏ ఇంట్లో పుట్టాం అన్నదే మన జీవితాన్ని దాదాపు సగం నిర్ణయిస్తుంది కదా! నువ్వు అహ్మదాబాద్‌లో అంబానీ కుమారుడుగా పుట్టవచ్చు లేదా అమలాపురంలో ఒక చిన్న రిక్షా తొక్కి జీవనం సాగించే అతి పేద ఇంట్లో జన్మించవచ్చు. ఇదంతా మళ్ళీ పూర్వజన్మ కర్మ ఫలమే! ఇంతే కాదు ఈ జన్మలో అంబానీ కుమారుడికి అతడి

తండ్రితోను, రిక్షా వాని కుమారుడికి అతని తండ్రితోను క్రిందటి జన్మలలో ఎప్పుడో ఏదో బంధం ఉండి ఉంటుంది. అందుకే ఆయా కుటుంబాలలో వారి కుమారులుగా జన్మించారు.

పూర్వజన్మలలో చేసుకున్న, పుణ్య పాప ఫలాలు రెండూ కూడా దేనికదే విడి విడిగా తరువాత జన్మలలో అనుభవిస్తాం. మనం ఒకోసారి ఎంతో కోటీశ్వరుల ఇంట్లో పుట్టినవారు చిన్నప్పటి నుండి మూగతనంతోనో లేదా అవిటితనంతోనో జన్మించడం చూస్తాం. ఆ పిల్లవాడికి పూర్వజన్మ పుణ్యఫలం వలన కోటీశ్వరుల ఇంట్లో జన్మించాడు. కాని ఏం లాభం...పూర్వజన్మ పాపఫలం వలన జీవితాంతం ఇలా అనారోగ్యంతో ఉండవలసిందే కదా! అలాగే ఆ కోటీశ్వరుడికి పిల్లవాడు కలిగే యోగం ఉంది. కాని పూర్వజన్మ కర్మఫలం వలన ఆ పిల్లవాడు పుట్టడంతోనే అనారోగ్యంతో పుట్టాడు. ఇటువంటి కర్మఫలాలు ముందు ముందు జన్మలలో జరగకుండా ఈ జన్మలో మనం జాగ్రత్తపడాలి. జాగ్రత్తపడడం అంటే సంస్కారవంతంగా జీవించాలి. మనకి వీలున్నన్ని మంచి పనులు చెయ్యాలి. మనం చేస్తున్న పుణ్యకార్యాలు అన్నీ భగవదర్పణంగా చెయ్యాలి. మనం గొప్ప పనులు చేస్తున్నాము అనుకోకూడదు. అలా అనుకున్నట్లయితే ఈ పుణ్యఫలం మన ఆత్మని పట్టుకొని ఇది అనుభవించడానికి తిరిగి తిరిగి అనేక జన్మలు ఎత్తవలసి వస్తుంది.

నన్ను హిమాలయాశ్రమంలో కలిసిన 108 మందే కాక ఇంకా నన్ను అనేక జన్మలలో కలుసుకున్నవారు కూడా కొందరు ఈ జన్మలో నన్ను తిరిగి కలిసారు. వీరిలో కొందరు ఇప్పటికే ఎన్నో ఉత్తమ జన్మలలో జన్మించి ముందు రాబోయే జన్మలలో ఎంతో గొప్పవారిగా జన్మిస్తారు. లోక కళ్యాణార్థం గొప్ప పనులు చేస్తారు. నేను ఒక జన్మలో కాశీలో పండితునిగా జన్మించినప్పుడు నన్ను కలిసిన 108 మంది మళ్ళీ ఈ జన్మలో నన్ను కలవడం గమనించాను. వీరందరు ఆ జన్మలో ఒకనాడు కాశీలో జరిగిన ఒక గొప్ప పండిత సభకు వచ్చిన మహా పండితులు దేశంలోని ఎక్కడెక్కడ ప్రాంతాలనుంచో వచ్చిన మహా జ్ఞానులు ఆ పండిత సభలు ఒక వారంరోజులపాటు ఎంతో అద్భుతంగా జరిగాయి. వచ్చిన పండితులందరు ఎన్నెన్నో శాస్త్రాల మీద ఎంతో అద్భుతంగా ప్రసంగించారు.

ఆ పండిత సభలలో పాల్గొన్నవారికి ఎన్నో క్రొత్త విషయాలు తెలిసాయి. ఆ 108 మంది మధ్య ఎంతో గొప్ప అవినాభావ సంబంధం కలిగింది. వీరందరూ తరువాత జన్మలలో వేరు వేరు ప్రదేశాలలో జన్మించి, ఈ జన్మలో తిరిగి నన్ను కలిసారు. ఇంకా కొంతమంది కలవ వలసి ఉంది. ఈ జన్మలో వీరందరూ గొప్ప వేద పండితులుగాను, రచయితలుగాను, శాస్త్రజ్ఞులుగాను, ఇంజనీర్లగాను, న్యాయమూర్తులుగాను, జర్నలిస్టులుగాను, కొంతమంది అతి సామాన్యులుగాను జన్మించినప్పటికి ఎంతో గొప్ప సంస్కారంతో జీవిస్తున్నారు. వీరిలో చాలామంది జీవితాలలో అనుకోని కష్టాలు ఎదురై ఎంతో శారీరక, మానసిక బాధలకు లోనౌతున్నారు. అయిన ఆ దివ్యశక్తి అనుగ్రహంచేత పూర్వజన్మ పుణ్యఫలం వలన మనోధైర్యం కోల్పోక దృఢచిత్తంతో జీవిస్తున్నారు.

ఇలాగే నేను ఒక జన్మలో తమిళనాట మధురైలో జన్మించినప్పుడు నాతో మరొక 108 మంది ఎంతో సన్నిహితంగా ఉన్నారు. అప్పుడక్కడ ఒక పెద్ద వైష్ణవ సభ ఉండేది. ఆ సభలో 108 మంది గొప్ప వైష్ణవ పండితులు సభ్యులుగా ఉండేవారు. వైష్ణవ సాంప్రదాయంలో ఉన్నప్పటికీ వీరందరూ ఎంతో విశాల దృక్పధంతో అన్ని సాంప్రదాయాలవారిని ఎంతో గౌరవించేవారు.

వీరందరూ కూడా ఎంతో ఉత్తమ సంస్కారాలతో జీవించేవారు. ఆ జన్మలో నేను ఆ వైష్ణవ సభకు ముఖ్య సలహాదారుగా ఉన్నాను. వారందరూ నాతో ఎంతో సన్నిహితంగా ఉండేవారు. ఆ జన్మలో బంధం అలా కొనసాగి తరువాత జన్మలలో వారు వేరు వేరు దేశాలలో, వేరు వేరు రాష్ట్రాలలో, వేరు వేరు మతాలలో, వేరు వేరు కులాలలో జన్మించి తిరిగి ఈ జన్మలో నన్ను కలుసుకున్నారు.

ఇలాగే మరొక జన్మలో నేను కర్ణాటకలోకి శృంగేరి పట్టణంలో జన్మించినపుడు అక్కడ శ్రీ శారద మఠంలో ఒకసారి గొప్ప పండిత మహాసభలు జరిగాయి. ఆ సభలకు దేశవ్యాప్తంగా 108 మంది గొప్ప పండితులు వచ్చారు. ఆ సభలకు ముఖ్య సమన్వయకర్తగా నేను వ్యవహరించాను. ఆ పండితులందరూ ఒక నెలరోజులపాటు అక్కడ శ్రీ శృంగేరి మఠంలోనే ఉన్నారు. అలా కలిసి నెలరోజులు గడపడంతో మా అందరి మధ్య ఎంతో గొప్ప సాన్నిహిత్యం

కలిగింది. వీరందరూ తరువాత ఎన్నో ఉత్తమ జన్మలలో జన్మించి తిరిగి ఈ జన్మలో నన్ను కలుసుకున్నారు. అప్పటి ఆ బంధం కారణంగా ఈ జన్మలో కూడా నాకెంతో సన్నిహితులయ్యారు. అలాగే వీరిలో కూడా కొందరికి ఒకరితో ఒకరికి ఎంతో గొప్ప సాన్నిహిత్యం ఏర్పడింది.

ప్రతీ మనిషి తన జీవితంలో ఎన్నో కష్టాలు పడుతుంటాడు. ఒక్కోసారి కొంతమంది కుటుంబ సభ్యులపైనో, సన్నిహితులపైనో ఎంతో కోపం వచ్చి అస్సలు మనశ్శాంతి ఉండదు. అటువంటి సమయాలలో ఇవన్నీ పూర్వజన్మ బంధాల వలన ఏర్పడినవని గ్రహించండి. అయితే ఇది చెప్పినంత సులభం కాదని నాకు తెలుసు. దగ్గర వాళ్ళను పోగొట్టుకోవడం, ఆర్థికంగా నష్టాలలో పడడం, మనకు ఏదైనా అనుకోని అనారోగ్యం కలగడం, మనకుటుంబంలోని వారు ఒక్కసారిగా తీవ్ర అనారోగ్యానికి లోనవ్వడం ఇవన్నీ మనకు ఎంతో బాధ తెప్పిస్తాయి. కాని ఇవన్నీ కూడా మనం ఎన్నో జన్మలలో చేసుకున్న ప్రారబ్ధ కర్మల ఫలంగా గ్రహించి మనస్సుని నిగ్రహించుకోవాలి.

మనం కొంచెం ప్రయత్నం చేస్తే మన బుద్ధి సన్మార్గంలో పయనించడానికి భగవంతుడు తప్పక సహాయం చేస్తాడు. బుద్ధిఃకర్మానుశారిణి అంటారు కాని, మనకు భగవంతుడిచ్చిన విచక్షణా జ్ఞానంతో ఆ బుద్ధిని సన్మార్గంలో నడిపిస్తే మన ప్రారబ్ధ కర్మ తీవ్రత కూడా తప్పక తగ్గుతుంది. ఇలా కొన్ని వేలజన్మలు ప్రయత్నిస్తే మనం ఈ జనన మరణ చక్రం నుంచి తప్పక విముక్తులౌతాము. అందుకని మనం అందరం మంచి మార్గములో నడవడానికి గట్టిగా ప్రయత్నించాలి. గట్టిగా ప్రయత్నించేవారికి ఆ భగవంతుడి ఆశీస్సులు, సహాయం తప్పక ఉంటుందని గ్రహించాలి.

28

ఏ జన్మలోనైనా చేసిన పాప పుణ్యాల ఫలం తరువాత ఏ జన్మలో అనుభవానికి వస్తుందన్నది పూర్తిగా భగవంతుడి నిర్ణయం ప్రకారం జరుగుతుంది. ఒక వ్యక్తి నూరు జన్మల క్రితం ఒక పది జన్మలు సామాన్య మానవుడిగా ఉండవచ్చు. ఇప్పటి జన్మలో అతను గొప్ప సంగీతకారుడో, గొప్ప రచయితో అవ్వచ్చు. ఎప్పుడో చేసుకున్న పుణ్యఫలం కొద్దీ గొప్ప పేరు తెచ్చుకున్న ఇతడు మళ్ళీ వచ్చే జన్మలో అతి సామాన్య జీవితం అనుభవించవచ్చు.

ఆ మధ్య నేను అమెరికా దేశంలోని డలాస్ నగరం వెళ్లినప్పుడు ఒక హోటల్ లో సర్వర్‌గా చేస్తున్న యాండర్‌సన్ అనే వ్యక్తిని చూసాను. అతడు ఒక రెండు వందల సంవత్సరాల క్రితం అమెరికాలో గొప్ప రచయితగా జన్మించాడు. ఆ జన్మలో గొప్ప రచయితగా పేరు సంపాదించుకొన్నప్పటికి కొన్ని పాప కార్యాలు చేసిన ఫలితంగా తరువాత అనేక సామాన్య జన్మలెత్తుతూ ఈ జన్మలో ఒక హోటల్‌లో సర్వర్‌గా పనిచేస్తున్నాడు. అలాగే మరొకచోట పూర్వజన్మలలో ఒక గొప్ప హిందీ సినిమా నటుడిని ఈ జన్మలో హైదరాబాద్ లో

అతి సామాన్య జీవితం గడుపుతున్న వాడిగా చూసాను. ఇప్పటికి ఇతడికి పూర్వజన్మ వాసనలు పోక వచ్చిన ప్రతీ హిందీ సినిమా చూస్తుంటాడు. డల్లాస్‌లోని రాబిన్‌సన్ కూడా ఎక్కడ ఏ చిన్న కాగితం మీద కూడా ఏం వ్రాసి ఉన్న ఎంతో ఉత్సుకతతో చదువుతాడు.

కాబట్టి మనం ఈ జన్మలో మనచుట్టూ సమాజంలో ఉన్నత స్థానాలలో ఉన్న వ్యక్తుల గురించి, వారు ప్రస్తుత జీవితంలో అనుభవిస్తున్న భోగ భాగ్యాల గురించి ఈర్ష్య పడకూడదు. అలాగే మనం ఈ జన్మలో ఎంతో ఉన్నత స్థానంలో, ఐశ్వర్యవంతులై ఉండి ఉన్నట్లయితే మన బంధువులను మనదగ్గర పనిచేసేవారిని ఏ మాత్రం చులకనగా చూడకూడదు. ఎందుకంటే క్రిందటి జన్మలో నీవు కూడా అటువంటి అతి సామాన్య వ్యక్తివే ! అంతే కాదు వచ్చే జన్మలో కూడా సామాన్యుడుగానే పుడతావు. వచ్చే ఒక్క జన్మ ఏమిటి ? వచ్చే నూరు జన్మలలో కూడా నీవు అతి సామాన్యుడిగా పుట్టవచ్చు. మనం ఈ కోణంలో ఆలోచించడం నేర్చుకోవాలి. మనందరం ఈ సమాజంలోని తోటి వ్యక్తుల పట్ల ఈ దృక్పథం అలవాటు చేసుకోవాలి. అప్పుడే మనం ఆనందంగా ఉండగలుగుతాము. మన చుట్టూ ఉన్నవారు కూడా ఆనందంగా ఉంటారు.

అసలు ఆనందం అంటే ఏమిటి ? ఆనందానికి ఎవరైనా సరియైన నిర్వచనం ఇవ్వగలరా ! ఒకరికి ఒక సినిమా చూస్తే ఆనందం ఒకరికి డబ్బు సంపాదించడం ఆనందం మరొకరికి ఎంత డబ్బు సంపాదించినా ఏమాత్రం డబ్బు ఖర్చుపెట్టకపోవడం ఆనందం. కొంతమంది ఎంత పిసినారిగా ఉంటారంటే వాళ్ళ కుటుంబ సభ్యులకు అనారోగ్యం కలిగినా ఒక్కరూపాయి ఖర్చుపెట్టడానికి వంద సార్లు ఆలోచిస్తారు. వారికి డబ్బును అలా చూసుకొనడంలోనే ఆనందం ! మరొకరికి పది రూపాయలు సంపాదిస్తే ఆ పదిరూపాయలు ఖర్చుపెట్టేస్తేనే ఆనందం ! ఒకరికి ఎప్పుడూ ప్రయాణం చేయడం ఆనందం ! మరొకరికి దేశంలోని పుణ్యక్షేత్రాలు చూడడం ఆనందం ! మరొకరికి ఎటూ కదలకుండా ఇంట్లో కూర్చోవడం ఆనందం !.

ఒక్కసారి ఆలోచించండి ఆనందం ఇన్ని రకాలుగా ఉంటుందా? లేక ఇవన్నీ ఆనందాలు అని మనం భ్రమ పడుతున్నామా? ఆనందాన్ని ఇంత, అంతా అని లెక్కించలేము. ఒక పెద్ద వ్యాపారవేత్తకి ఒకరోజు కోటి రూపాయలు

సంపాదిస్తే వచ్చే ఆనందం ఆ ఆఫీసు ప్రక్కనే ఉన్న టీస్టాల్ లో ఐదు రూపాయలు ఇచ్చి బయట స్టూలుపై కూర్చొని ఒక కాఫీత్రాగే వ్యక్తి ఆనందంతో సమానం అవ్వచ్చుకదా ! ఆనందం అనేది ఆత్మకు, మనస్సుకు, శరీరానికి సంతోషం ఇచ్చేదే అసలైన ఆనందం. ఎప్పుడైతే ఆత్మ, మనస్సు ఆనందమైన స్థితిలో ఉంటాయో అప్పుడు శరీరం కూడా ఆనందంగా ఉంటుంది. మనం ఎప్పుడూ మన చుట్టుప్రక్కల విషయాలన్నీ శాశ్వతం అని తలవకుండా వాటితో బంధం పెట్టుకోకుండా ఈర్ష్యా ద్వేషాలకు లోనవకుండా జీవిస్తే అప్పుడే మన ఆత్మ, మనస్సు, శరీరం ఆనందంగా ఉంటాయి. అదే స్థిత ప్రజ్ఞతగా చెప్పబడుతుంది. ఎవరైతే నిత్య జీవితంలో మంచి పనులు చేస్తూ ఆ పుణ్యఫలం కూడా వారికి అంటకుండా జీవిస్తారో వారు నిశ్చలమైన మనస్సుతో ఎప్పుడూ ఆనందంగా ఉండగలుగుతారు.

అందరు అనుకునేటట్లు ఇది ఏమాత్రం కష్టం కాదు. గట్టిగా ప్రయత్నిస్తే ఎవరికైనా సాధ్యమవుతుంది. అయితే ఇలా ఉండడానికి ఎవరు ప్రయత్నించరు. ఒక విధంగా చెప్పాలంటే ప్రయత్నించడానికి ఇష్టపడరు. కూడా ఎందుకంటే చాలా మంది స్థితప్రజ్ఞత వలన తమకు ఉన్న ఆనందం కోల్పోతాము అని తలుస్తారు. కాని స్థితప్రజ్ఞత అంటే ఆనందం కోల్పోవడం కాదు అని వీరు గ్రహించరు. స్థితప్రజ్ఞత లోనే అసలైన శాశ్వత ఆనందం ఉందని గ్రహించరు. చిన్న చిన్న విషయాలను ఆనందంగా భ్రమించి పరిగెట్టడం మాని శాశ్వతానందం ఒకటి ఉందని అదే స్వచ్ఛమైనది, శాశ్వతమైనది అని అందరూ గ్రహించాలి.

శ్రీలక్ష్మీశ్రీనివాస కటాక్ష సిద్ధిరస్తు!
సర్వేజనా సుఖినోభవంతు!
సమస్త కళ్యాణానిభవంతు!



అజ్ఞానినా మయాదోషా నశేషాన్విహితాన్ హరే
క్షమస్వ త్వం క్షమస్వ త్వం శేషశైల శిఖామణే.

విశ్వపతి కలం పేరుతో ప్రసిద్ధులైన తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి బ్రహ్మశ్రీ తిమ్మరాజు లక్ష్మీ నరసింహరావు, నాగ రత్నాంబ దంపతులకు 1956లో జన్మించారు. విశ్వపతి 1978లో బి.ఇ. 1983లో ఎం.టెక్ చదివి, 1984 నుంచి 1988 దాకా ఆల్విన్ కంపెనీలో పనిచేసారు. తరువాత యమ్.వి.యస్.ఆర్. ఇంజినీరింగ్ కాలేజీలో చేరారు. విశ్వపతి 1984 నుంచి 1990 వరకు ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో కార్టూన్‌లు వేశారు. ఆయన కార్టూన్లు వివిధ మ్యాగజైన్లలో ప్రచురించబడ్డాయి.

విశ్వపతి 1998 నుంచి వేదిక్ లోగో డిజైన్ రంగంలో ఉన్నారు. వేద శాస్త్రాల ఆదారంగా ఇప్పటిదాకా ప్రపంచ వ్యాప్తంగా 6,000 పైగా సంస్థలకు పేర్లు నిర్ణయిం, లోగోలు డిజైన్ చేశారు. ఈ సంస్థలన్నీ ఈరోజు ఎంతో ప్రముఖ స్థానంలో ఉన్నాయి.

స్వతహాగా శ్రీవేంకటేశ్వర స్వామి వారి భక్తులు అయిన విశ్వపతి ఇప్పటిదాకా 28 ఆధ్యాత్మిక పుస్తకాలు రాసారు. వీటిలో 18 పుస్తకాలు శ్రీనివాసుని పైననే ఉండడం విశేషం. వీరు రాసిన ఈ పుస్తకాలన్నీ వీరు పూర్తి ఉచితంగా పంచుతున్నారు. ఇవన్నీ ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులచేత నిత్యం చదవబడుతున్నాయి. వీరి పుస్తకాలు ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలైన హార్వర్డ్, కార్నెల్, కేంబ్రిడ్జి, ఆక్స్ఫర్డ్, హేయదేల్బర్గ్, రాయల్ డెన్మార్క్ లైబ్రరీ, ఫిలిప్పీన్స్ విశ్వవిద్యాలయ లైబ్రరీలలో ఉంచబడ్డాయి.

వీరికి ఈ పుస్తకాలు రాస్తున్నప్పుడు ఎన్నో దివ్యానుభూతులు కలిగాయి. ఒకసారి విశ్వపతి ధ్యానంలో ఉన్నత స్థితికి వెళ్ళినప్పుడు తన పూర్వజన్మల వృత్తాంతాలన్నీ తెలిసాయి. తాను 200 సంవత్సరాల క్రితం హిమాలయాలలో ఒక దివ్యాశ్రమంలో ఉన్నానని అప్పుడు తనను ఎక్కడెక్కడి నుంచో 108 మంది వచ్చి కలిసినట్లు గ్రహించారు. వీరందరు ఈ జన్మలో తిరిగి తనని ఆశ్చర్యకర రీతులలో వచ్చి కలవడం విశ్వపతికి చాలా ఆనందం కలిగించింది.

వీరికి జీవితంలో జరిగిన అనేక ఆధ్యాత్మిక అనుభవాలు, అనుభూతులను ఈ అమృత తరంగిణి పుస్తకంలో రాసారు. ఈ పుస్తకం చదివిన మీ అందరికి కూడా ఎన్నో దివ్య అనుభూతులు కలుగుతాయని విశ్వపతి నమ్మకం.

Mr. T.V.R.K. Murthy (Viswapathi)
www.lordofsevenhills.com
viswapathi@yahoo.com
Ph. : 9849443752